ఈనాడు eeYuva.com Learn. Share. Grow.
FASHION TRAVEL MOVIES FOOD GADGETS HEALTH SPORTS

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 13-8-2019 మంగళవారం సిటీ సంపుటి 46 సంచిక 4

రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

మంచి చదువుల మార్గమిది
ఈనాడు చదువు

పదేళ్లకొచ్చిందీ పండగ

నాగార్జునసాగర్ డ్యాం అన్ని గేట్లను సోమవారం ఎత్తడంతో కిందికి దూకుతున్న కృష్ణమ్మ 11లో

నెట్టింట విప్లవం

వచ్చే నెల నుంచే జియో ఫైబర్

ఒకే కనెక్షన్‌తో ఇంటర్నెట్, టీవీ, టెలిఫోన్

మీ ఇంట సాంకేతిక విప్లవం రాబోతోంది. ఒకే కనెక్షన్‌తో ఇంటర్నెట్, టీవీ, టెలిఫోన్ సౌకర్యాలను అందించేందుకు అత్యాధునిక జియో ఫైబర్ వచ్చేస్తోంది. ఉచితంగా టీవీ కనెక్షన్, దేశంలో ఎక్కడికైనా పైసా ఖర్చులేకుండా మాట్లాడుకునేలా ల్యాండ్‌లైన్ టెలిఫోన్, ఒకేసారి దేశ విదేశాల్లోని నలుగురితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుకునే అవకాశం వంటి సదుపాయాలను ఇది అందించనుంది. అమెరికాలోని నెట్ సగటు వేగం కంటే దీని వేగం ఎక్కువ. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ జియో ఫైబర్ వివరాలను సోమవారం ముంబయిలో వెల్లడించారు.

...వివరాలు ఈనాడు బిజినెస్ లో

ఇంట్లోనే సినిమా రిలీజ్

ప్రీమియం చందాదారులు థియేటర్లలో విడుదలైన రోజే తమ ఇంట్లోనూ కొత్త సినిమా చూసే సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తాం.

–ముకేశ్ అంబానీ

ప్రారంభం ఎప్పుడు	నెల వారీ అద్దె	ఇంటర్నెట్ వేగం	అందించే పరికరాలు	లభించే సౌకర్యాలు	పే ఛానళ్లకు అదనం
సెప్టెంబరు 5 నుంచి	కనిష్ఠం: రూ.700 గరిష్ఠం: రూ.10,000 (పన్నులు అదనం)	కనిష్ఠం: 100 ఎంబీపీఎస్ గరిష్ఠం: 1 జీబీపీఎస్	వైఫై మోడెం, జియో 4కే సెట్‌టాప్ బాక్స్ (ఉచితం). వార్షిక చందాదారులకు ఎల్ఈడీ టీవీ ఉచితం	ఇంటర్నెట్, సాధారణ టీవీని స్మార్ట్ టీవీగా మార్చుకునే అవకాశం, లైవ్ టీవీ ఛానళ్లు, ఉచితంగా వీడియో కాన్ఫరెన్స్, గేమింగ్, వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ సొల్యూషన్లు	పే ఛానళ్లను ఫైబర్ లేదా డీటీహెచ్ ద్వారా పొందేందుకు చందాదారులు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని కంపెనీ సీనియర్ అధికారి తెలిపారు.

తెలుగు వారి చరిత్రలో కొత్త అధ్యాయం లిఖిస్తాం

- జగన్‌కు పెద్దన్నలా సహకరిస్తా: కేసీఆర్ 6లో

కాంచీపురంలో అత్తివరదర్ స్వామి సేవలో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అర్చకుల ఆశీర్వాదం. పక్కన సీఎం సతీమణి శోభ, ఎమ్మెల్యే రోజా

netmeds.com
ఇండియాకి ఫార్మసీ
బహుగొప్ప 'ఫ్రీ' డమ్ సేల్
పూర్తి 20% తగ్గింపు*
+
అత్యధికంగా ₹3000 ఎన్ఎమ్ఎస్ సూపర్ క్యాష్*
(100% క్యాష్‌బ్యాక్)
కూపన్ కోడ్: FREEDOM20
PayPal తో చెల్లించండి
సురక్షితమైనది
అత్యధికంగా ₹400 పూర్తి 10% పేపాల్ క్యాష్‌బ్యాక్ వౌచర్
మరిన్ని ఉత్సాహపరిచే ఆఫర్స్‌ని కనుగొనేందుకు netmeds.com విజిట్ చేయండి
#HarGharMeinMahi
కాల్: 72007 12345(లేదా)
మమ్మల్ని దీనిపై విజిట్ చేయండి:www.netmeds.com
మెడిమిక్స్ యాప్‌ని దీనిపై డౌన్‌లోడ్ చేసుకోండి
ప్రిస్క్రిప్షన్ మందులు కచ్చితంగా రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్ ద్వారా కొనుగోలు చేయబడిన ప్రామాణికమైన ప్రిస్క్రిప్షన్‌పై మాత్రమే ఇవ్వబడతాయి। *నియమ-నిబంధనలు వర్తిస్తాయి.

18 ఏళ్లలో తొలిసారి సెలవు

ప్రకృతితో కలిసి జీవించాలి.. పోరు వద్దు

బేర్‌గ్రిల్స్‌తో కలిసి మోదీ సాహసయాత్ర

14లో

రాజధానిపై డెంగీ పంజా

ప్రైవేటు ఆసుపత్రులకు పదుల సంఖ్యలో బాధితులు

గత నెలలో గాంధీలో 72 మందికి వ్యాధి నిర్ధరణ

జ్వరాల తీవ్రతతో నగరంలో ఓ వసతి గృహం ఖాళీ

5లో

భారీ వర్షాలతో అనేక రైళ్ల రద్దు

2లో

గాలికూట విషం

యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమలు

3లో

vivo
S1 32MP
It's My Style

32MP Selfie Camera • Flash In-Display Fingerprint
4500mAh Battery • 18W Dual-Engine Fast Charging

Exclusive Offers
7.5% Cashback HDFC BANK Debit/Credit Card EMI transactions
Pay in shops using Paytm. Get up to ₹2,500 Paytm Cashback
Telecom Partner
Jio DIGITAL LIFE BENEFITS WORTH ₹10000
Attractive EMI Offers
BAJAJ FINSERV EMI NETWORK
HOME CREDIT 0% EASY EMI OPTIONS FAST PROCESSING Missed Call 9004690046
IDFC FIRST Bank
HDB FINANCIAL SERVICES

T&C apply. HDFC Bank 7.5% Cashback applicable on Credit/Debit Card EMI & Consumer Loans. 5% Cashback applicable on regular HDFC Bank Credit Card swipes. Paytm 10 coupons worth ₹2500, ₹250x5 of electricity and ₹250x5* of Paytm mall valid on minimum transaction value ₹600. Offers valid within the territory of Andhra Pradesh. Images are shown only for the representational purpose. Other product names, logos and brands are property of respective owners. Use of other product names, logos and brands does not imply endorsement.

Deal with e-waste responsibly. Visit: vivo.com/in/ewaste. Protect environment from e-waste.

గాయత్రి పంపుహౌస్ నుంచి ప్రయోగాత్మకంగా ఒక మోటారు ద్వారా నీటి పంపింగ్

గాయత్రి పంపుహౌస్

గాయత్రి నుంచి మధ్య మానేరుకు..

- కాళేశ్వరంలో మరో అరుదైన ఘట్టానికి అంతా సిద్ధం
- గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి తరలింపునకు ఏర్పాట్లు
- రెండు, మూడు రోజుల్లో ముఖ్యమంత్రిచే ప్రారంభం

ఈనాడు - హైదరాబాద్

బాహుబలి పంపులు.. అత్యంత లోతైన భూగర్భ పంపుహౌస్, సర్జిపూల్‌తో అతిపెద్ద ఎత్తిపోతల పథకంగా పేరొందిన కాళేశ్వరం ప్రాజెక్టులోని 8వ ప్యాకేజీ మరో అరుదైన ఘట్టానికి సిద్ధమైంది. రోజూ రెండు టీఎంసీల జలాలను 111.4 మీటర్ల ఎత్తిపోయగల పంపుహౌస్ (గాయత్రి) పూర్తిస్థాయిలో ప్రారంభానికి ముస్తాబవుతోంది. ప్రస్తుతం పలు దఫాలుగా ప్రయోగాత్మక పరీక్షలు చేపట్టి పంపులను పరీక్షిస్తున్నారు. గాయత్రి పంపుహౌస్ నుంచి మధ్యమానేరుకు నీటిని తరలించే ప్రక్రియను రెండు, మూడు రోజుల్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభింపజేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకు 14వ తేదీ బుధవారం శుభ ఘడియలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు.

కాళేశ్వరంలోనే అతి పెద్దదైన భూగర్భ పంపుహౌస్, నిర్మాణం, నిర్వహణపరంగా అనేక విశిష్టతలు సొంతం చేసుకోవడంతో ప్రస్తుతం అందరి దృష్టి 'గాయత్రి'పైనే ఉంది. అమెరికా, లిబియాల్లో నిర్మించిన ఎత్తిపోతల పథకాలను తలదన్నే స్థాయిలో భూగర్భంలో పంపుహౌస్‌ను నిర్మించారు. ఆరో ప్యాకేజీ నుంచి ఈ పంపుహౌస్‌కు నీరు చేరుతోంది. ఇక్కడి నుంచి ఎత్తిపోసి మధ్య మానేరుకు నీటిని తరలించే పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

నీటిని ఎలా తరలిస్తారంటే..

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ప్యాకేజీ-6లోని నంది పంపుహౌస్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. అక్కడి పంపుహౌస్ నుంచి ఎత్తిపోసి నందిమేడారం జలాశయంలోకి తరలిస్తున్నారు. ఈ జలాశయం నుంచి ప్యాకేజీ-7 లోని జంట సొరంగాల ద్వారా ప్యాకేజీ-8లోని గాయత్రి పంపుహౌస్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక్కడి నుంచి భారీ మోటార్లతో ఎత్తిపోసి 25.87 టీఎంసీల సామర్థ్యం ఉన్న మధ్య మానేరు జలాశయాన్ని నింపుతారు. రోజుకు రెండు టీఎంసీల చొప్పున పదమూడు రోజుల్లో జలాశయాన్ని నింపాలనేది లక్ష్యం.

తక్కువ కాలంలోనే భారీ పంపుహౌస్ పూర్తిచేశాం

ప్రపంచంలోనే అతిపెద్ద పంపుహౌస్‌ను మూడున్నరేళ్లలోనే పూర్తి చేశాం. 470 అడుగులకు దిగువన రెండు జంట సొరంగాలు, పంపుహౌస్ పూర్తి చేశాం. కంప్యూటేషనల్ ఫ్లుయిడ్ డైనమిక్స్ (సీఎఫ్‌డీ) సాంకేతికతతో దేశంలోనే తయారు చేసిన వస్తువులతో 'మేక్ ఇన్ ఇండియా'కు ప్రతిరూపంగా పంపుహౌస్ నిర్మించాం. భూగర్భంలో భారీ విద్యుత్తు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశాం. సర్జిపూల్, అదనపు సర్జిపూల్స్ కూడా ప్రపంచంలోనే పెద్దవి.

- బి.శ్రీనివాస్‌రెడ్డి, మేఘా సంస్థ డైరెక్టర్

విశిష్టతల సమాహారం 'గాయత్రి'

- భూ ఉపరితలం నుంచి గాయత్రి పంపుహౌస్ లోతు 143.25 మీటర్లు.
- శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది మేడారం జలాశయం అక్కడి నుంచి రెండు సొరంగాల ద్వారా ఈ పంపుహౌస్‌కు వచ్చిన గోదావరి నీటిని 111 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోయనున్నారు. ఇప్పటి వరకు 30-40 మీటర్ల ఎత్తు వరకు మాత్రమే నీటిని పంప్ చేసే పంపులు ఉన్నాయి.
- ప్రపంచలోనే ఏ రంగంలోనూ ఏర్పాటు చేయనంత భారీ పంపులు ఒక్కోటి 139 మెగావాట్ల సామర్థ్యంగల ఐదు సిద్ధమయ్యాయి. ఒక్కో పంపు బరువు 2376 మెట్రిక్ టన్నులు.
- నాగార్జునసాగర్ కుడి కాలువ ప్రవాహం రోజుకు 11 వేల క్యూసెక్కుల కన్నా ఇక్కడి పంపుల నుంచి రెండింతల స్థాయిలో ప్రవాహం వెలువడుతుంది.
- శ్రీశైలం రెండు జల విద్యుత్తు కేంద్రాలు ఉత్పత్తి చేసే విద్యుత్తు కన్నా ఎక్కువ సామర్థ్యం గల మోటార్లు (973 మెగావాట్లు) ఏర్పాటు చేశారు.

గుండె, మూత్రపిండం వైఫల్య రోగుల్లో.. ద్రవాల తొలగింపునకు కొత్త సాంకేతికత

- ఔషధాలకు ప్రత్యామ్నాయంగా నూతన ప్రక్రియ
- తొలిసారి అందుబాటులోకి..

ఈనాడు, హైదరాబాద్: గుండె, మూత్రపిండాల రోగుల శరీరంలో పేరుకుపోయే ద్రవాలు (ఫ్లూయిడ్స్)ను తొలగించడానికి కొత్త సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. స్లో కంటిన్యూస్ అల్ట్రా ఫిల్ట్రేషన్(ఎస్‌సీయూఎఫ్) అనే యంత్రాన్ని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ విరించి ఆసుపత్రిలో ప్రవేశపెట్టారు. 61 ఏళ్ల వయసుండే గుండె వైఫల్య రోగి శరీరం నుంచి విజయవంతంగా ద్రవాలను ఈ యంత్రం ద్వారా వేరు చేశారు. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్టు డాక్టర్ శరత్‌చంద్ర, సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు డాక్టర్ కె.ఎస్.నాయక్ వివరాలను వెల్లడించారు. 'సాధారణంగా గుండె, మూత్ర పిండాల వైఫల్యం ఉన్న రోగుల్లో విసర్జన క్రియలో ఇబ్బందులు ఏర్పడతాయి. గుండెలో రక్తం పంపింగ్ తగ్గితే విసర్జన క్రియలో సమస్యలు ఏర్పడి కిడ్నీలపై ప్రభావం పడుతుంది. శరీరంలో నీరు పెరుగుతుంది. ప్రస్తుతం ఔషధాలతో శరీరంలోని ద్రవాలు బయటకు పోయేలా చేస్తున్నారు. ఇలాంటి మందులు దీర్ఘకాలికంగా వాడటంతో ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మూత్ర పిండాల పనితీరుపై కూడా ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలో కొత్త సాంకేతికతతో ఎలాంటి సమస్య తలెత్తకుండా శరీర ద్రవాలను వేరు చేయవచ్చు' అని వైద్యులు వివరించారు. తాజాగా చికిత్స చేసిన రోగి శరీరం నుంచి మొత్తం 2 వేల మి.లీ. ద్రవాలు బయటకు తీశామన్నారు. ఇందుకు పది గంటల సమయం పట్టిందన్నారు. 'సాధారణంగా ఇలాంటి పరిస్థితిలో ఆరేడు రోజులపాటు రోగిని ఐసీయూలో ఉంచి చికిత్స అందించాలి. ఈ విధానంలో ఒకటి రెండు రోజుల్లో చికిత్స పూర్తవుతుంది, తక్కువ ఖర్చుతోనే చికిత్స అందించవచ్చు' అని చెప్పారు.

కొత్తగా అందుబాటులోకి వచ్చిన యంత్రం పనితీరును వివరిస్తున్న డాక్టర్ నాయక్, డాక్టర్ శరత్‌చంద్ర

నేడు, రేపు భారీ వర్షసూచన

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

ఈనాడు, హైదరాబాద్: బంగాళాఖాతం వాయవ్య ప్రాంతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది మంగళవారానికి మరింత తీవ్రం కానుంది. దీనికితోడు 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కారణంగా తెలంగాణలో మంగళ, బుధవారాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. రాష్ట్రంలో 369 చోట్ల సోమవారం పగటి పూట తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా కొమ్మెరలో 39, హత్నూర 29.3, వెల్దుర్తి 23.8, కల్హేర్ 22.3, ఇబ్రహీంపేటలో 20.5 మిల్లీమీటర్లు నమోదయ్యాయి.

ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

ఎప్పటికైనా తప్పదు!

ఒక్కటే గుర్తుంచుకోవాలి. మనం చేసే ఏ పాపమూ.. సహజమైన ప్రకృతి నియమాలను ఉల్లంఘిస్తూ చేసే ఏ పనీ కూడా శిక్ష లేకుండా పోదు.

- మహాత్మా గాంధీ

ఆమె చెయ్యే కారుకు తాళంచెవి!

- 'బయో హ్యాకింగ్'తో నివ్వెరపరిచిన మహిళ

వాషింగ్టన్: కారును స్టార్ట్ చేసేందుకు అవసరమైన ప్రత్యేక చిప్‌ను శరీరంలోకి చొప్పించుకోవడం ద్వారా అమెరికాలో ఓ మహిళ అందర్నీ నివ్వెరపరిచారు. 'బయో హ్యాకింగ్'గా పిలుస్తున్న ఈ సాంకేతికత త్వరలో మరింత విస్తృతమయ్యే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమీ డీడీ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆమెకు టెస్లా కంపెనీకి చెందిన మోడల్-3 కారు ఉంది. దాన్ని స్టార్ట్ చేసేలా తన చేతినే తాళంచెవిగా మార్చుకోవాలని అమీ భావించారు. కారు వాలెట్ కార్డు నుంచి 'రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిటీ కార్డు (ఆర్ఎఫ్ ఐడీ)' చిప్‌ను జాగ్రత్తగా వేరుచేశారు. నిపుణుల సాయంతో చిప్‌ను కుడి చేతిలోకి ఎక్కించుకున్నారు. ఫలితంగా ఆమె చెయ్యే కారుకు తాళంచెవిగా మారింది. అయితే, ఈ విధానంలో కారును తాను స్టార్ట్ చేయగలిగిందీ లేనిదీ అమీ తెలియజేయలేదు. అమీ బయో హ్యాకింగ్‌కు పూనుకోవడం ఇదే తొలిసారి కాదు. తాను రాగానే ఇంటి తలుపులు తెరుచుకునేలా గతంలో ఎడమ చేతిలోకి ప్రత్యేక చిప్ చొప్పించుకున్నారు.

అహ్మదాబాద్ ప్రజల్లా మనం చేయలేమా?

- విగ్రహాల నిమజ్జనంపై ట్విటర్‌లో కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: అహ్మదాబాద్‌లో స్వచ్ఛ సబర్మతి ఉద్యమంలో భాగంగా వేల సంఖ్యలో దశమాతా విగ్రహాలను ప్రజలు నదిలో నిమజ్జనం చేయకుండా ఒడ్డునే వదిలేసి వెళ్లారు. వాటిని అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఇలాంటి ప్రయత్నం గణేశ్ నిమజ్జనాల సందర్భంగా మనం హైదరాబాద్‌లో చేయలేమా? అని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ట్విటర్‌లో హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ దాన కిశోర్, నగర ప్రజలను ప్రశ్నించారు. అహ్మదాబాద్ మేయర్ విజయ్ నెహ్రా తమ నగరంలో జరిగిన అద్భుతం గురించి ట్విటర్‌లో కేటీఆర్‌కు తెలిపారు. "సబర్మతిని పరిశుభ్రంగా ఉంచాలనే పిలుపు మేరకు ప్రజలు వేల సంఖ్యలో విగ్రహాలను నదిలో నిమజ్జనం చేయకుండా.. ఒడ్డునే వదిలేసి వెళ్లారు. ఇది చాలా గొప్ప మార్పు" అని వివరించారు.

పైరసీ వెబ్‌సైట్లపై దిల్లీ హైకోర్టు నిషేధాజ్ఞలు

దిల్లీ: ప్రముఖ నిర్మాణ సంస్థలకు చెందిన సినిమాలు, టీవీ సీరియళ్లను అనధికారికంగా ప్రసారం చేసి, వాటిని బహిరంగంగా అందుబాటులో ఉంచుతున్న వెబ్‌సైట్లపై దిల్లీ హైకోర్టు కొరడా ఝుళిపించింది. వార్నర్ బ్రదర్స్, యూనివర్సల్, నెట్‌ఫ్లిక్స్, పారామౌంట్, యూటీవీ తదితర ప్రముఖ సంస్థలకు చెందిన చిత్రాలను కొన్ని వెబ్‌సైట్లు అంతర్జాలంలో పెడుతున్నాయి. వీటిపై చర్యలు కోరుతూ అమెరికాకు చెందిన వార్నర్ బ్రదర్స్ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో న్యాయస్థానం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. తమిళ్‌రాకర్స్, ఈజడ్‌టీవీ, కట్‌మూవీస్, లైమ్‌టోరెంట్స్ వెబ్‌సైట్ల ఇంటర్నెట్ ప్రోటాకాల్స్ (ఐపీ), యూనీఫామ్ రిసోర్స్ లొకేటర్లను (యూఆర్ఎల్‌ను) నిలుపుదల చేయాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించింది. ఆయా వెబ్‌సైట్ల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని టెలికాం శాఖకు సూచించింది.

గ్రహం అనుగ్రహం

13-8-2019 మంగళవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; శుక్ల పక్షం
త్రయోదశి: మ.1-38 తదుపరి చతుర్దశి
ఉత్తరాషాఢ నక్షత్రం: తె.5-39 తదుపరి శ్రవణ
అమృత ఘడియలు: రా.10-52 నుంచి 12-34 వరకు
వర్జ్యం: మ.12-43 నుంచి 2-24 వరకు
దుర్ముహూర్తం: ఉ.8-16 నుంచి 9-07 వరకు తిరిగి రా.10-56 నుంచి 11-41 వరకు
రాహుకాలం: మ.3.00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5-45; సూర్యాస్తమయం: సా.6.24

రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇబ్బందులు

ఈనాడు, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదల కారణంగా ఇతర రాష్ట్రాలకు వెళ్లే పలు రైళ్లలో కొన్నింటిని రద్దు చేయడంతోపాటు మరికొన్నింటిని దక్షిణ మధ్య రైల్వే పాక్షికంగా రద్దు చేసింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 30 నుంచి 40 రైళ్ల రద్దుతో రైల్వే స్టేషన్లు బోసి పోతున్నాయి. ముంబయికి వెళ్లే రైళ్లను పూర్తిగా రద్దు చేయగా మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ వెళ్లే రైళ్లలో కొన్నింటిని పాక్షికంగా మరికొన్నింటిని పూర్తిగా రద్దు చేశారు. హైదరాబాద్, ముంబయిల మధ్య నిత్యం నడిచే ఎనిమిది రైళ్ల పూర్తి రద్దుతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు కూడా రద్దవడంతో ఆర్థిక రాజధాని ముంబయితో హైదరాబాద్ వాసులకు ఉన్న సంబంధాలకు బ్రేకులు పడ్డాయి. రెండు నగరాలకు మధ్య రైళ్ల ద్వారా రాకపోకలకు వీలుకాని పరిస్థితుల్లో ఎక్కడి ప్రయాణికులు అక్కడే ఇబ్బంది పడుతున్నారు. నేరుగా ముంబయికి నడిచే రైళ్లను ఈ నెల 16 వరకు రద్దు చేశారు.

ఇతర రాష్ట్రాలకు తెగిన లింకు..

సెంట్రల్ రైల్వేతోనే కాకుండా.. సదరన్ రైల్వే, సౌత్‌వెస్ట్ రైల్వే, ఈస్ట్‌కోస్టు రైల్వే జోన్ల పరిధిలోని పలు ప్రాంతాలకు హైదరాబాద్‌తో రైల్వే లింకు తాత్కాలికంగా తెగింది. కేరళ, కర్ణాటక, బిహార్, ఛత్తీస్‌గఢ్, సంబల్‌పూర్ ప్రాంతాలకు సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ నుంచి పలు రైళ్లు నడుస్తున్నాయి. భారీ వర్షాలు కురుస్తుండడంతో కర్ణాటక, కేరళల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండగా ఆయా ప్రాంతాలకు రైళ్లను రద్దు చేశారు. ఇలా హైదరాబాద్ నుంచి ముంబయితోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే 150 ఎక్స్‌ప్రెస్ రైళ్లు గత పది రోజుల్లో రద్దయ్యాయి. పాక్షికంగా 220 రైళ్లను ద.మ. రైల్వే రద్దు చేసింది. హైదరాబాద్ నుంచి మూడు రైల్వే స్టేషన్ల ద్వారా దూరప్రాంతాలకు ప్రతి రోజు రెండున్నర లక్షల మంది రాకపోకలు సాగిస్తుంటారు. రైళ్ల రద్దుతో ద.మ. రైల్వేకు ఇప్పటి వరకు రూ.4.50 కోట్ల వరకు నష్టం ఉంటుందని అధికారుల అంచనా. ప్రయాణికుల టిక్కెట్ల వల్ల వచ్చే ఆదాయం ఇంత మొత్తంలో ఉండగా.. రైల్వే ఆస్తులకు సంబంధించిన నష్టం మరింత ఉంటుందని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉత్తర ధ్రువంపై నుంచి ఎయిరిండియా తొలి విమానం

- ఈ నెల 15న దిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకు..

దిల్లీ: భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఎయిరిండియా ఉత్తర ధ్రువంపై నుంచి తొలి విమానాన్ని నడపనుంది. దిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వరకు విమానం ప్రయాణించనుంది. ఉత్తర ధ్రువంపై నుంచి విమానం నడిపే తొలి భారత విమానయాన సంస్థగా ఎయిరిండియా ఘనత సాధించనుంది. దీనివల్ల ప్రయాణ సమయం తగ్గి ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని ఎయిరిండియా తెలిపింది. ఇంధన వ్యయం కూడా తగ్గుతుందని వెల్లడించింది. ప్రస్తుతం దిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకు విమానాలు బంగ్లాదేశ్, మయన్మార్, చైనా, జపాన్, పసిఫిక్ మహాసముద్రం దాటి అమెరికాలోకి ప్రవేశిస్తున్నాయి. కొత్త మార్గంలో 90 నిమిషాల మేర ప్రయాణ దూరం తగ్గనుంది. ఈ మార్గంలో కిర్గిజిస్థాన్, కజకిస్థాన్, రష్యా, ఆర్కిటిక్ సముద్రం, కెనడా ద్వారా విమానం అమెరికాలోకి ప్రవేశిస్తుంది.

ఫిజీ సుప్రీంకోర్టు జడ్జీగా జస్టిస్ లోకూర్ ప్రమాణం

ఈనాడు, దిల్లీ: భారత సుప్రీంకోర్టు జడ్జిగా సేవలందించిన జస్టిస్(విశ్రాంత) మదన్ బి. లోకూర్ సోమవారం ఫిజీ దేశ సుప్రీంకోర్టులో నాన్‌రెసిడెంట్ ప్యానల్ జడ్జిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయన గతంలో తెలుగురాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన విషయం గమనార్హం. కాగా, భారత జడ్జి ఒకరు మరోదేశ సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టడం ఇదే తొలిసారి. జస్టిస్ లోకూర్ భగవద్గీత సాక్షిగా ప్రమాణం చేశారు. ఆయనతో ఫిజీ అధ్యక్షుడు జియోజీ కొన్‌రోటే ప్రమాణస్వీకారం చేయించారు. 2018 డిసెంబర్ 31న జస్టిస్ మదన్ బి. లోకూర్ భారత్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. ఇప్పుడిక ఫిజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఆయన మూడేళ్లపాటు కొనసాగుతారు.

అమెరికా-తాలిబన్ చర్చలు పూర్తి

కాబూల్: అఫ్గానిస్థాన్‌లో అమెరికా తన బలగాలను తగ్గించేందుకు ఉద్దేశించిన ఒప్పందానికి సంబంధించి తాలిబన్-అమెరికా ప్రతినిధుల మధ్య తాజా చర్చలు ముగిసినట్లు ఇరువర్గాలు సోమవారం ప్రకటించాయి. ప్రస్తుతం అఫ్గానిస్థాన్‌లోని 14,000 మంది సైన్యాన్ని పెంటగాన్ ఉపసంహరించే ఈ ఒప్పందంపై ఇరు వర్గాలు ఏడాదిగా దోహాలో చర్చలు జరుపుతున్నాయి.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	38.1	28.7
గుంటూరు	36.4	27.8
విజయవాడ	35.2	29.2
ఖమ్మం	35.0	29.0
నల్గొండ	35.0	24.2
సూర్యాపేట	34.0	27.5
విశాఖపట్నం	33.8	25.0
హన్మకొండ	33.7	26.3
ఆదిలాబాద్	32.8	24.7
నిజామాబాద్	32.5	24.1
రామగుండం	32.0	25.0
హైదరాబాద్	31.4	23.7
మహబూబ్‌నగర్	31.2	23.2
మెదక్	30.8	23.0
కరీంనగర్	30.0	24.0

ఇదీ సంగతి!

మోహరించాం కాని ముందుకెళ్లటానికి ఇంధనం లేదు సార్... ప్రపంచ బ్యాంకు అప్పు త్వరగా వచ్చేట్టు చూడండి.

ఉద్యోగ అవకాశాలు

SR Engineering College
Innovation . Creativity . Entrepreneurship
Ananthasagar (V), Hasanparthy (M), Warangal Dist., PIN: 506 371

Applications are invited from qualified competent faculty with experience in teaching and research for the posts of Professors, Assoc. Professors & Asst. Professors in the following departments. Doctoral candidates will be given preference.

FACULTY RECRUITMENT
- Civil Engineering
- Mechanical Engineering
- Computer Science & Engineering
- Electrical & Electronics Engineering
- Electronics & Communication Engineering
- Master of Business Administration
- Humanities & Science (English, Physics, Chemistry, Mathematics, Psycology, Fine Arts & Product Design)

Qualifications and Scale of Pay: As per AICTE Norms

Interested candidates may send their resumes so as to reach on or before 25th August, 2019 by email: hr@srecwarangal.ac.in
For prior Appointment call
9849151850,0870-2818311,0870-2818333
Date: 13-08-2019 Sd/-, Secretary & Correspondent

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్
IBPS
ఆథరైజ్డ్ వెబ్‌సైట్: www.ibps.in
సందేహాలు / ఫిర్యాదుల కొరకు http://cgrs.ibps.in/ ను చూడండి.

పాల్గొనుచున్న సంస్థలలో ప్రొబేషనరీ ఆఫీసర్లు / మేనేజ్‌మెంట్ ట్రెయినీల నియామకం కొరకు ఉమ్మడి నియామక ప్రక్రియ
(2020-21 యొక్క ఖాళీల కొరకు CRP PO/MT-IX)

పాల్గొనుచున్న సంస్థలలో ప్రొబేషనరీ ఆఫీసర్ / మేనేజ్‌మెంట్ ట్రెయినీ ఉద్యోగాల కొరకు సిబ్బంది ఎంపిక నిమిత్తం తదుపరి ఉమ్మడి నియామక ప్రక్రియ కొరకు ఆన్‌లైన్ పరీక్ష (ప్రిలిమినరీ మరియు మెయిన్) అక్టోబరు/నవంబరు 2019లో నిర్వహించబడుటకు తాత్కాలికంగా నిర్ణయించబడినది.
అంశాల తాత్కాలిక షెడ్యూలు దిగువనివ్వబడినది:

కార్యక్రమము	తాత్కాలిక తేదీలు
అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్టరు చేసుకొనుట మరియు దరఖాస్తును ఎడిట్/సరిచేసుకొనుట	07.08.2019 నుండి 28.08.2019 వరకు
దరఖాస్తు ఫీజు/సమాచారం తెలియజేయుటకు చార్జీల చెల్లింపు (ఆన్‌లైన్)	07.08.2019 నుండి 28.08.2019 వరకు
ప్రి-ఎగ్జామ్ ట్రెయినింగ్ కొరకు కాల్ లెటర్ డౌన్‌లోడ్	సెప్టెంబరు 2019
ప్రి-ఎగ్జామ్ ట్రెయినింగ్ నిర్వహణ	23.09.2019 నుండి 28.09.2019 వరకు
ఆన్‌లైన్ పరీక్ష - ప్రిలిమినరీ కొరకు కాల్ లెటర్ డౌన్‌లోడ్	అక్టోబరు 2019
ఆన్‌లైన్ పరీక్ష – ప్రిలిమినరీ	12.10.2019, 13.10.2019, 19.10.2019 & 20.10.2019
ఆన్‌లైన్ పరీక్ష - ప్రిలిమినరీ ఫలితము	అక్టోబరు/నవంబరు 2019
ఆన్‌లైన్ పరీక్ష – మెయిన్ కొరకు కాల్ లెటర్ డౌన్‌లోడ్	నవంబరు 2019
ఆన్‌లైన్ పరీక్ష – మెయిన్	30.11.2019
మెయిన్ యొక్క ఫలితాల ప్రకటన	డిసెంబరు 2019
ఇంటర్వ్యూ కొరకు కాల్ లెటర్ డౌన్‌లోడ్	జనవరి 2020
ఇంటర్వ్యూ నిర్వహణ	జనవరి / ఫిబ్రవరి 2020
తాత్కాలిక కేటాయింపు	ఏప్రిల్ 2020

వివరాలు మరియు తాజా సమాచారం కొరకు ఆథరైజ్డ్ IBPS వెబ్‌సైట్ www.ibps.in ను క్రమం తప్పకుండా చూడవల్సిందిగా అభ్యర్థులకు విజ్ఞప్తి.
ఆన్‌లైన్‌లో రిజిస్టరు చేసుకునే ముందు వివరమైన నోటిఫికేషన్‌ను చదివి, దానిలో పేర్కొనబడిన సూచనలను పాటించవల్సిందిగా అభ్యర్థులకు విజ్ఞప్తి.
ముంబయి
తేది: 02.08.2019
డైరెక్టర్ (IBPS)

A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
అలుగునూర్, కరీంనగర్
Cell:90001 80623

జాతీయ యువజన పురస్కారాల ప్రదానం

తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురికి అవార్డులు

దిల్లీలో వంశీకృష్ణకు జాతీయ యువజన అవార్డు అందజేస్తున్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

ఈనాడు, దిల్లీ : వివిధ సామాజిక, అభివృద్ధి కార్యక్రమాల్లో తమవంతు సేవలందిస్తున్న యువతకు కేంద్ర ప్రభుత్వం జాతీయ యువజన పురస్కారాలు అందజేసింది. కేంద్ర యువజన వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సోమవారం అవార్డులను ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా 20 మంది యువజనులు, మూడు యువజన సంఘాలకు ఈ అవార్డులు అందించారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి గట్టెం వెంకటేష్, పృథ్వీ గొల్ల (ఆంధ్రప్రదేశ్), వద్దిరాజు వంశీకృష్ణ (తెలంగాణ) ఈ పురస్కారాలను అందుకున్నారు. పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ. 50 వేల నగదు, ప్రశంసాపత్రం, పతకం అందజేశారు.

5,561 మందికి వైద్య పరీక్షలు

చింతమడకలో ముగిసిన ఉచిత వైద్య శిబిరం

సిద్దిపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామం...సిద్దిపేట గ్రామీణ మండలంలోని చింతమడకలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరం సోమవారంతో ముగిసింది. గత నెలలో గ్రామంలో పర్యటించిన కేసీఆర్ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచీ రూపొందిస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య సూచీ రూపకల్పనకు చింతమడక నుంచి నాంది పలకనున్నట్లు కేసీఆర్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన యశోద ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఈ నెల 5న వైద్య శిబిరానికి శ్రీకారం చుట్టారు. చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్‌తోపాటు మధిర గ్రామాలైన అంకంపేట, దమ్మచెరువు, శంకర్‌నగర్, హరీశ్‌రావునగర్‌కు చెందిన 5,561 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎనిమిది రోజుల పాటు శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా 46 రకాలకు సంబంధించి 36,146 వైద్య పరీక్షలు నిర్వహించడం విశేషం. నలుగురు రేడియాలజిస్టులు, ముగ్గురు ఫిజీషియన్లు, ఇద్దరు కార్డియాలజిస్టులు, ఒక పల్మనాలజిస్టు ఆధ్వర్యంలో శిబిరం కొనసాగింది. వైద్య పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాక 5,561 మందికి ఆరోగ్య సూచీ పత్రాలు అందించనున్నారు. సోమవారం జరిగిన ముగింపు శిబిరంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, యశోద ఆసుపత్రి ఎండీ సురేందర్‌రావు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులపై కఠిన చర్యలు

ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: వరంగల్‌లో బాలికపై సామూహిక అత్యాచారం చేసి, ఆమె ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆ నగర పోలీసు కమిషనర్ (సీపీ) రవీందర్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన సీపీతో ఫోన్‌లో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వెన్నెల కవి కన్నుమూత

- సామాన్యుల బాధలకు అక్షర రూపం
- క్రియాశీలతకు మారుపేరు

సీవీ కృష్ణారావు

నాగోలు, న్యూస్‌టుడే: 'నెల నెలా వెన్నెల' పేరిట యువ కవుల వెన్నుతట్టిన చింతల పాటి వేంకట కృష్ణారావు (94) ఇక లేరు. ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు నల్గొండ ప్రాంతంతో అనుబంధం ఉన్న ఆయన.. హైదరాబాద్ చైతన్యపురి న్యూ మారుతీ నగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. అభిమానుల కన్నీటి నివాళి మధ్య వివేకానంద నగర్‌లోని శ్మశానవాటికలో సోమవారం అంత్యక్రియలు జరిగాయి. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితమే ప్రతి నెలా పౌర్ణమి రోజున కవితాగోష్ఠి నిర్వహణతో ఆయన ప్రసిద్ధులయ్యారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి, చినవీరభద్రుడు వంటి ప్రముఖులకు వేదికను రూపొందించారు. ఉద్యోగరీత్యా ఆదిలాబాద్, వరంగల్, రంపచోడవరం ప్రాంతాల్లో ఉన్నప్పుడు గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎనలేని కృషిచేశారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆ వెన్నెల కవి అనంతరం బ్యాంకు, సాంఘిక సంక్షేమ విభాగాల్లో విధులు నిర్వర్తించారు. శ్రమజీవులతో ఉంటూ, వారి వేదనకు అక్షరరూపమిచ్చారు. దళితుల ఉద్వేగానికి ప్రతీకగా నిలిచేలా వైతరిణి, అవిశ్రాంతం, కిలారి వంటి పలు రచనలు చేశారు. చెంచులకు ఇళ్లు కట్టించడంలో, క్షీరసాగరం అంటూ పాలవిప్లవం తేవడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన సేవాభిలాషకు గుర్తుగా ఆత్మీయులు 'నడక నావ' పేరుతో ఇదివరకే ఒక పుస్తకాన్ని వెలువరించారు.

కోస్టల్ జాగ్వార్ టగ్‌లో మంటలు చెలరేగడంతో ప్రమాదం నుంచి బయటపడేందుకు సముద్రంలోకి దూకేసిన సిబ్బంది

నౌకలో భారీ అగ్నిప్రమాదం

- కాలిన గాయాలతో సముద్రంలోకి దూకిన సిబ్బంది
- ఒకరి మృతి, మరొకరు గల్లంతు
- విశాఖ నౌకాశ్రయం అవుటర్ హార్బర్‌లో ఘటన

ఈనాడు, విశాఖపట్నం, మహారాణిపేట, న్యూస్‌టుడే: విశాఖ నౌకాశ్రయం అవుటర్ హార్బర్‌లో సోమవారం ఉదయం 11.20 గంటలకు కోస్టల్ జాగ్వార్ అనే టగ్(చిన్న నౌక) భారీ అగ్ని ప్రమాదానికి గురైంది. టగ్ డెక్ భాగంలో నిప్పంటుకుని క్షణాల్లో మంటలు వ్యాపించాయి. ఆ ప్రాంతానికి సమీపంలో ఉన్న సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాలు రక్షించుకునేందుకు సముద్రంలోకి దూకిన వారిలో రాజస్థాన్‌కు చెందిన ఆశిష్‌కుమార్(26) ప్రాణాలు కోల్పోయారని, లఖ్‌నవూకు చెందిన విక్కీ చౌహాన్(22) గల్లంతయ్యారని హార్బర్ ఏసీపీ టేకి మోహనరావు వెల్లడించారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం అందగానే విశాఖ నౌకాశ్రయం అధికారులు నాలుగు పడవల్లో, కోస్ట్‌గార్డ్ అధికారులు సి.జి.-81 నౌకలో వెళ్లి టగ్‌లో ఉన్న వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. అప్పటికే అగ్నికీలలు ఉధృతం కావడంతో పలువురు టగ్ నుంచి సముద్రంలోకి దూకారు. తీరం నుంచి సుమారు 13 కిలోమీటర్ల దూరంలోని సంఘటన ప్రాంతంలో సముద్రం కల్లోలంగా ఉంది. సాగరంలోకి దూకిన వారిని కోస్ట్ గార్డ్ అధికారులు రక్షించి తీరానికి తీసుకొచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 29 మంది ఉన్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు నిర్ధారించారు.

గాలికూట విషం

- పంటలు పండవు.. చేపలు బతకవు
- యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమలు
- అప్పుడప్పుడూ మూసివేత ఉత్తర్వులు.. కనిపించని మార్పు
- రసాయన వ్యర్థ జలాలతో నిర్వీర్యమవుతున్న నీటివనరులు
- కాలుష్య కాటుతో దుర్భర జీవితం వెళ్లదీస్తున్న ప్రజలు

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్ల మాచనూరు గ్రామంలోని ఓ పరిశ్రమ నుంచి బయటకు వస్తున్న వ్యర్థజలం

'ఈనాడు' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడి

ఉమ్మడి మెదక్ జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, జిన్నారం, కొండాపూర్, జహీరాబాద్, హత్నూర తదితర మండలాల్లో నెలకొన్న జల, వాయు కాలుష్యం కారణంగా ఆ ప్రాంత ప్రజల జీవనం కష్టంగా మారింది. అనేక మంది బతుకు తెరువు కోల్పోతున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు.. కష్టాలపై 'ఈనాడు' క్షేత్రస్థాయిలో పరిశీలించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.



ఫలితాన్నివ్వని తనిఖీలు

కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అప్పుడప్పుడూ తనిఖీలు చేస్తుంటుంది. ఫ్యాక్టరీలలో లోపాలను గుర్తించినప్పుడు.. మూసివేత ఉత్తర్వులిస్తుంది. మళ్లీ లోపాలు సరిదిద్దుకున్నారంటూ అనుమతులిస్తుంది. కాలుష్య సమస్య అలాగే ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. కంపెనీలు ఎఫ్లియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈటీపీ)లను ఏర్పాటుచేసుకుని వ్యర్థాల్ని శుద్ధి చేయాలి. కొన్ని యాజమాన్యాలు ఖర్చు తగ్గించుకునేందుకు ఈటీపీలను వాడకుండా వ్యర్థాల్ని ప్రస్తుతం వర్షపు నీటిలో కలిపి బయటకు వదులుతున్నాయి.

ఐదేళ్లలో 385 పరిశ్రమలపై చర్యలు

నిబంధనలు పాటించని కంపెనీలపై చర్యలు తీసుకుంటున్నట్లు పీసీబీ చెబుతోంది. తీవ్రతను బట్టి ఉత్పత్తి నిలిపివేత.. తాత్కాలికంగా మూసివేత ఆదేశాలు జారీచేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే 2014 జూన్ నుంచి.. నిబంధనలు ఉల్లంఘిస్తున్న 385 కంపెనీలపై చర్యలు తీసుకున్నట్లు పీసీబీ గణాంకాలు చెబుతున్నాయి.

చర్య తీసుకున్న కంపెనీలు

2014 (అక్టోబరు-డిసెంబరు)	9
2015	78
2016	32
2017	111
2018	40
2019	15

జూన్ వరకు

నీరంతా కలుషితమవ్వడంతో నిరుపయోగంగా ఉన్న గండి చెరువు. (అంతర్‌చిత్రంలో) సమీప పరిశ్రమల నుంచి చెరువులోకి వస్తున్న కలుషిత నీరు

గండిగూడెం చెరువులో గరళం

అమీన్‌పూర్ మండలం గండిగూడెం చెరువుది 266 ఎకరాల విస్తీర్ణం. 4 గ్రామాలు దీనిపైనే ఆధారపడి ఉన్నాయి. 1500 ఎకరాల సాగుకు.. 150 మత్స్యకార కుటుంబాలకు ఈ చెరువు నీరే ఆధారం. సమీపంలో పరిశ్రమల నుంచి వచ్చిన రసాయన వ్యర్థాలతో 2017 అక్టోబరులో రెండేళ్ల క్రితం భారీగా చేపలు మరణించాయి. 26 పరిశ్రమలకు నోటీసులిచ్చారు. మూడింటికి తాత్కాలికంగా మూసివేత ఉత్తర్వులు అందించారు. 14 ఫార్మా కంపెనీల నుంచి రూ.1.03 కోట్ల పరిహారాన్ని వసూలు చేసి మత్స్యకార కుటుంబాలకు ఇచ్చారు. కాలుష్య తీవ్రత తగ్గేవరకు చేపపిల్లలు ఇవ్వాలని మత్స్యశాఖ చెబుతోందని మత్స్యకారులు విన్నవిస్తున్నా ఫలితం శూన్యం. గండిగూడెం చెరువులోకి వచ్చే కాలువలను పరిశీలించగా శుద్ధి చేయని రసాయన వ్యర్థ జలాలు కాలువ నీటితో కలిసి చెరువులోకి వెళుతున్నాయి.

తీరు మారని పరిశ్రమలు

కొండాపూర్ మండలంలోని మల్లేపల్లి శివారులో ఎనిమిది వరకు పైరాలసిస్ పరిశ్రమలున్నాయి. వీటికి గతంలో మూసివేత ఉత్తర్వులిచ్చారు. కొన్నాళ్ల తర్వాత పరిస్థితి మామూలే. టైర్ల నుంచి ఆయిల్ తీసే క్రమంలో భయంకరమైన వాసనలు ముక్కుపుటాలను అదరగొడతాయి.

- పాశమైలారం పెద్ద చెరువులో ఒకప్పుడు చేపలు బాగా బతికేవి. ఇప్పుడది కాలకూట విషంగా మారింది. వేసిన చేపపిల్లలు వెంటనే చనిపోతున్నాయి. పరిశ్రమల నుంచి వ్యర్థజలాలు ఇందులోకి చేరుతున్నాయి.
- హత్నూర మండలం బోర్పట్ల, గుండ్లమాచనూరు సమీపంలో ఔషధ పరిశ్రమలున్నాయి. వీటినుంచి వెలువడే రసాయన వ్యర్థ జలాలను వాన నీటితో పాటు కలిపేసి నక్కవాగులోకి వదులుతున్నారు. ఓ పరిశ్రమ పక్కన ఉన్న రెండు కుంటలు వ్యర్థజలాలతో నిండిపోయాయి. బోర్పట్లలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సమీపంలో ఉన్న పరిశ్రమ నుంచి వచ్చే ఘాటైన వాసనల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు కొంత వాసన తగ్గినా.. మళ్లీ కొద్దిరోజులకు అదే పరిస్థితి నెలకొంటోంది. ఈ పాఠశాలలో పనిచేసే ఏడుగురు ఉపాధ్యాయులు గతేడాది బదిలీపై వెళ్లిపోయారు.
- నిబంధనలు ఉల్లంఘించినందుకు జహీరాబాద్ ప్రాంతంలోని మూడు పరిశ్రమలకు ఈ ఏడాది ప్రారంభంలో మూసివేత ఉత్తర్వులిచ్చారు. ఆ తర్వాత కొంతకాలానికి మళ్లీ అనుమతులిచ్చారు. భూగర్భజలాలు పూర్తిగా కలుషితమయ్యాయని, కనీస అవసరాలకు కూడా నీళ్లు వాడుకోలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు.

కూలీగా పనిచేస్తున్నా

నేను బాహ్యవలయ రహదారిపై మొక్కలను కత్తిరించే కూలీగా పనిచేస్తున్నాను. చెరువు నీరు కలుషితం కానప్పుడు చేతినిండా పని ఉండేది. ఇప్పుడు రోజుకు రూ.300లకు పనిచేస్తున్నా.. సమస్య వెలుగులోకి వచ్చినప్పుడు హడావుడి చేసిన అధికారులు తర్వాత పట్టించుకోవట్లేదు.

–జనార్దన్. గండిగూడెం
మత్స్య సహకారం సంఘం అధ్యక్షుడు

తలుపులు మూసుకుంటున్నాం

మా గ్రామానికి సమీపంలో టైర్లను కాల్చి ఆయిల్ తీసే పరిశ్రమలున్నాయి. భరించలేని దుర్వాసన వస్తోంది. ఆ సమయంలో గ్రామ ప్రజలంతా ఇళ్లలోకి వెళ్లి తలుపులు వేసుకోవాల్సి వస్తోంది. పంట పొలాల మీద బూడిద పేరుకుపోతోంది. పనిచేయడానికి కూలీలు రావట్లేదు.

– గోపాల్, ఎదురుగూడెం, కొండాపూర్

ఈనాడు–హైదరాబాద్, సంగారెడ్డి

హాంకాంగ్ విమానాశ్రయం మూసివేత

వేల మంది ఆందోళనకారులు చుట్టుముట్టడంతో అధికారుల నిర్ణయం

హాంకాంగ్: పోలీసు హింసను నిరసిస్తూ హాంకాంగ్‌లో ప్రజాస్వామ్యవాదులు నిరసనను ఉధృతం చేశారు. సోమవారం సుమారు ఐదు వేల మంది ఉద్యమకారులు ఇక్కడి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చుట్టుముట్టారు. 'హాంకాంగ్‌కు భద్రత లేదు', 'పోలీసులు సిగ్గుపడాలి' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. నిరసన తీవ్రరూపం దాల్చడంతో అధికారులు ఉన్నఫళంగా విమానాశ్రయాన్ని మూసివేశారు. అన్ని సేవలను రద్దు చేశామని, ప్రజలెవరూ ఎయిర్‌పోర్టుకు రావద్దని ప్రకటించారు. హాంకాంగ్ పాలనలో చైనా ఆధిపత్యాన్ని నిరసిస్తూ గత పది వారాలుగా ఉద్యమకారులు వివిధ రూపాల్లో ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆందోళనకారులకు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయని చైనా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "హాంకాంగ్‌లో ఉద్యమకారులు పోలీసు అధికారులపై తరచూ దాడులు చేస్తున్నారు. ఉగ్రవాద సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి" అని హాంకాంగ్ వ్యవహారాల కార్యాలయ ప్రతినిధి యాంగ్ జుయాంగ్ ఆరోపించారు.

విత్తనాలతో విస్తరణ

డ్రోన్ సాయంతో విత్తనాలు చల్లించే కార్యక్రమాన్ని రాష్ట్ర అటవీ సంరక్షణ విభాగం సంచాలకుడు రఘువీర్ సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చెంగిచర్లలో చేపట్టారు. ఇదే ప్రక్రియను మేడివల్లి, నారపల్లి నందనవనం ప్రాంతాల్లో అనుసరిస్తామని, ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అడవుల విస్తరణకు దోహదపడుతుందని తెలిపారు. ఇందులో మేడ్చల్ జిల్లా అటవీ అధికారి సుధాకర్‌రెడ్డితో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

- చెంగిచర్ల(బోడుప్పల్), న్యూస్‌టుడే

జెట్‌కు మేము దూరమే!

ప్రకటించిన అనిల్ అగర్వాల్, ఎతిహాద్ ఎయిర్‌వేస్

ముంబయి: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని, గత ఏప్రిల్ 17 నుంచి విమాన సేవలు నిలిపేసిన జెట్ ఎయిర్‌వేస్ పునరుద్ధరణ కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) బిడ్ దాఖలు చేసినట్లు ఆదివారం బహిరంగ ప్రకటన చేసిన వేదాంతా రిసోర్సెస్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ ఒక్క రోజు వ్యవధిలోనే మనసు మార్చుకున్నారు. జెట్ ఎయిర్‌వేస్‌పై తమకు ఆసక్తి లేదని సోమవారం ప్రకటించారు. ఖాతాలను మరింత సమగ్రంగా తనిఖీ చేశాక, తమ ప్రాధాన్యాలను అంచనా వేసుకున్నాక, జెట్ ఎయిర్‌వేస్ విషయంలో ముందుకెళ్లకూడదని నిర్ణయించుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇక.. జెట్ ఎయిర్‌వేస్‌లో 24 శాతం వాటా కలిగి ఉన్న భాగస్వామి సంస్థ ఎతిహాద్ ఎయిర్‌వేస్ కూడా సంస్థ పునరుద్ధరణ కోసం ఈఓఐ దాఖలు చేయలేదు. 'జెట్ ఎయిర్‌వేస్‌లో మరింత పెట్టుబడులు పెట్టడం ఈ సమయంలో సాధ్యం కాదు, ఆ బాధ్యత కూడా మాపై లేదు. ఆ సంస్థలో మైనారిటీ వాటాదారుగా, జెట్ సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాం. అయితే భారత్‌లో పెట్టుబడులకు కట్టుబడి ఉన్నాం' అని ఎతిహాద్ తెలిపింది.

అదుపు తప్పిన వాహనం.. ముగ్గురి దుర్మరణం

- దంపతులు సహా పెద్ద కుమారుడు మృత్యువాత
- గాయాలతో బయటపడిన చిన్న కుమారుడు

శామీర్‌పేట, నాగోల్, బండ్లగూడ, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న చిన్న కుమారుడి ఆరోగ్యం కుదుట పడాలని ఆ దంపతులు తరచూ దేవాలయాలను సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబం మొత్తం ధర్మపురి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో.. దంపతులు, వారి పెద్ద కుమారుడు దుర్మరణం పాలయ్యారు. అనారోగ్యంతో ఉన్న కుమారుడు తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట ఠాణా పరిధిలో సోమవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

హైదరాబాద్‌లోని నాగోల్ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోసూరి కిశోర్‌చారి- భారతి దంపతులు వెంకట్‌రెడ్డినగర్‌లో నివసిస్తున్నారు. గృహ నిర్మాణ రంగంలో స్థిరపడ్డారు. వీరి స్వస్థలం గుంటూరు జిల్లా నరసరావుపేట. వీరి పెద్ద కుమారుడు సుధాంశ్ పదో తరగతి, రెండో కుమారుడు తనీష్ 4వ తరగతి చదువుతున్నారు. తనీష్ హార్మోన్ల లోపంతో బాధపడుతున్నాడు. అతనికి నయం కావాలని కోరుకుంటూ దంపతులు తరచూ పుణ్య క్షేత్రాలకు వెళ్లివస్తున్నారు. సోమవారం ధర్మపురి వెళ్లి వస్తుండగా రాజీవ్ రహదారిపై శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద కిశోర్‌చారి నడుపుతున్న కారు అదుపు తప్పి విభాగినిని ఢీకొట్టింది. ఈ క్రమంలో ఆ వైపు నుంచి వస్తున్న కారుపై పడింది.

రాజీవ్ రహదారిపై ఘటనాస్థలం

కిశోర్‌చారి★ భారతి

ఈ ఘటనలో కిశోర్‌చారి (47), భారతి (42), సుధాంశ్ (15) అక్కడికక్కడే మరణించగా తనీష్ (10) తీవ్రంగా గాయపడ్డాడు. ఎదురు కారులో ఉన్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం చిన్న ఆరేపల్లికి చెందిన రాజు (38), మహేశ్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో అల్వాల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

వెంటాడుతున్న మృత్యువు

కిశోర్‌చారి కుటుంబ సభ్యులను మృత్యువు వెంటాడుతోంది. గత ఏడాది ఇదే నెలలో అతని మేనమామ, మేనత్త, మరదలు కారు ప్రమాదంలోనే దుర్మరణం చెందారు. ఈ నేపథ్యంలో డ్రైవర్లపై నమ్మకం లేక కిశోరే వాహనాన్ని నడుపుతున్నారు. సొంత డ్రైవింగ్‌లోనూ కిశోర్‌చారి కుటుంబ సభ్యులు దుర్మరణం చెందడం బంధువులను కలచివేస్తోంది.

ఆదుకో మల్లన్నా!

శ్రీశైలంలో భక్తులకు ఇబ్బందులు

శ్రీశైలం, న్యూస్‌టుడే: శ్రీశైల క్షేత్రంలో ఆది, సోమవారాల్లో భక్తులు తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు. వరుస సెలవులు కావడంతో సందర్శకులు లక్షలాదిగా తరలివచ్చారు. వసతి గదులు దొరక్క రహదారులపైన, వాహనాల్లోనే సేదతీరారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల దగ్గరా తీవ్ర రద్దీ నెలకొంది. సోమవారం ఉదయం శ్రీశైలంలోని బంకుల్లో పెట్రోల్ అయిపోయింది. చేసేది లేక వాహనదారులు తమ తిరుగు ప్రయాణాన్ని విరమించాల్సి వచ్చింది. వలయ రహదారితో పాటు మిగిలిన దారులన్నీ వాహనాలతో కిక్కిరిశాయి. భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడింది. సందట్లో సడేమియా లాగా ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికుల నుంచి అధిక రుసుములు వసూలు చేశారు.

ఐసెట్ కౌన్సెలింగ్ గడువు పెంపు

- ఓయూ ఫలితాల్లో జాప్యమే కారణం

ఈనాడు, హైదరాబాద్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఐసెట్ కౌన్సెలింగ్ గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించారు. వెబ్ ఆప్షన్ల గడువు సోమవారంతో ముగిసినా, డిగ్రీలో కొన్ని సెమిస్టర్ల ఫలితాలు ఇంకా విడుదల కాలేదు. దీంతో నష్టపోతున్నామన్న ఆందోళన ఉత్తమ ర్యాంకర్లలో వ్యక్తమవుతోంది. ఫలితాలను నేడో రేపో విడుదల చేస్తామని ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారులు చెబుతుండటంతో, కౌన్సెలింగ్ తేదీ గడువును పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని ఐసెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిత్తల్ ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు సోమవారం వరకు 18,328 మంది హాజరయ్యారు. వారిలో 17,189 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. సీట్లను 16వ తేదీన కేటాయించనున్నారు.

GITAM INSTITUTE OF MEDICAL SCIENCES AND RESEARCH
GITAM (DEEMED TO BE UNIVERSITY)
Rushikonda ,Visakhapatnam-530045,Andhra Pradesh, India.
GITAM MBBS ADMISSIONS THROUGH DGHS COUNSELING
The left over **MBBS seats** will be filled through the **NEET 2019** online counseling conducted by Directorate General of Health Services (DGHS), New Delhi. The candidates who have not registered are informed to do the registration for **MOP-UP Round** by login to the official website ***http://www.mcc.nic.in***. **The registration process for MOP-UP Round counseling is scheduled from 13 to 15 August, 2019.**
Registrar
CONTACT: 9440279462 / 9885011250

ఈనాడు

ఓడుతున్న క్రీడాస్ఫూర్తి

పోటీదారులపై అనైతిక ఆధిక్య సాధనను, మెరుగైన పాటవ ప్రదర్శనను లక్షించి క్రీడాకారులు నిషేధిత ఉత్ప్రేరక పదార్థాలు వాడేనైచ్యం- డోపింగ్. దేశీయంగా అటువంటి కానిపనుల్ని నివారించడం కోసం నెలకొల్పిందే జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా). ఆ వ్యవస్థ పరిధిలోకి తనవంటి మేరువు చేరడమేమిటని కొన్నేళ్లుగా మొండివాదన వినిపిస్తున్న భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) కడకు బెట్టు సడలించి మెట్టు దిగిరాక తప్పలేదు! 'నాడా' నిబంధనలు ఆటగాళ్ల వ్యక్తిగత గోప్యతకు భంగకరంగా ఉన్నాయని, అది నిర్వహించే పరీక్షల నాణ్యతపై తనకు నమ్మకం లేదని, సకాలంలో ఫలితాల వెల్లడికి అనువైన ఏర్పాట్లు కొరవడ్డాయని... ఎప్పటికప్పుడు అభ్యంతరాలు వల్లెవేసిన బీసీసీఐకి ఇటీవల యువ క్రికెటర్ పృథ్వీ షా ఉదంతం అమాంతం గాలి తీసేసింది. డోప్ పరీక్షలో పట్టుబడిన షా తాను వేసుకున్న దగ్గుమందులో నిషేధిత ఉత్ప్రేరకం ఉందంటూ ఇచ్చిన వివరణతో 'సంతృప్తి' చెందిన బీసీసీఐ అతడిపై ఎనిమిది నెలల నిషేధం విధించిన సమాచారం, జులై నెలాఖరులో వెలుగుచూసింది. ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్)లో ఆడేందుకు వీలుగానే అతడి డోప్ పరీక్ష ఫలితాల్ని అప్పటి దాకా తొక్కిపట్టి ఉంచారన్న ఆరోపణలు, దోషిగా తేలిన దరిమిలా నిషేధాన్ని మార్చి నెల నుంచే అమలుపరచడంపట్ల తీవ్ర అభ్యంతరాలు- బోర్డును ఇరకాటంలోకి నెట్టేశాయి. నిరుడు జనవరిలో మరో క్రికెటర్ యూసుఫ్ పఠాన్ కేసులోనూ నిషేధ కాలాన్ని వెనక్కి జరిపి లెక్కించి 'శిక్షను పరిహాసాస్పదం చేసిన బీసీసీఐకి, ఈసారి ఇష్టారాజ్యంగా చలాయించుకునే అవకాశం దక్కలేదు. బర్మింగ్‌హామ్ వేదికగా 2022నాటి కామన్వెల్త్ క్రీడల్లో మహిళా క్రికెట్ జట్టు పాల్గొనాలంటే 'నాడా' గొడుగు కిందకు చేరకతప్పదన్న సంకేతాలు అందాకనే బీసీసీఐ గాడిన పడిందన్నది విశ్లేషకుల అంచనా. ఇకమీదట దేశవాళీ పోటీలప్పుడు తనంత తానుగా, ద్వైపాక్షిక సిరీస్‌లూ ప్రపంచ కప్ పోటీల సందర్భంగా ఐసీసీ ఆదేశాలపై ఆటగాళ్ల నుంచి శాంపిళ్ల సేకరణ బాధ్యత 'నాడా'కు దఖలుపడింది. ఈ పరిణామం భారత క్రికెట్ ముఖచిత్రాన్ని ఏ మేరకు తేటపరచగలదో చూడాలి.

సుమారు మూడు దశాబ్దాల క్రితం సియోల్ ఒలింపిక్స్ వంద మీటర్ల పరుగు పందెంలో చిరుతలా దూసుకుపోయి విశ్వరికార్డు నెలకొల్పిన బెన్ జాన్సన్ డోపింగ్ పరీక్షలో దోషిగా నిలవడం యావత్ క్రీడాప్రపంచాన్నీ దిగ్భ్రాంతపరచింది. అనంతర కాలంలో నిషేధిత ఉత్ప్రేరక ద్రవ్యం సేవించినట్లు నిర్ధారణై తమతమ దేశాలకు అప్రతిష్ఠ తెచ్చిన అథ్లెట్ల పేర్లెన్నో వెల్లడయ్యాయి. ఓటమిని హుందాగా స్వీకరించడమే అసలైన క్రీడాస్ఫూర్తి. అది సాంతం కొరవడి ఎలాగైనా నెగ్గాలన్న దుగ్ధ దేశదేశాల్లో ఎందరినో డోపింగ్‌కు పురిగొల్పిన బాగోతాలెన్నో పోగుపడ్డాయి. పందొమ్మిదేళ్ల క్రితం సీమా పునియా, 2008లో రెంజిత్ మహేశ్వరి, 2010లో సనమాచ చాను, మూడేళ్ల క్రితం నర్సింగ్ ప్రభృతుల పేర్లు అలా మకిలి జాబితాలో చేరినవే. పునస్సమీక్షానంతరం కొంతమందిని దోషారోపణల నుంచి విముక్తుల్ని చేస్తున్నా, భిన్న క్రీడాంశాల్లో డోపింగ్ భల్లూకం పట్టు బిగుస్తూనే ఉంది. వివిధ శ్రేణుల్లో జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్లు ముగ్గురితోపాటు కబడ్డీ, జావెలిన్ త్రో, దేహదారుఢ్య పోటీలు తదితరాల్లో పతక వీరులుగా మెరుస్తున్న ఇంకొందరూ 'నాడా' తాజా జాబితాలో దోషులుగా నిలిచారు! దిల్లీ వేదికగా ప్రతిష్ఠాత్మక 'ఖేలో ఇండియా' పోటీల బరిలోకి దూకినవారిలో పన్నెండు మంది అథ్లెట్లు డోపీలుగా పట్టుబడిన ఘటన- చాప కింద నీరులా విస్తరిస్తున్న ముప్పును కళ్లకు కట్టింది. ఏ క్రీడాంశాలకు చెందినవారైనా తప్పనిసరిగా నిర్దిష్ట విధినిషేధాలకు లోబడి తీరేట్లు అన్ని అంచెల్లోనూ నట్లు బిగిస్తేనే తప్ప డోపింగ్ ప్రహసనాలు తగ్గుముఖం పట్టవు.

ఒక దేశమే పతకాల కోసం పతనమైన వైనాన్ని నాలుగేళ్ల నాటి 'వాడా' (ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ) నివేదిక సోదాహరణంగా తెలియజెప్పింది. అథ్లెట్ల చేత రష్యా నిషేధిత ఉత్ప్రేరక పదార్థాలను ఉద్దేశపూర్వకంగానే వాడిస్తున్నట్లు నిగ్గుతేల్చిన ఆ అధ్యయనం, 2012 ఒలింపిక్స్ సహా పలు అంతర్జాతీయ పోటీల్లోనూ అలా అనుచిత లబ్ధి పొందినట్లు ధ్రువీకరించింది. ఆ దెబ్బతో ప్రపంచ అథ్లెటిక్ సమరంతోపాటు రియో ఒలింపిక్స్‌లో పాల్గొనడానికీ రష్యాకు దారులు మూసుకుపోయాయి. ఒక్క రష్యా అనే ముంది- ఎన్నోచోట్ల అంతర్జాతీయ అథ్లెటిక్ సంఘాలు గడ్డి తింటున్నాయన్న ఆరోపణలు, ఎక్కడికక్కడ క్రీడాస్ఫూర్తి క్షతగాత్రమై నిలువునా నెత్తురోడుతున్న దయనీయ దృశ్యాల్ని ఆవిష్కరిస్తున్నాయి. కెన్యాలో పదుల సంఖ్యలో అథ్లెట్లు డోపింగ్ పరీక్షల్లో దొరికిపోయారు. ఆ జాబితాలో టర్కీ, ఫ్రాన్స్, ఇండియా, బెల్జియం, ఇటలీ, స్పెయిన్, పోలండ్, కజకిస్థాన్, దక్షిణాఫ్రికాల పేర్లూ చోటుచేసుకోవడం డోపింగ్ విస్తృతి ఎంతటిదో స్పష్టీకరిస్తోంది. 'నాడా'లో బీసీసీఐ చేరిక సానుకూల పరిణామమని సంబరపడుతున్న భారత క్రీడామంత్రిత్వ శాఖ- ఇన్నేళ్లూ అథ్లెటిక్స్ నుంచి కుస్తీ వరకు, జూడో నుంచి వాలీబాల్ దాకా డోపింగ్ కేసులు ఇంతలంతలవుతుంటే ఏం చేసినట్లు? రష్యాలో ప్రభుత్వ యంత్రాంగమే చేజేతులా అనుచిత విధానాలను ప్రోత్సహించి, తీరని భంగపాటు కొనితెచ్చుకోగా- దేశంలో మంత్రిత్వ శాఖ, క్రీడాసమాఖ్యల అలసత్వం వాటి మధ్య సమన్వయరాహిత్యం దారుణ అవ్యవస్థను స్థిరీకరిస్తున్నాయి. అత్యధిక డోపింగ్ ఉల్లంఘనల ప్రాతిపదికన రష్యా ఇండియా సంయుక్తంగా ఆరో స్థానాన నిలిచాయంటున్న 'వాడా' గణాంకాలు- క్రీడల్ని శ్వాసించి సమాదరించే భారతీయులెందరికో తలవంపులు. ఈ దుస్థితిని బదాబదలు చేసేలా 'నాడా', బీసీసీఐ, ఇతర క్రీడాసమాఖ్యల ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక పదునుతేలాలి. అంచెలవారీగా విస్తృత కసరత్తుతో అద్భుతాలు సాధిస్తున్న చైనా అనుభవం చాటుతున్నట్లు- నిషేధిత ఉత్ప్రేరక పదార్థాలు కాదు... నిరంతర కఠోర సాధన, అకుంఠిత దీక్షతో శిక్షణలే జగజ్జేతలను సృష్టిస్తాయి!

సహ చట్టానికి సవరణల తూట్లు

స్వాతంత్ర్యానంతరం పౌరుల ప్రాథమిక హక్కులపై దేశంలో ఎప్పుడూ ఏదో ఒక స్థాయిలో దాడి జరుగుతూనే ఉంది. రాజ్యాంగంలోని 19(1) (ఎ) అధికరణం భావ ప్రకటన స్వేచ్ఛను పౌరులకు ప్రాథమిక హక్కుగా దఖలుపరచింది. ఓటు వేయడం, రచనల ద్వారా అభిప్రాయాలు వెల్లడించడం, ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం సేకరించడం వంటివి క్రమంగా భావ ప్రకటన స్వేచ్ఛలో అంతర్భాగంగా మారాయి. సర్వోన్నత న్యాయస్థానం వివిధ సందర్భాల్లో వెలువరించిన తీర్పులే ఇందుకు ప్రాతిపదికలయ్యాయి. 'ప్రజల వల్ల, ప్రజల చేత, ప్రజల కోసం' ప్రాదుర్భవించిన ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ రికార్డుల్లోని సమాచారాన్ని తెలుసుకొనే హక్కు ప్రజావళికి ఉండాలి. గడచిన ఆరు దశాబ్దాలుగా ఈ హక్కులకు పరిమితులు విధించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ఎప్పటికప్పుడు కోర్టులు జోక్యం చేసుకొని ఈ హక్కులకు రక్షరేకు తొడుగుతుండటం కొంతలో కొంత ఊరట కలిగించే పరిణామం. సమాచార హక్కు అన్నది ప్రభుత్వాల చొరవ, సహకారంతో ముడివడిన విషయం. తాము తీసుకొనే నిర్ణయాల వెనక కారణాలు, అవసరాలను ప్రజలకు వెల్లడించేందుకు సర్కార్లేవీ అంతగా ఇష్టపడవు. అందువల్లే ప్రభుత్వ సమాచారం ఈ దేశంలో ప్రజలకు దశాబ్దాలపాటు అంతుచిక్కని బ్రహ్మపదార్థంగా మిగిలిపోయింది.

ప్రజాచైతన్య ఫలితం

సమాచార హక్కుకు చట్టబద్ధత కల్పించాలంటూ దేశవ్యాప్తంగా పౌర సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పెద్దయెత్తున డిమాండ్ చేయడంతో పదిహేనేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం దిగివచ్చింది. 2005 అక్టోబరు 12న సమాచార హక్కుకు సంపూర్ణ చట్టబద్ధత కల్పిస్తూ యూపీఏ సర్కారు తీసుకున్న నిర్ణయం కొత్త అధ్యాయానికి తెరలేపింది. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రతి సమాచారాన్నీ ప్రజలకు వెల్లడించవచ్చునని, 8(1) నిబంధన ప్రకారం పది విభాగాలుగా వర్గీకరించిన వివరాలను మాత్రం నిరాకరించవచ్చునని ఆ చట్టంలో స్పష్టం చేశారు. అధికార రహస్యాల చట్టం లేదా మరే చట్టాలు, ఇతర నిబంధనల ప్రకారం కూడా పౌరులకు సమాచారం ఇవ్వకుండా నిరాకరించరాదు. ప్రజాందోళనల నేపథ్యంలో సమాచార హక్కు చట్టం తీసుకువచ్చిన నాటి యూపీఏ ప్రభుత్వం కొన్ని నెలలైనా గడవకముందే ఇబ్బంది పడటం ప్రారంభించింది. సమాచార హక్కు చట్టం ప్రజలకు సాధికారత కల్పించింది. ప్రభుత్వ విభాగాలన్నీ జవాబుదారీతనంతో మెలగాల్సిన అవసరాన్ని చాటిచెప్పింది. ప్రజా చైతన్యం వికసించడం ఏలినవారికి ఇబ్బంది కలిగించింది. దాంతో చట్టం తెచ్చిన ఏడాది కాలంలోనే సవరణలు చేసి దాన్ని నీరుగార్చేందుకు 2006లో ప్రభుత్వం ప్రయత్నించింది. ఆ ప్రయత్నాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా ప్రజాందోళనలు మిన్నంటడంతో సర్కారు వెనక్కితగ్గింది. ఆ తరవాత మరో రెండు సందర్భాల్లోనూ చట్టాన్ని బలహీనపరచేందుకు ఎక్కడైనా సందు దొరుకుతుందేమో అని చూసిన ప్రభుత్వం- జనాగ్రహం కారణంగా ఆ ప్రయత్నాలను విరమించుకుంది.

సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు సమాచారాన్ని వెల్లడించేందుకు ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించాలి. ఏవైనా వివరాలను అభ్యర్థిస్తూ ప్రజలనుంచి దరఖాస్తు వచ్చిన 30రోజుల్లోగా సంబంధిత సమాచారాన్ని వారికి అందించాల్సిన బాధ్యత ఆ అధికారిపై ఉంటుంది. ఒకవేళ నిర్దేశిత గడువులోగా ఆ అధికారి అడిగిన వివరాలు వెల్లడించకపోతే- అదే విభాగంలోని సీనియర్ అధికారికి పౌరులు ఫిర్యాదు చేయవచ్చు. అప్పటికీ పౌరులకు సంతృప్తికర సమాధానం రానిపక్షంలో సమస్యను వివరిస్తూ సమాచార కమిషన్‌కు వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక ఆ దశలో ప్రభుత్వ విభాగాలను ఆదేశించి, అవసరమైన సమాచారం ఇప్పించి వారి హక్కులను కాచుకోవాల్సిన పూర్తి బాధ్యత సమాచార కమిషన్‌పైనే ఉంటుంది. కేంద్ర సమాచార కమిషనర్ల హోదా, వేతనాలు కేంద్ర ఎన్నికల కమిషనర్లతో సమానంగా ఉండాలని చట్టం చెబుతోంది. దాని ప్రకారం రాష్ట్ర సమాచార కమిషనర్లు ప్రధాన కార్యదర్శితో సమానమైన హోదా కలిగి ఉండాలి. ఆర్‌టీఐ ముసాయిదా తొలి ప్రతిని 2014 డిసెంబరులో పార్లమెంటు ముందుకు తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటయ్యే సమాచార కమిషన్లు పౌరుల సమాచార హక్కుకు బాధ్యత వహించాలని ఆ ముసాయిదా ప్రతిలో ప్రతిపాదించారు. సమాచార హక్కు ప్రధాన కమిషనర్ ప్రభుత్వ కార్యదర్శి

పారదర్శకతకు తిలోదకాలు

హోదాలో; ఇతర కమిషనర్లు సంయుక్త కార్యదర్శులతో సమాన స్థాయిలో ఉంటారని ముసాయిదాలో వెల్లడించారు. ఆ తరవాత ముసాయిదా ప్రతిని పార్లమెంటరీ స్థాయీసంఘం అధ్యయనానికి పంపించారు. ఆరు దశల్లో స్థాయీసంఘం ముసాయిదాపై చర్చలు జరిపింది. సమాచార కమిషనర్లు, కార్యాలయాల విషయంలో స్థాయీసంఘం చెప్పిన మాటలివి. 'పౌరులకు సమాచారం అందుబాటులోకి రావడమన్నది కమిషన్ల ప్రభావశీలతపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి కమిషన్లుకుగాని, వాటిలో బాధ్యతలు నిర్వహించే అధికారులకుగాని సంపూర్ణ స్వేచ్ఛ, స్వతంత్ర ప్రతిపత్తి అవసరం. అందుకోసం సమాచార కమిషనర్ల స్థాయిని పెంచాలి. భారత ఎన్నికల కమిషన్ బాధ్యులతో సమానంగా వారి హోదాలు మార్చాలి' అని పార్లమెంటరీ స్థాయీసంఘం అభిప్రాయపడింది. ఆ సంఘంలో బాజపాకు చెందిన ఆరుగురు సభ్యులు ప్రతినిధులుగా ఉన్నారు. ప్రస్తుత భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సైతం ఆ సంఘంలో సభ్యులే! సమాచార కమిషన్ల అధికారాలకు కోతపెట్టడంతోపాటు, కమిషనర్ల పరిధిని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేసే అవకాశాలున్నాయని స్థాయీసంఘం ఆనాడు హెచ్చరించింది. అందుకే రాజీలేని వైఖరిని అనుసరించి కమిషనర్ల హోదా, అధికారాలను అత్యున్నత స్థాయిలో తీర్మానించింది. కమిషనర్ల ఆదేశాలకు సమున్నత విలువ ఉండేలా, సమాచార కమిషన్ సర్వ స్వతంత్రంగా బాధ్యతలు నిర్వహించేలా స్థాయీసంఘం గట్టి చొరవ చూపింది. ఆ దృష్టితోనే కమిషనర్ల కాలావధిని అయిదేళ్లుగా నిర్ణయించారు.

అహేతుక పోకడలు

సహ చట్టంలో సవరణలకు సమకట్టడం ద్వారా సమాచార కమిషనర్ల పదవీకాలం, హోదాలకు కోత పెట్టేందుకు ప్రభుత్వం ప్రస్తుతం ప్రయత్నిస్తోంది. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ వ్యవస్థ కాబట్టి- చట్టబద్ధంగా ఏర్పాటైన సమాచార కమిషన్‌ను దానితో సరిపోల్చలేమని ప్రభుత్వం కారణాలు వినిపిస్తోంది. రాజ్యాంగబద్ధ వ్యవస్థల హోదా, అధికారాల వివరాలు రాజ్యాంగ పత్రంలో వెల్లడించారు. అందుకు భిన్నంగా చట్టబద్ధ వ్యవస్థలన్నీ పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పాటవుతాయి. చట్టబద్ధ వ్యవస్థలకు రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన సంస్థలతో సమాన స్థాయి ఉండదంటూ ప్రభుత్వం వినిపిస్తున్న వాదనలో పసలేదు. ఎందుకంటే జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ వంటివి చట్టబద్ధ సంస్థలైనప్పటికీ- వాటి సారథులకు కేంద్ర ఎన్నికల కమిషనర్లతో సమాన హోదా కల్పించడం గమనార్హం. కమిషన్ నిర్ణయాలను హైకోర్టుల్లో సవాలు చేయవచ్చు కాబట్టి సమాచార కమిషనర్ల హోదా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాల జడ్జీలకంటే తక్కువే అన్నది ప్రభుత్వ అభిప్రాయం. ఈ వాదనలోనూ సహేతుకత లేదు. ఎందుకంటే ఆర్‌టీఐ వ్యవహారాల్లో తుది అప్పీలు అధికారం సమాచార కమిషన్‌దే. ఆ నిర్ణయాలపై వెలువడే సవాళ్లు, వాటిపై విచారణ అన్నది న్యాయస్థానాల పరిధిలోని వ్యవహారం. ఇదేమీ కొత్త విషయం కాదు. రాష్ట్రపతి, గవర్నర్ల నిర్ణయాలనూ న్యాయస్థానాల్లో సవాలు చేసే అవకాశాలు మన దేశంలో ఉన్నాయి. అటువంటప్పుడు సమాచార కమిషన్‌ను మాత్రమే మినహాయింపుగా ప్రస్తావించడం సమంజసం కాదు.

ఉభయ సభలూ ఆర్‌టీఐ చట్ట సవరణలకు ఆమోదం తెలిపాయి. ఆ మేరకు సవరణలు ప్రతిపాదించే ముందు ఏ దశలోనూ సమగ్ర చర్చ జరగలేదు. ప్రజా బాహుళ్యంతో ముడివడిన ఈ వ్యవహారంపై ప్రజాక్షేత్రంలో చర్చకు పెట్టిన తరవాత నిర్ణయాలు తీసుకుని ఉంటే బాగుండేది. అలాకాకుండా ఆదరాబాదరగా, ఎలాంటి హేతుబద్ధత లేకుండా సవరణలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సమాచార కమిషనర్ల పదవీకాలం, హోదాలపై నియంత్రణ సాధించి దేశవ్యాప్తంగా సమాచార కమిషన్లను గుప్పిట పట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందా అన్న అనుమానాలున్నాయి. దీనివల్ల సహ చట్టం బలహీనపడుతుంది. పటుతర వ్యవస్థ నీరుగారిపోతుంది. సమాచార కమిషనర్లకు స్వతంత్ర ప్రతిపత్తి ఉండాలని 2005లో భాజపా ఎంపీలు డిమాండ్ చేశారు. గతంలో తాము అనుసరించిన విధానాలకు భిన్నంగా ఇప్పుడు వారి వ్యవహార సరళి ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. సమాచార కమిషన్లు పౌరుల భావ ప్రకటన స్వేచ్ఛకు రక్షణ కవచాలుగా ఉపయోగపడతాయి. ప్రజాస్వామ్య విలువలకు జవాబుదారీగా ఉండే ఇలాంటి వ్యవస్థలను బలోపేతం చేయాల్సిందిపోయి- వాటిని బలహీనపరచేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఏమాత్రం ఆమోదనీయం కాదు!

- శైలేష్ గాంధీ
(రచయిత- మాజీ కేంద్ర సమాచార కమిషనర్)

ప్రత్యేక శాఖతోనే ప్రగతి

అభివృద్ధిలో దేశంలోని పదకొండు హిమాలయ పర్వత ప్రాంత రాష్ట్రాలు వెనకబాటులో ఉన్నాయి. ఈ దుస్థితి నుంచి బయటపడేందుకు ఆ రాష్ట్రాలు తమవంతు ప్రయత్నాలు ప్రారంభించాయి. అందులో భాగంగా గత నెలాఖరులో తొలిసారి ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో సమావేశమయ్యాయి. వెనకబాటుకు గల కారణాలు, భౌగోళిక పరిమితులు, ఇబ్బందుల గురించి చర్చించాయి. ఆదాయ వనరుల పంపిణీలో అన్ని రాష్ట్రాల మాదిరిగా తమను పరిగణించరాదని, కేంద్రం ప్రత్యేక దృష్టితో చూడాలని, ఇందుకోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాయి. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి త్రివేంద్రసింగ్ రావత్ చొరవతో జరిగిన సమావేశానికి పది రాష్ట్రాలు హాజరయ్యాయి. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్ (ప్రస్తుతం రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటైంది) సిక్కిం, అసోం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మిజోరమ్, మేఘాలయ, మణిపూర్, త్రిపురకు హిమాలయ పర్వత రాష్ట్రాలుగా పేరుంది. సమావేశానికి హాజరైన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్, పదిహేనో ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎన్.కె.సింగ్ ముందు తమ డిమాండ్లను ఉంచారు. 'ముస్సోరీ' తీర్మానంగా ఈ డిమాండ్లు గుర్తింపు పొందాయి.

పర్వతాలు, కొండలు, నదులతో విస్తరించిన హిమాలయ రాష్ట్రాలు అభివృద్ధిలో వెనకబడిన మాట వాస్తవం. ఆదాయ వనరుల లేమి ఇందుకు ప్రధాన కారణం. వరదలు, తుపాన్లు, కరవు వంటి సమస్యలతో అవి తరచూ సతమతమవుతుంటాయి. కొద్దిపాటి వనరులతో అభివృద్ధి సాధించడం, ప్రకృతి ఉత్పాతాలను ఎదుర్కోవడం వాటికి శక్తికి మించిన పని అవుతోంది. ఇటీవల బ్రహ్మపుత్ర వరదలు అసోమ్‌ను అతలాకుతలం చేశాయి. భారీగా ఆస్తి ప్రాణ నష్టాలు సంభవించాయి. 2014లో జమ్మూకశ్మీర్‌ను వరదలు ముంచెత్తాయి. రాజధాని నగరం శ్రీనగర్‌లోకి వరద జలాలు ప్రవేశించడంతో జనజీవనానికి అంతరాయం కలిగింది. ఏటా జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ వాసులు 'మంచు' కష్టాలు ఎదుర్కోవడం ఆనవాయితీగా మారింది.

హిమాలయ పర్వత రాష్ట్రాల్లో విస్తృతమైన జలవనరులు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు ఉన్నప్పటికీ అభివృద్ధి 'ఎక్కడవేసిన గొంగడి...' చందంగా ఉంది. మిగులు విద్యుత్ విక్రయం ద్వారా సిక్కిం అభివృద్ధికి నిధులు పొందవచ్చని పవన్‌కుమార్ చామ్లింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆలోచనలు సాగాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓడిపోవడంతో ఆ ప్రతిపాదన ముందుకెళ్లలేదు. 2000లో కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించిన 'దేవభూమి' ఉత్తరాఖండ్ నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంది. చార్‌ధామ్ యాత్రలో భాగమైన ఇక్కడి కేదార్‌నాథ్, బదరీనాథ్, గంగోత్రి, యమునోత్రి పుణ్యక్షేత్రాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఏటా పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయినా సరైన రోడ్లు, మౌలిక సౌకర్యాలు విస్తరించలేదు. గంగానది వరదలు రాష్ట్రాన్ని ముంచెత్తుతుంటాయి. బ్రహ్మపుత్ర నదీజలాలను సద్వినియోగం చేసుకుంటే ఈశాన్య రాష్ట్రాల్లో అతి పెద్దదైన అసోమ్ రూపురేఖలే మారిపోతాయి. ఈశాన్య భారత్‌ను ఆగ్నేయాసియా వాణిజ్య కూడలిగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి సాధించగలదు. భూతలస్వర్గమైన కశ్మీర్‌లో శాంతిభద్రతల పరిస్థితి మెరుగుపడితే పర్యాటక ఆదాయం, అమర్‌నాథ్, మాతా వైష్ణోదేవిని సందర్శించే భక్తుల సంఖ్యా పెరుగుతాయి.

హిమాలయ పర్వత రాష్ట్రాల డిమాండ్

భౌగోళికంగా హిమాలయ పర్వత రాష్ట్రాలు అంతర్జాతీయ సరిహద్దుల్లో ఉన్నాయి. జమ్మూకశ్మీర్ పాకిస్థాన్‌తో సరిహద్దులు కలిగి ఉంది. రెండు దేశాల మధ్యగల నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వద్ద తరచూ ఉద్రిక్తతలు చోటుచేసుకుంటూ ఉంటాయి. దీంతో అక్కడి ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వీరి భద్రతకు ఉపయోగపడే బంకర్లు తగినన్ని లేవన్నది చేదునిజం. సరిహద్దు ప్రాంతాల ప్రజలు భారతీయ సైన్యానికి వేగుల్లా ఉపయోగపడతారు. 1999లో కార్గిల్ ప్రాంతంలోకి పాకిస్థాన్ ముష్కరుల చొరబాటు గురించి ముందుగా సమాచారం అందించింది స్థానిక గొర్రెల కాపరులే. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు చైనాతో కొద్దిపాటి సరిహద్దు కలిగిఉన్నప్పటికీ చెప్పుకోదగ్గ ఇబ్బందులు లేవు. ఈశాన్య రాష్ట్రాలు బంగ్లాదేశ్, చైనా, మియన్మార్, భూటాన్, నేపాల్‌లతో సరిహద్దులు కలిగి ఉన్నా ఆయా దేశాలతో పెద్దగా సమస్యలు ఎదురుకాలేదు.

ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఈ ప్రాంత యువత పెద్దయెత్తున వలసబాట పడుతోంది. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు బతుకుతెరువు కోసం పొట్టచేత పట్టుకుని ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు తరలిపోతుంటారు. భవన నిర్మాణ పనులు, ఇతర చిన్నాచితక ఉద్యోగాలతో జీవనం సాగిస్తున్నారు. జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ యువత దిల్లీ పరిసర ప్రాంతాలకు ఉపాధి కోసం తరలి వెళ్లడం నిత్యకృత్యంగా మారింది.

ప్రస్తుతం పన్నుల వాటాలో 42 శాతాన్ని కేంద్రం రాష్ట్రాలకు కేటాయిస్తోంది. ఈ మొత్తాన్ని 50 శాతానికి పెంచాలన్నది వీటి ప్రధాన డిమాండ్. ఈ విషయంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో తమను పరిగణించడం సరికాదన్న వాటి వాదన సహేతుకమైనదే. తమ బడ్జెట్లో 7.5 శాతాన్ని కేటాయించేందుకు కేంద్రం సుముఖంగా ఉన్నా, ఈ మొత్తాన్ని 15 శాతానికి పెంచాలని ఈ రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దాదాపు 900 హిమానీనదాలు దేశంలో జలవనరులకు ఆధారంగా ఉన్నాయి. ఇక్కడి అడవులు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నాయి. అందువల్ల తమకు అదనంగా నిధులు ఇవ్వాలన్న వీటి అభ్యర్థనను తోసిపుచ్చలేం! జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లను మినహాయిస్తే ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉంది. వాజ్‌పేయీ హయాములో 2001లో దీన్ని ఏర్పాటు చేశారు. జితేంద్ర సింగ్ సారథిగా ఉన్న ఈ మంత్రిత్వశాఖ వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదన్న అభిప్రాయం ఆయా రాష్ట్రాల్లో ఉంది. దీని స్థానంలో హిమాలయ పర్వత రాష్ట్రాల అభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అవి కోరుతున్నాయి!

- జి.మారుతీలత

ఈనాడు లేఖలు

లోపించిన స్వచ్ఛత

ఒకప్పుడు భారతదేశం పల్లెలకు పట్టుగొమ్మలా ఉండేది. ఇప్పుడు అభివృద్ధి పేరిట పట్టణాల్లో, నగరాల్లో స్థిరపడేవారు అధికమయ్యారు. జనాభా విపరీతంగా పెరగడంతో మెట్రోపాలిటన్ నగరాలు మురికి కూపాలుగా తయారవుతున్నాయి. అత్యధిక స్థాయిలో అవి చెత్తను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే, దిల్లీ సమీపంలో ఏర్పాటైన 'ఘాజీపూర్ చెత్త కొండ' తరహాలో ప్రతి నగరానికీ ఒక చెత్త గుట్ట దర్శనమిచ్చే దుస్థితి దాపురిస్తుంది. యంత్రాలద్వారా వ్యర్థాలను పునర్వినియోగానికి అనువుగా తయారు చేసే ప్రక్రియపై ప్రభుత్వాలు దృష్టి సారించకపోవడం దురదృష్టకరం. దీంతో పెద్ద నగరాల్లో చెత్త నియంత్రణ అధ్వానంగా ఉంది. ఉత్పత్తవుతున్న చెత్తలో ప్లాస్టిక్ ఎక్కువగా ఉంటోంది. ప్లాస్టిక్ కవర్ల తయారీపై నిషేధం విధించడమే దీనికి అసలైన పరిష్కారం. పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా జౌళి సంచులను ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు వెంటనే చెత్త నిర్వహణపై దృష్టి సారించాలి.

- ముప్వ కృష్ణమనాయుడు, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్

పేదరికంపై ఊహలొద్దు

త్వరలోనే దేశంలో పేదరికాన్ని రూపుమాపుతామంటూ ప్రస్తుతం ఉన్న పథకాలకు మంగళం పాడటం సరికాదు. ఇకపై ఉపాధి హామీ పథకం అవ

కండువాతో షణ్ముగవేల్‌ను కట్టే ప్రయత్నం చేస్తున్న దుండగుడు ★ చెప్పులు విసురుతున్న సెంతామరై ★ కుర్చీ తీసుకుని తిరగబడిన షణ్ముగవేల్

ధైర్యమే ఆయుధం... దొంగలు పలాయనం

- దోపిడీదారులను తరిమికొట్టిన వృద్ధ దంపతులు
- కత్తులు దూసినా వెనకడుగు వేయని వైనం

చెన్నై, న్యూస్‌టుడే: దోపిడీకొచ్చిన దుండగుల చేతుల్లో కత్తులున్నాయి... అయితేనేం ఆ వృద్ధ దంపతుల్లో ధైర్యం ఉంది... అంతకు మించి తెగువ ఉంది. ముసలోళ్లే కదా ఏమీ చేయలేరులే అనుకుని బరితెగించిన దొంగలు తోకముడవక తప్పలేదు. తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా కడయం సమీపాన కల్యాణిపురానికి చెందిన షణ్ముగవేల్, సెంతామరై దంపతులకు ముగ్గురు సంతానం. పిల్లలు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తుండగా వృద్ధ దంపతులు ఇక్కడ నివసిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఇంటి ముంగిట షణ్ముగవేల్ కుర్చీలో కూర్చుని ఉన్నారు. అంతలో ముసుగు ధరించిన ఓ వ్యక్తి వెనుక నుంచి నెమ్మదిగా వచ్చి, ఆయన గొంతుకు కండువా బిగించాడు. పక్కనే ఉన్న ఇనుప స్తంభానికి కట్టేసేందుకు ప్రయత్నిస్తుండగా... షణ్ముగవేల్ గట్టిగా అరిచారు. ఏమైందా అనుకుంటూ ఇంట్లో నుంచి సెంతామరై బయటకు వచ్చారు. అంతలో షణ్ముగవేల్ దగ్గరకు ముసుగు ధరించిన మరో వ్యక్తి కత్తితో చేరుకున్నాడు. ఆ కత్తిని షణ్ముగవేల్ లాగేసుకోబోయారు. గలాటాలో ముగ్గురూ కింద పడ్డారు. చేతికి గాయమైనా వెనకడుగు వేయని షణ్ముగవేల్ ప్లాస్టిక్ కుర్చీ తీసుకుని వారిపై ఎదురు దాడికి దిగారు. అప్పటికే సెంతామరై ఇంటి ముందున్న చెప్పులు, ప్లాస్టిక్ బకెట్లు, కుర్చీలు, మగ్గులను దుండగులపై విసురుతున్నారు. ఈ ప్రతిఘటనతో నివ్వెరపోయిన దొంగలు కత్తులు చూపుతూ పైకి వెళ్లారు. ఏమాత్రం బెదరకుండా వృద్ధులు తిప్పికొట్టారు. చేసేది లేక బతుకుజీవుడా అనుకుంటూ దుండగులు పరారయ్యారు. ప్లాస్టిక్ కుర్చీ తీసుకుని షణ్ముగవేల్ కొద్దిదూరం వారిని వెంటాడారు. దుండగుల్లో ఒకరు వదిలి వెళ్లిన కత్తిని తీసుకుని వెనక్కు వచ్చారు. తిరిగివచ్చి చూసుకుంటే సెంతామరై మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు కనిపించలేదు. ఈ గలాటాలో దొంగలే దానిని తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరా ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతం అయ్యాయి. వృద్ధ దంపతుల ధైర్యానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఫుటేజీల ఆధారంగా దుండగులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

నేటి నుంచి బీఆర్కే భవన్‌లో ఉన్నతాధికారుల విధులు

- ఉద్యోగుల రాకకు మరికొంత సమయం
- దస్త్రాలు, ఫర్నిచర్ చేరాకే రావాలని ఉద్యోగులకు సూచన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ తాత్కాలిక సచివాలయం బూర్గుల రామకృష్ణారావు (బీఆర్‌కే)భవన్‌లో మంగళవారం నుంచి ఉన్నతాధికారుల కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు ఇక్కడి నుంచే విధులు నిర్వర్తించనున్నారు. మరోవైపు సిబ్బంది రాకకు మరికొన్ని రోజుల సమయం పట్టనుంది. దస్త్రాలు, ఫర్నిచర్ పూర్తిస్థాయిలో చేరిన తర్వాతే ఉద్యోగుల కార్యకలాపాలు మొదలుకానున్నాయి. మరోవైపు సచివాలయం తరలింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అధిక శాతం శాఖల సామగ్రిని తరలించారు. కొన్ని శాఖల దస్త్రాలు, ఫర్నిచర్ చేరాల్సి ఉంది. మూడురోజుల సెలవుల దృష్ట్యా సిబ్బంది రాకపోవడంతో తరలింపులో జాప్యం ఏర్పడింది. మంగళవారం నుంచి మళ్లీ పనులు పూర్తిస్థాయిలో జరగనున్నాయి. బీఆర్‌కే భవన్‌కు రంగులు, లిఫ్ట్‌ల మరమ్మతు పనులు సాగుతున్నాయి. మంత్రుల గదులను సిద్ధం చేస్తున్నారు. విభాగ (సెక్షన్) కార్యాలయాలకు విద్యుత్, ఫ్యాన్లు, ఏసీలు సమకూరుస్తున్నారు. పార్కింగ్ కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్కింగ్‌కు స్థలం కొరత దృష్ట్యా ఎమ్మెల్యేల నివాస గృహసముదాయాన్ని వినియోగించుకోనున్నారు. సచివాలయ కార్యకలాపాల దృష్ట్యా బీఆర్కే భవన్‌కు పూర్తిస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రాంగణంలో ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తు ప్రారంభించాయి.

దేశవ్యాప్తంగా తగ్గిన సాగు విస్తీర్ణం 31 శాతం

- ఏపీలో తిరోగమనంలో పంటల సాగు
- వరి, పత్తి మినహా తెలంగాణలోనూ ఇదే తీరు
- కేంద్ర వ్యవసాయశాఖ గణాంకాల్లో వెల్లడి

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 31% మేర సాగు విస్తీర్ణం తగ్గింది. ఆగస్టు రెండో వారానికల్లా 900లక్షల హెక్టార్లలో పంటల సాగు జరగాల్సి ఉండగా ఇప్పటివరకూ 869 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. ఇది సాధారణ సగటు కంటే 31.35%, 2018 సరాసరి కంటే 49.16% తక్కువని కేంద్ర వ్యవసాయశాఖ గణాంకాలు వెల్లడించాయి. ముఖ్యంగా వరిసాగు ఈ ఏడాది 40.40% తగ్గిపోయింది. తృణధాన్యాలు, నూనెగింజల సాగు విస్తీర్ణమూ పడిపోయింది. పత్తి మాత్రం సాధారణ సగటు కంటే 7.87% పెరిగింది. పప్పుదినుసుల సాగు 4.23%, చెరకు సాగు 4.56% మేర విస్తరించింది. వరి విస్తీర్ణం హరియాణా, నాగాల్యాండ్, రాజస్థాన్, తెలంగాణ మినహా దేశంలో మరెక్కడా పెరగలేదు. సాధారణ సగటు కంటే ఏపీలో అన్ని పంటల సాగు విస్తీర్ణం తగ్గగా, తెలంగాణలో వరి, పత్తి మినహా మిగిలినవి అదే పరిస్థితుల్లో ఉన్నాయి.

తెలంగాణలో పంటల సాగు పరిస్థితి (ల.హెక్టార్లలో)

	సగటు	ఈ ఏడాది	తేడా%
వరి	4.08	4.39	7.59
పప్పుదినుసులు	4.145	3.455	-16.64
తృణధాన్యాలు	4.88	3.72	-23.77
నూనెగింజలు	2.779	2.031	-26.91
చెరకు	0.34	0.33	-2.94
పత్తి	15.489	17.240	11.00

ఆవుల మృతిపై సిట్

ఆరుగురితో దర్యాప్తు బృందం ఏర్పాటు

ఈనాడు, విజయవాడ: విజయవాడ శివారు కొత్తూరు తాడేపల్లిలోని గోశాలలో ఆవుల మృతిపై దర్యాప్తునకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటుచేసింది. బృందానికి సీసీఎస్ ఏసీపీ శ్రీనివాసరావు నేతృత్వం వహిస్తారు. ఇందులో సభ్యులుగా సీసీఎస్ సీఐ చలపతిరావు, రెండో పట్టణ సీఐ ఉమర్, ఎస్సై శేఖర్‌బాబు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై అర్జున్, సైబర్‌క్రైం ఎస్సై దీపిక వ్యవహరిస్తారు. వారు గోవుల మృతికి సంబంధించి అన్ని అంశాలను పరిశీలిస్తారు. రోజువారీ నివేదికను నేరుగా నగర సంయుక్త పోలీసు కమిషనర్ నాగేంద్రకుమార్‌కు అందజేస్తారు.

నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యేపై కేసు

నెల్లూరు, న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఆదివారం రాత్రి అనుచరులతో కలిసి శ్రీధర్‌రెడ్డి తన ఇంట్లో చొరబడి, దాడి చేశారని 'జమీన్ రైతు' పత్రిక సంపాదకుడు డోలేంద్ర ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీధర్ రెడ్డి, ఆయన పీఏ విష్ణు, మరో నలుగురిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి పోలీసులు విచారిస్తున్నారు. నగర డీఎస్పీ జె.శ్రీనివాసులు రెడ్డి కేసును పర్యవేక్షిస్తున్నారు.

ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం

- వికారాబాద్ జిల్లాలో ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు

పెద్దేముల్, న్యూస్‌టుడే: చిన్నారులపై అత్యాచారాల పరంపర కొనసాగుతూనే ఉంది. నిందితులకు కోర్టులు కఠినశిక్షలు విధిస్తున్నా ఆ అకృత్యాలకు అడ్డుకట్ట పడటంలేదు. తాజాగా అభం శుభం తెలియని ఐదేళ్ల చిన్నారి అత్యాచారానికి గురైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ దారుణం శుక్రవారం చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగుచూసింది. దీనికి సంబంధించి పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలిక వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సెలవు రోజు కావడంతో ఇంట్లోనే ఉండి ఆడుకొంటోంది. మధ్యాహ్నం సమయంలో పొరుగింట్లో ఉండే మారేపల్లి నగేశ్(20).. చిన్నారికి చాక్లెట్ ఆశ చూపి తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. శరీరంపై పలు చోట్ల గాయపరిచాడు. ఏడిస్తే చంపేస్తానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. కూలి పనులకు వెళ్లిన పాప తల్లిదండ్రులు రాత్రి ఇంటికి వచ్చేసరికి చిన్నారి పడుకుని ఉండడంతో జ్వరంతో బాధపడుతుందని గ్రహించి మందులు వేశారు. జ్వరం తగ్గకపోవడంతో శనివారం సైతం మందులు వేసి యథావిధిగా కూలి పనులకు వెళ్లారు. రెండో రోజు సాయంత్రానికీ చిన్నారి పరిస్థితి అలాగే ఉండటంతో తల్లి దగ్గరకు తీసుకోగా జరిగిన విషయాన్ని వివరించింది. తల్లిదండ్రులు నేరుగా నిందితుడి ఇంటికెళ్లి ప్రశ్నించగా.. అబ్బాయి తల్లిదండ్రులు తమ పిల్లవాడు మంచి వాడంటూ వారితో గొడవకు దిగారు. అప్పటికే నగేశ్ ఊరు విడిచి పారిపోవడంతో గ్రామస్థులు అనుమానంతో గాలించారు. చివరకు బంధువుల ఇంట్లో ఉన్నట్టు గుర్తించి గ్రామానికి రప్పించారు. తొలుత బుకాయించినా దేహశుద్ధి చేయడంతో ఆ తరువాత నిజం ఒప్పుకొన్నాడు. ఆదివారం అర్ధరాత్రి చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాండూరు డీఎస్పీ రామచంద్రుడు, ఇన్‌చార్జి సీఐ రవికుమార్ విచారించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిర్భయ చట్టం కింద పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

తిరుపతి ఐఐటీ విద్యార్థికి రూ.22 లక్షల వేతనం

ఈనాడు, అమరావతి: తిరుపతిలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (ఐఐటీ) మొదటి బ్యాచ్ విద్యార్థి సాకేత్ రూ.22 లక్షల వార్షిక ప్యాకేజీతో ప్రాంగణ నియామకం పొందాడు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన సాకేత్ కంప్యూటర్ సైన్సు విభాగంలో బీటెక్ పూర్తి చేశాడు. 103 మంది బీటెక్, ఒకరు ఎంఎస్ పూర్తి చేయగా.. వీరిలో 75 మంది ప్రాంగణ నియామకాలు పొందారు. సరాసరిన వీరికి ఏడాదికి రూ.9 లక్షల వేతనం లభించింది. మొదటి స్నాతకోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. విద్యార్థులకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశాంక్ పట్టాలు ప్రదానం చేయనున్నారు. 2021 నాటికి క్యాంపస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని సంచాలకుడు సత్యనారాయణ తెలిపారు. ప్రాంగణంలో భవనాలన్నింటినీ 'గ్లాస్ ఫైబర్ రీఎన్‌ఫోర్స్డ్ జిప్సమ్' (జీఎఫ్ఆర్‌జీ) ప్యానళ్లతో, ఫ్లోరింగును పాలిష్డ్ కాంక్రీట్ విధానంతో నిర్మించారు. నీటి పునఃవినియోగానికి ప్రత్యేకంగా శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

రాజధానిపై డెంగీ పంజా!

- జ్వరాల తీవ్రతతో నగరంలో ఓ వసతి గృహం ఖాళీ

ఈనాడు - హైదరాబాద్

- నాగోలులోని ఓ కార్పొరేట్ కళాశాల వసతి గృహంలో 80 మంది ఇంటర్ విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇటీవల వీరిలో పలువురికి జ్వరాలు సోకాయి. యాజమాన్యం వారిని ఇళ్లకు పంపించింది. తర్వాత మరికొందరు జ్వరం బారిన పడ్డారు. ఇళ్లకు వెళ్లిన విద్యార్థుల్లో కొందరికి డెంగీ ఉన్నట్లు నిర్ధరణ కావడంతో.. కళాశాల యాజమాన్యం వారం రోజులు సెలవులు ప్రకటించి అందరినీ ఇళ్లకు పంపింది.
- సికింద్రాబాద్‌లోని ఓ ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో ప్రస్తుతం 25 మంది, సమీపంలోని మరో కార్పొరేట్ ఆసుపత్రిలోని మూడు బ్రాంచిల్లో కలిపి 30 మంది, బంజారాహిల్స్‌లోని ఓ ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో 35 మంది డెంగీ జ్వరానికి చికిత్స పొందుతున్నారు.
- గాంధీ ఆసుపత్రిలో గత 6 నెలల్లో 205 మంది డెంగీతో చేరారు. ఒక్క జులై నెలలో దాదాపు 400 మంది జ్వరాలతో రాగా.. అందులో 72 మందికి డెంగీ ఉన్నట్లు తేలింది. ఉస్మానియా ఆసుపత్రిలోనూ ఈ జ్వరంతో 40 మంది చికిత్స తీసుకున్నారు.

భాగ్యనగరంలో డెంగీ విజృంభిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. జ్వరంతో ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న వారిలో 80 శాతం మందిలో డెంగీ లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, అవయవ మార్పిడి చేయించుకున్న వారిలో తీవ్రత ఎక్కువ కనిపిస్తోంది. లక్షణాలు గుర్తించే లోపు చాలామందిలో ఇది తీవ్రంగా మారుతోంది. ప్లేట్‌లెట్లు పడిపోయి కొందరిలో డెంగీ షాక్ సిండ్రోమ్ (డీఎస్ఎస్)కు దారి తీస్తోంది. కొందరిలో ప్రాణాపాయం వరకు వెళుతుంది. ఇటీవల నగరంలో డెంగీతో మృతి చెందుతున్న కేసులూ నమోదవుతున్నాయి.



ప్రధాన లక్షణాలు

- ఆకస్మిక, తీవ్రమైన జ్వరం
- కళ్ల వెనుక నొప్పి
- తీవ్రమైన కండరాల నొప్పి
- అలసట, నీరసం
- వికారం, వాంతులు
- శరీరంపై ఎర్రటి పొక్కులు
- ముక్కు, చిగుళ్ల ద్వారా రక్తస్రావం
- చిరాకు, నిస్సత్తువ

జాగ్రత్తలు అవసరం

- ఇంట్లో, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి
- తాగునీటి పాత్రలు, డ్రమ్ములపై మూతలు ఉంచాలి
- వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలి.. నీటి పాత్రల్లో నీళ్లు తీసి ఆరబెట్టాలి
- పూలకుండీల్లో నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలి
- కాళ్లు, చేతులు కప్పుకునేలా వస్త్రాలు ధరించాలి. దోమ తెరలు, దోమలను తరిమేసే మందులు వాడాలి
- ఇంటి చుట్టూ కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ప్లాస్టిక్ కప్పులు లాంటివి లేకుండా చూసుకోవాలి

జ్వరం తగ్గుముఖం పట్టేటప్పుడే కీలకం

ప్రస్తుతం నగరవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. లక్షణాలు గుర్తించి చికిత్స తీసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ముఖ్యంగా జ్వరం తగ్గుతున్న సమయమే కీలకం. జ్వరం తగ్గిందని చాలామంది నిర్లక్ష్యంగా ఉంటారు. ఇది ప్రమాదం. ఈ సమయంలో రోగులు డెంగీ షాక్ సిండ్రోమ్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. రక్తంలో ప్లేట్‌లెట్స్‌తో పాటు రక్తపోటు పడిపోవడం, రక్తస్రావం జరిగే అవకాశాలు ఉన్నాయి. కాలేయంపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ సమయంలో వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ చికిత్స అందిస్తారు. డెంగీ తీవ్రత ఒక్కో వ్యక్తిలో ఒక్కోలా ఉంటుంది. కొందరిలో 5 రోజులకే నయం అవుతుంది. మరికొందరిలో మూడు వారాల సమయం పట్టవచ్చు. జ్వరం తగ్గడానికి ఇచ్చే మందుల తోపాటు ప్లేట్‌లెట్లు తగ్గుతున్నప్పుడు బయటి నుంచి ఎక్కించడం.. ఫ్లూయిడ్స్ అందిస్తూ నిరంతరం పర్యవేక్షించాలి. ప్లేట్‌లెట్లు 60-70 వేలకు తగ్గగానే ఆందోళన పడాల్సిన అవసరం లేదు. 20 వేల కంటే తగ్గితేనే బయటి నుంచి అందించాలి. దోమల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ శివరాజ్, కన్సల్టెంట్ ఫిజీషియన్

దుకాణం మీదికి దూసుకెళ్లి నిలిచిపోయిన కారు

దుకాణంపైకి దూసుకెళ్లిన కారు

- 50 నిమిషాలపాటు వాహనంలోనే నలుగురు..
- సైక్లిస్టుసహా ఐదుగురికి గాయాలు

గన్నేరువరం, న్యూస్‌టుడే: వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న కిరాణా దుకాణంపైకి దూసుకువెళ్లి నిలిచిపోయింది. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి కూడలి వద్ద సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. నర్సింగ్‌ఘోష్ భూషణ్‌కుమార్ కుటుంబసభ్యులతో కారులో హైదరాబాద్ నుంచి స్వస్థలం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి వెళుతున్నారు. సోమవారం ఉదయం 7:30 గంటల సమయంలో వీరి వాహనం రాజీవ్ రహదారిపై ఉన్న గుండ్లపల్లి కూడలి వద్దకు చేరుకుంది. అదే సమయంలో ఎదురుగా సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని తప్పించబోయి కారు అదుపుతప్పింది. రోడ్డుపక్కనే ఉన్న గద్దెను ఢీకొని ఆ పక్కనే ఉన్న కిరాణా దుకాణం పైకి దూసుకువెళ్లి నిలిచిపోయింది. సైకిల్‌పై వెళ్తున్న సుబుఖాన్‌తోపాటు కారులో ఉన్న భూషణ్, అతని భార్య స్వరూప, తండ్రి వెంకటాచారి, తల్లి సరోజనకు గాయాలయ్యాయి.

కారులోనే నిరీక్షణ

దుకాణం మీదకు దూసుకువెళ్లిన కారు పైకప్పుపై నిలిచిపోవడంతో అందులో చిక్కుకున్న వారు బయటకు వచ్చే అవకాశం లేకుండాపోయింది. స్థానికులు నిచ్చెనను ఉపయోగించి వారిని బయటకు తీయడానికి ప్రయత్నించినా కారు తలుపులు తెరచుకోలేదు. దీంతో వారు దాదాపు 50 నిమిషాలపాటు కారులోనే ఉన్నారు. పోలీసులు సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా నుంచి క్రేన్‌ను తీసుకువచ్చి కారును కిందికి దించారు. గాయపడ్డవారిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం ఎప్పుడూ జనంతో సందడిగా ఉంటుంది. సోమవారం సెలవు కావడం, ఉదయం సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కల్వకుంట్ల తెలంగాణగా మార్చేసిన కేసీఆర్

- కేటీఆర్‌ను సీఎం చేయాలని హరీశ్‌రావును పక్కన పెట్టారు
- భాజపా నేత జి.వివేక్ విమర్శ
- కాంగ్రెస్ పార్టీ తెరాసకు బినామీ: లక్ష్మణ్
- భాజపాలోకి కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: రాష్ట్ర సాధన ఉద్యమం సమయంలో ప్రజాస్వామిక తెలంగాణగా చేస్తానని ప్రకటించిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చాక 'కల్వకుంట్ల తెలంగాణ'గా మార్చేశారని మాజీ ఎంపీ జి.వివేక్ విమర్శించారు. రాష్ట్ర ఉద్యమకారులను విస్మరించిన సీఎం.. తన కుమారుడు కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేసేందుకు హరీశ్‌రావును పక్కన పెట్టారని ఆరోపించారు. నీటి పారుదల ప్రాజెక్టుల్లో కమీషన్లు తీసుకుని కమీషన్ల రాష్ట్రంగా మార్చారని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడంలో కేసీఆర్ ప్రధాన పాత్ర పోషించారని ఆరోపించారు. ఇటీవలే భాజపాలో చేరిన వివేక్ సోమవారం మొదటిసారి హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ తదితరులు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కి చెందిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ వారి సమక్షంలో భాజపాలో చేరారు. అనంతరం విలేకరుల సమావేశంలో జి.వివేక్ మాట్లాడారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటామని కేసీఆర్ ప్రకటించారని.. మరి కమీషన్ల కోసం రూ.30 వేల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు తీసుకెళ్లిన మీపై ఎలాంటి చర్యలు తీసుకోవాలని ప్రశ్నించారు.

హైదరాబాద్‌లో సోమవారం వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌ను భాజపాలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మణ్. చిత్రంలో దత్తాత్రేయ, వివేక్, పెద్దిరెడ్డి

తెరాస ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ షురూ..

తెరాస అవినీతి విధానాలు, నియంతృత్వ పోకడలతో ప్రజలు విసిగిపోయారని.. ఈ నేపథ్యంలోనే భాజపాలో చేరేందుకు ముందుకు వస్తున్నారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలో తెరాసకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరిపి తీరుతామని, సెప్టెంబరు 17న ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విచ్చేస్తున్నారని వెల్లడించారు. ఈ నెల 18న పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్రానికి రానున్నారని, ఈ సందర్భంగా తెదేపా నేతలు భారీ సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.కుమార్, మాజీ మంత్రి ఇ.పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, సోమారపు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

CPGET-2019
DIRECTORATE OF ADMISSIONS
OSMANIA UNIVERSITY, HYDERABAD-7.

ADMISSION NOTIFICATION
Certificate Verification & Exercising Options for Web Based Counselling

All the provisionally qualified candidates of CPGET-2019 are hereby informed that the payment for registration fee towards certificate verification and options exercise for admissions into various PG Courses offered by Osmania, Kakatiya, Telangana, Mahatma Gandhi, Satavahana, Palamuru and Jawaharlal Nehru Technological Universities will commence from **13.08.2019.** The certificate verification will commence from **16.08.2019.** For details of procedure to be followed, the subject wise schedule of certificate verification, verification centers and for detailed notification visit the websites, **www.ouadmissions.com; www.osmania.ac.in** or **http://tscpget.com**

13.08.2019
Hyderabad

Prof. N.KISHAN
Convener, CPGET-2019

కొత్త అధ్యాయం లిఖిస్తాం

- గోదావరి జలాలు తరలించి సీమను రతనాల సీమగా మారుస్తాం
- పరస్పర సమన్వయంతో రెండు రాష్ట్రాల అభివృద్ధి
- జగన్‌కు పెద్దన్నలా సహకరిస్తా
- ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు
- కాంచీపురంలో అత్తివరదర్ స్వామికి ప్రత్యేక పూజలు
- నగరిలో రోజా ఇంట ఆతిథ్యం

అత్తివరదర్ స్వామి దర్శనానికి వెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు, వారి కుమార్తె కవిత, ఎమ్మెల్యే రోజా ★ నగరిలో రోజా ఇంట్లో భోజనం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు, కుమార్తె కవిత

ఈనాడు, హైదరాబాద్, ఈనాడు డిజిటల్, చెన్నై – కాంచీపురం, నగరి, న్యూస్‌టుడే: తెలుగువారి చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా కొత్త అధ్యాయాన్ని లిఖించబోతున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. రెండు రాష్ట్రాల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, తాను సమన్వయంతో కలిసి పనిచేస్తామని చెప్పారు. రాయలసీమను రతనాలసీమగా మార్చేందుకు దేవుడిచ్చిన సర్వ శక్తులూ ఉపయోగిస్తామని.. జగన్‌కు పెద్దన్నలా సహకారం అందిస్తానని వెల్లడించారు. రాయలసీమ ఆర్థికంగా ఎదగడానికి, అభివృద్ధి చెందడానికి గోదావరి జలాలు రావాల్సిన అవసరముందని.. తప్పకుండా అది సాధ్యమవుతుందని కేసీఆర్ చెప్పారు. సోమవారం తమిళనాడులోని కాంచీపురంలో అత్తి వరదర్ స్వామిని దర్శించుకున్న అనంతరం తిరుగుప్రయాణంలో ఆయన చిత్తూరు జిల్లా నగరిలో వైకాపా ఎమ్మెల్యే, ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్ రోజా ఇంట్లో ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ''ఆంధ్రప్రదేశ్‌కు మంచి పట్టుదల ఉన్న యువ నాయకుడు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన సారథ్యంలో ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. రెండు రాష్ట్రాల అభివృద్ధికి పరస్పర సహకారంతో మేం కృషి చేస్తున్నాం. ఇది కొందరికి అర్థం కాకపోవచ్చు. మరికొందరికి జీర్ణం కాకపోవచ్చు. దానికి మేం చేయగలిగిందేమీ లేదు. ప్రజల మద్దతు ఉన్నంతకాలం తప్పకుండా రెండు రాష్ట్రాల ప్రజల కోరికలు నెరవేరుస్తాం. ఏపీకి వందశాతం నా ఆశీస్సులు, సంపూర్ణ సహకారం ఉంటాయి. నీళ్ల విషయంలో ఇప్పటికే నేను, జగన్ చర్చలు జరిపాం. ఇప్పుడు ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. ఆ నీరు ప్రజలకు ఉపయోగపడాలనే నిర్ణయానికి వచ్చాం. గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయి. వాటిని కృష్ణానదిలో కలపాలనే విషయమై మాట్లాడుకున్నాం. రాయలసీమ ప్రజల ఇబ్బందులు నాకు తెలుసు. వారి కష్టాలు తెలిసిన నాయకుడు జగన్. సీమలో వర్షాలు లేక ప్రజలు చాలా ఇక్కట్లు పడుతున్నారు. గోదావరి జలాలను వాడుకుంటే బంగారు పంటలు పండుతాయి. ప్రజల కష్టాలు తీరుతాయి. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలవకుండా వెయ్యి టీఎంసీలను రాయలసీమకు మళ్లించాలన్నదే మా ఆశయం'' అని సీఎం వెల్లడించారు. ఒక రోజు పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం కేసీఆర్ తమ సతీమణి శోభ, కుమార్తె, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితతో కలిసి ప్రత్యేక విమానంలో రేణిగుంట వెళ్లారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కాంచీపురం వెళ్లారు. సీఎం వెంట ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, తెరాస ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

అత్తివరదర్ సేవలో కేసీఆర్ దంపతులు

కాంచీపురం అత్తివరదర్ స్వామి సేవలో ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు, వారి కుమార్తె కవిత పాల్గొన్నారు. వారితోపాటు ఆంధ్రప్రదేశ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నగరి ఎమ్మెల్యే రోజా, తమిళనాడు మంత్రి కె.సెంగొట్టయ్యన్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం మధ్యాహ్నం కాంచీపురానికి చేరుకున్న కేసీఆర్‌కు జిల్లా కలెక్టర్ పి.పొన్నయ్య స్వాగతం పలికారు. ఆలయంలో సీఎం కేసీఆర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి వేదాశీర్వచనం అందించారు. కాంచీపురం వరదరాజస్వామి ఆలయంలో 40 సంవత్సరాలకు ఒకసారి 48 రోజుల పాటు నిర్వహించే అత్తివరదర్ ఉత్సవాలు ఈ ఏడాది జులై ఒకటో తేదీ నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 17వ తేదీతో ముగియనున్నాయి.

తిరుమల యాత్ర రద్దు

సీఎం కేసీఆర్ సోమవారం సాయంత్రం తిరుమలకు వస్తారని తితిదే అధికారులకు ఒకరోజు ముందు అధికారిక సమాచారం అందింది. ఈ మేరకు తిరుమలలో ఏర్పాట్లు చేశారు. అయితే, ఆఖరి క్షణంలో తిరుమలకు రాకుండానే నగరి నుంచి నేరుగా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేసీఆర్.. ప్రత్యేక విమానంలో హైదరాబాద్ పయనమయ్యారు. ఏపీ మంత్రులు, నేతలు ఆయనకు వీడ్కోలు పలికారు. కాంచీపురం పర్యటన ఆలస్యం కావడంతో తిరుమల పర్యటనను సీఎం కేసీఆర్ రద్దు చేసుకున్నట్లు తెలిసింది.

అన్నదాతా సుఖీభవ.. రోజాకు కేసీఆర్ దీవెన

కాంచీపురం నుంచి తిరుగు ప్రయాణంలో సీఎం కేసీఆర్ నగరిలోని ఎమ్మెల్యే రోజా ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా సెల్వమణి, రోజా దంపతులు.. కేసీఆర్ దంపతులను శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. రోజా స్వయంగా కేసీఆర్ కుటుంబసభ్యులకు వడ్డించారు. సుమారు రెండు గంటలపాటు కేసీఆర్ అక్కడ ఉన్నారు. ఏపీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులతో కలిసి రాయలసీమ అభివృద్ధితోపాటు పలుఅంశాలపై చర్చించారు. తన కుమార్తె నగరి ఎమ్మెల్యే రోజా మంచి ఆతిథ్యమిచ్చారని.. అన్నదాతా సుఖీభవ! అంటూ కేసీఆర్ ఆమెను దీవించారు. ఏపీ మంత్రులు ఆత్మీయత చూపారన్నారు.

> తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మా ఇంటికి రావడం, నన్ను కుమార్తెగా భావించడం నా అదృష్టం
> - రోజా

విజ్ఞాన ఖని జైపాల్‌రెడ్డి

- ఉత్తమ పార్లమెంటేరియన్‌ను కోల్పోయాం
- మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్

ఈనాడు, దిల్లీ: కేంద్ర మాజీ మంత్రి, తన ప్రియ మిత్రుడు జైపాల్‌రెడ్డి విజ్ఞానఖని అని మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ వర్ణించారు. దిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో దివంగత జైపాల్‌రెడ్డి సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. సభలో మన్మోహన్‌సింగ్ మాట్లాడుతూ పదేళ్లు తన మంత్రివర్గంలో వివిధ శాఖల మంత్రిగా ఆయన పని చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న క్లిష్ట సమయంలో జైపాల్‌రెడ్డి వంటి నేత మన మధ్యలో లేకపోవడం తనకు బాధ కలిగిస్తోందన్నారు. ఆయన మృతితో భారత రాజకీయ రంగం ఓ ఉత్తమ పార్లమెంటేరియన్‌ను కోల్పోయిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. నాలుగు ప్రభుత్వాల్లో పలు కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించినా ఎటువంటి మచ్చ లేకుండా గడిపారని ప్రశంసించారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో ఆయనకు ఉన్న పట్టు. . ఆయా భాషల్లో సంభాషించే తీరు అందరినీ ఆకట్టుకునేదని చెప్పారు. నమ్మిన సిద్ధాంతంతో ఆయన ఏనాడూ రాజీపడలేదని.. నెహ్రూవాదినని గర్వంగా చెప్పుకునేవారన్నారు. ప్రజా నాయకుడిగా ఎదిగిన జైపాల్‌రెడ్డి వక్తగా, రచయితగా రాణించారని తెలిపారు. ఆయన రాసిన 'టెన్ ఐడియాలజీ' పుస్తకాన్ని ఆవిష్కరించడం తనకు గర్వకారణమన్నారు.

నేడు సిరిసిల్లలో కేటీఆర్ పర్యటన

ఈనాడు, హైదరాబాద్: తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మంగళవారం సిరిసిల్ల ప్రాంతంలో పర్యటిస్తారు. ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో సాయంత్రం 4.30 గంటలకు కంటి ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు పయనమవుతారు.

వైద్యవిద్య ప్రవేశాల్లో గందరగోళం

కోర్టు తీర్పు అనంతరమే ముందుకు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీ ప్రక్రియలో గందరగోళం నెలకొంది. రెండోవిడత ప్రవేశాల్లో రిజర్వేషన్లను సక్రమంగా పాటించలేదని, తమకు అన్యాయం జరిగిందని బీసీ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో పాటు కొందరు ఇదే విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో మూడోవిడత ప్రవేశ ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. మంగళవారం ఇదే విషయంపై హైకోర్టులో వాదనలు జరగనున్నాయి. కోర్టు తుది తీర్పు ఇచ్చే వరకు ప్రవేశ ప్రక్రియ ముందుకు సాగదని తెలుస్తోంది. ఈనెలాఖరులోగా మూడోవిడత ప్రవేశాలతో పాటు చివరగా మాప్‌రౌండ్ ప్రవేశ ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. అనంతరం కూడా సీట్లు మిగిలితే ఆ సీట్లను ప్రైవేటు కళాశాలలకు అప్పగించాల్సి ఉంటుంది. ఈ నెల 31 తర్వాత జరిపే ప్రవేశాలకు ఆమోదం లభించదు. వచ్చే నెల 1 నుంచి వైద్యవిద్య తరగతులు ప్రారంభమవుతాయి. ఇప్పటికే ఈ నెల 1 నుంచి వైద్యవిద్యలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన 'ఫౌండేషన్ కోర్సు' తరగతులను నిర్వహిస్తున్నారు. కన్వీనర్ కోటా సీట్ల భర్తీతో పాటు యాజమాన్య, ప్రవాస భారతీయ కోటాల్లోనూ ప్రవేశాలను పూర్తిచేయాల్సి ఉంది. ఇవన్నీ పూర్తి కావాలంటే ప్రవేశ ప్రక్రియపై కోర్టు నుంచి అనుమతులు రావాల్సి ఉందని వైద్యవర్గాలు తెలిపాయి. ఒకవేళ రెండోవిడత ప్రవేశాల్లో రిజర్వేషన్ల అభ్యర్థులకు అన్యాయం జరిగిందని భావిస్తే.. ఆ సీట్లను తిరిగి ఎలా భర్తీ చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే ఇప్పటికే ఆ సీట్లలో కేటాయింపులు జరిపిన అభ్యర్థులు వేర్వేరు వైద్యకళాశాలల్లో చేరిపోయారు. ఇప్పుడు రెండోవిడత ప్రవేశాలను రద్దు చేస్తే.. ఇప్పటికే కళాశాలల్లో చేరిన విద్యార్థుల పరిస్థితి ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ గందరగోళం నడుమ న్యాయస్థానమిచ్చే తీర్పు కీలకం కానుందని వైద్యవర్గాలు తెలిపాయి.

ఇతరులను కాపాడి అనాథగా మిగిలాడు

పరమేశ్

ఇతరులకు సాయం చేసేందుకు నిండు మనసుతో ఊరు దాటి వెళ్లిన వ్యక్తి.. చివరకు అనాథగా మిగిలాడు. కర్ణాటకలోని కొడగు జిల్లాలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన కారణంగా విరాజపేట తాలుకాలోని టోరా గ్రామంలో పెద్ద కొండచరియ విరిగి ఇళ్లపై పడింది. ఊరు ఊరంతా మట్టి దిబ్బలా మారింది. ఇళ్లన్నీ కూలడంతో.. 12 మంది సజీవ సమాధి అయ్యారు. అదే గ్రామానికి చెందిన పరమేశ్.. ఆ ఘటన జరగడానికి కొద్ది గంటల ముందే కొండపై చిక్కుకున్న వారిని కాపాడేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి అతడి ఇల్లు ఆనవాలే లేకుండా పోయింది. దీంతో కన్నీరు మున్నీరుగా విలపించాడు. "నేను కొండపై ఉన్నవారిని కాపాడేందుకు వెళ్లాను. వెళ్లేటప్పుడు దారి బాగానే ఉంది. తిరిగి వచ్చేటప్పుడు రోడ్డు కనబడలేదు. మా ఇంటిపై కొండచరియ విరిగి పడింది. నా భార్య, కుమార్తె చనిపోయారు" అని చెప్పాడు. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.పది లక్షల పరిహారం ప్రకటించింది. ప్రస్తుతం ఇళ్లు కూలిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న వారందరికీ హగ్గలలోని ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం కల్పించింది. పరమేశ్ సహా దాదాపు 167 మంది గ్రామస్థులు ఆ పాఠశాలలోనే ఆశ్రయం పొందుతున్నారు.

ఈ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

తాకట్టుగా ధ్రువపత్రాలు?

- బోధన రుసుములు చెల్లించని ప్రభుత్వం.. సర్టిఫికెట్లు ఇవ్వని యాజమాన్యాలు
- పై చదువులకు కౌన్సెలింగ్‌లో ఇబ్బందులు
- 'ట్రాన్స్‌స్క్రిప్టు'లు తెచ్చుకున్నా అనుమతి
- వెసులుబాటు కల్పించిన అధికారులు

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం బోధన రుసుముల బకాయిలు ఉండటంతో విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇచ్చేందుకు యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. సర్టిఫికెట్లు లేక విద్యార్థులు ఉన్నత చదువులకు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు సంబంధించి 2018-19లో బోధన రుసుముల కింద ప్రభుత్వం రూ.800 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. అందులో 60 శాతం మాత్రమే చెల్లించిందని, రూ.320 కోట్ల మేర బకాయి ఉందని సమాచారం.

రాష్ట్రవ్యాప్తంగా ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు పీజీఈసెట్ కౌన్సెలింగ్ ఈ నెల 7 నుంచి జరుగుతోంది. కౌన్సెలింగ్‌కు బీటెక్/బీఫార్మసీ ఉత్తీర్ణత ధ్రువపత్రం, మార్కుల మెమోలు అవసరం. ఐసెట్‌కు డిగ్రీ ఉత్తీర్ణత ధ్రువపత్రాలు కావాలి. కొందరు బీటెక్ పూర్తయిన తర్వాత ఐసెట్ ద్వారా ఎంబీఏలో చేరుతున్నారు.

ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంక్ వచ్చింది.. మంచి కళాశాలలో సీటు వస్తుందన్న ఆనందం కంటే ధ్రువపత్రాలు ఎలా? అనేదే విద్యార్థులను కలవరపెడుతోంది. కళాశాలలు మాత్రం బోధన రుసుముల బకాయిలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు చెల్లించినా.. బకాయిలు లేవని నో డ్యూ సర్టిఫికెట్ ఇస్తామని.. దాంతో వర్సిటీ నుంచి ధ్రువపత్రాలు తీసుకోవచ్చని చెబుతున్నాయి. కౌన్సెలింగ్ సహాయ కేంద్రాలకు వెళితే మీరు ఉత్తీర్ణులయ్యారా? లేదా? అనేది ధ్రువపత్రాలు లేకుండా ఎలా తెలుస్తుందని ప్రశ్నిస్తున్నారు. దాంతో కొందరు బకాయిలు చెల్లించి బయట పడుతున్నారు. కొందరు మొదటి కౌన్సెలింగ్ మానుకొంటున్నారు. రెండో కౌన్సెలింగ్ నాటికి సర్కారు బకాయిలు చెల్లిస్తుందేమోనని ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసిన ఓ విద్యార్థిని ఐసెట్ రాసి ఎంబీఏలో చేరాలని నిర్ణయించుకుంది. బీటెక్ సర్టిఫికెట్ లేకపోవడంతో మొదటి కౌన్సెలింగ్‌ను మానుకుంది. 'విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇంటర్ సర్టిఫికెట్ ఉంచుకొని.. బీటెక్‌వి ఇస్తున్నాం' అని ఓ కళాశాల ప్రిన్సిపాల్ చెప్పారు.

కౌన్సెలింగ్ గడువు ఒక రోజు పెంపు

వందలాది మంది విద్యార్థులు ధ్రువపత్రాల సమస్యను అధికారుల దృష్టికి తెస్తుండడంతో.. "బీటెక్ చివరి సంవత్సరం మొదటి సెమిస్టర్ వరకూ ధ్రువపత్రాలు మీ వద్ద ఉంటాయి. వాటితో పాటు చివరి సెమిస్టర్ ధ్రువపత్రానికి సంబంధించిన ట్రాన్స్‌స్క్రిప్టు తీసుకొచ్చినా కౌన్సెలింగ్‌కు అనుమతి ఇస్తాం" అని పీజీఈసెట్ అధికారులు చెబుతున్నారు. దీంతో విద్యార్థులు జేఎన్‌టీయూహెచ్‌కు ట్రాన్స్‌స్క్రిప్టుల కోసం దరఖాస్తు చేస్తున్నారు. అవి ఇవ్వడానికి 2 రోజుల సమయం పట్టే అవకాశం ఉండటంతో కౌన్సెలింగ్ గడువును ఒక రోజు (14 వరకు) పొడిగించారు. సిరిసిల్లకు చెందిన బీటెక్ విద్యార్థిని ఈ సమస్యపై ప్రవేశాల కన్వీనర్ రమేష్‌బాబుకి ఫోన్ చేసి కన్నీటిపర్యంతం కాగా. . ట్రాన్స్‌స్క్రిప్టు సర్టిఫికెట్ తెచ్చుకోవాలని సూచించారు.

ప్రాజెక్టు నిర్మించడం సులువనుకుంటున్నారా

చంద్రబాబు విమర్శ

ఈనాడు డిజిటల్, అమరావతి: పోలవరం లాంటి ప్రాజెక్టు నిర్మించడమంటే కాంట్రాక్టర్లను బెదిరించడం, బెట్టింగులు నిర్వహించినంత సులువు కాదని తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు ఎద్దేవా చేశారు. కాఫర్ డ్యాం నిర్మించడం వల్లే గ్రామాలు మునిగిపోయాయంటూ వైకాపా నేతలు సరికొత్త పాఠాలు చెబుతున్నారని సోమవారం ట్విటర్‌లో మండిపడ్డారు. 'ప్రాజెక్టు నిర్మాణంలోని ప్రతి విషయంలోనూ సాంకేతిక కమిటీలు ఉంటాయి. కేంద్రం పర్యవేక్షణ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సీడబ్ల్యూసీ నిబంధనల ప్రకారమే నిర్మాణాలు జరుగుతాయి. ఈ విషయాలన్నీ మాపై ఆరోపణలు చేస్తున్న మేధావులు తెలుసుకోవాలి. గోదావరికి వరద వస్తుందని ముంపు గ్రామాలను ఖాళీ చేయించాలని రెండు నెలల ముందే పోలీసు, రెవెన్యూ అధికారులు చెప్పినా పట్టించుకోలేదు. ఆరోపణలు మాని ఎలా పాలించాలో నేర్చుకోండి" అన్నారు. "గత ఐదేళ్లలో 21 ప్రాజెక్టులు నిర్మించాం. వేలాది చెక్‌డ్యాంలు, 10 లక్షల కుంటలు తవ్వాం. కృష్ణమ్మ పరవళ్లు, తల్లి గోదావరి జలధారలతోనే మనం చేసిన పనులకు సార్థకత" అని చంద్రబాబు పేర్కొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో ఐక్యత చూపుతున్న చెరుకు సుధాకర్, చీమ శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, కోదండరాం, వీవీ లక్ష్మీనారాయణ, హరగోపాల్, ఆర్.కృష్ణయ్య తదితరులు

జాతీయ వైద్య కమిషన్ చట్టం ఏకపక్షం

- రాజకీయ పార్టీలు, ప్రజా, వైద్య, విద్యార్థి సంఘాల ధ్వజం
- తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) చట్టంతో వైద్య విద్యార్థులతోపాటు సామాన్య ప్రజానీకానికీ తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, వైద్య సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ చట్టం రాష్ట్రాల హక్కులకు పెద్ద దెబ్బని.. ఈ అంశంపై కేంద్రం పునరాలోచించాలని డిమాండ్ చేశాయి. తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో 'ఎన్ఎంసీ చట్టం- వైద్య రంగంలో మార్పులు- వైద్య విద్య ప్రైవేటీకరణ' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. డాక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెజస అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ.. ఎన్ఎంసీ చట్టంతో రాష్ట్ర ప్రభుత్వాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందన్నారు. ఈ చట్టం ప్రకారం 50 శాతం సీట్లను ప్రైవేటు మెడికల్ కళాశాలలకు ధారదత్తం చేయడంతో పేద వర్గాలు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదముందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఐఏఎస్ అధికారి, జనసేన నేత వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తాను వైద్య విద్యార్థి తండ్రిగా సమావేశానికి వచ్చానని చెబుతూ.. ఈ చట్టం ద్వారా మెరుగైన నిబంధనలను రూపొందించుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. కొన్ని విధివిధానాలు రూపొందించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. విద్యా పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ చట్టంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో స్వతంత్ర కమిషన్ వేయాలని కోరారు. తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు డా.చెరుకు సుధాకర్, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, తెలంగాణ మెడికల్ ప్రొఫెసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాబురావు, తెలంగాణ ఐకాస రాష్ట్ర ఛైర్మన్ ప్రొ.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసేందుకే: ఎమ్మెల్సీ రామచందర్‌రావు

ప్రజలకు మేలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంసీ చట్టం తీసుకొచ్చిందని, దీంతో ఎంబీబీఎస్ వైద్య విద్యను తక్కువ ఖర్చుతో పూర్తి చేయవచ్చని సమావేశంలో పాల్గొన్న భాజపా ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు వివరించారు.

మోపిదేవి, ఇక్బాల్, చల్లా.. వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

ఈనాడు, అమరావతి: ఏపీలో ఎన్నికలు జరగనున్న 3 ఎమ్మెల్సీ స్థానాలకు వైకాపా అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. మంత్రిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ, హిందూపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఇక్బాల్, కర్నూలు జిల్లాకు చెందిన చల్లా రామకృష్ణారెడ్డిలకు అవకాశం దక్కింది. ఈ ముగ్గురు విజయం సాధించడం దాదాపు ఖాయం.

నఖ శిఖం ఆక్రమణం!

- చెరువుల శిఖం భూముల్లో కబ్జాలు, భవనాల నిర్మాణం
- పట్టణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న నీటి వనరులు
- ప్రమాదంలో భూగర్భ జలమట్టం

ఈనాడు – హైదరాబాద్

నీటి వనరులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. స్థిరాస్తి వ్యాపారం.. భవన నిర్మాణాలతో చెరువులు, కుంటలను చెరపడుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా చాలా పట్టణాల్లో ఇప్పటికే జల వనరుల ఉనికి తగ్గిపోతోంది. చెరువులు, కుంటల్లోకి నీళ్లు వచ్చే పాటు కాలువలను మొదట ఆక్రమించుకుని అనంతరం చెరువులను కబ్జాచేస్తున్న పరిస్థితులు అన్నిచోట్లా ఉన్నాయి. వాల్టా చట్టం కింద నీటి వనరులను సంరక్షించేందుకు ప్రభుత్వ విభాగాలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినా.. క్షేత్రస్థాయిలో వాటి అమలు మాత్రం కనిపించడం లేదు. రాష్ట్రంలో నీటి వనరుల ఉనికి తగ్గిపోతున్న పరిస్థితుల్లో భూగర్భ జల మట్టం ఏటికేడు పడిపోవడం ఆందోళనకర పరిణామం.

ఆక్రమణలు కొన్ని..

- హైదరాబాద్ నగర శివారులోని పటాన్‌చెరు ఆక్రమణలకు అడ్డాగా మారుతోంది. అమీన్‌పూర్ మండలంలోనూ పలు చెరువులు కబ్జాకు గురయ్యాయి. అనేక నీటి వనరులు మాయమై వాటి పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయి.

స్థిరాస్తి వ్యాపార పడగ

నగరాలు, పట్టణ ప్రాంతాల్లో జనసాంద్రతతోపాటు ఆవాసాల సంఖ్య పెద్దఎత్తున పెరుగుతోంది. దీంతో ఖాళీగా ఉన్న భూములు కనుమరుగవుతున్నాయి. ప్రైవేటు భూముల ధరలు పెరగడం వల్ల ప్రభుత్వ భూముల్లో కబ్జాలు చోటుచేసుకుంటున్నాయి. స్థిరాస్తి వ్యాపారులు రాత్రికి రాత్రి ఈ భూముల్లో పాగా వేస్తున్నారు. చెరువుల శిఖం, కట్ట ప్రాంతాలను చదును చేసి విక్రయిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలనలోకి తీసుకోకుండానే రెవెన్యూ శాఖ పట్టాలు జారీ చేస్తున్న పరిస్థితులు అనేకం ఉన్నాయి. ఆ తరువాత ఆక్రమణల తొలగింపు న్యాయ వివాదాలకు కారణమవుతోంది. చెరువుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకాన్ని చేపట్టింది. ఇదే తరహాలో వాటి పరిరక్షణకు కూడా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ చిత్రంలో కనిపించే ఇళ్లు పూర్తిగా చెరువు కట్టలోపలి భాగంలో ఉన్నాయి. శిఖంలోనూ నిర్మాణాలు వెలిశాయి. సంగారెడ్డి పట్టణంలో ఉన్న ఎర్రకుంట దుస్థితి ఇది. 47 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు ఆసాంతం ఆక్రమణల పాలవుతోంది. పూర్తి నీటి మట్టం స్థాయిని దాటి కబ్జాదారులు చొచ్చుకొచ్చినా.. నియంత్రించే వారు కరవయ్యారు. చెరువులో నీటి నిల్వ లేకపోవడంతో ప్రస్తుతం పట్టణంలో భూగర్భ జలమట్టం భారీగా పడిపోయింది. పలుచోట్ల వెయ్యి అడుగుల లోతు బోరు వేసినా నీళ్లు పడటం లేదు.

- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని చెరువుల్లోని దాదాపు 2,200 ఎకరాల్లో ఆక్రమణలు వెలిశాయి. వాటి శిఖం ధ్వంసమైపోతోంది.
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, కల్వకుర్తి తదితర చోట్ల చెరువుల్లో నిర్మాణాలతోపాటు కొన్ని చోట్ల భూములకు పట్టాలు పొంది కబ్జాలను శాశ్వతం చేసుకున్నారు.
- మెదక్ జిల్లా నర్సాపూర్, సంగారెడ్డి జిల్లాలో పలు చోట్ల చెరువు శిఖం భూముల్లో స్థిరాస్తి వెంచర్లు వెలిశాయి.

భవిష్యత్తుకు పొంచి ఉన్న ముప్పు

- రాష్ట్రంలో ఏటా సగటున 1.5 మీటర్ల లోతుకు భూగర్భ జల మట్టం పడిపోతోంది.
- నీటిని నిల్వ చేసి నేలలోకి ఇంకించే కుంటలు, చెరువుల సంఖ్య తగ్గిపోవడంతో భూగర్భం పొరలు ఎండిపోతున్నాయి.
- రాష్ట్రంలో 18 శాతం భూభాగంలో 20 మీటర్ల లోతుకుపైనే మట్టం పడిపోయినట్లు భూగర్భ జలవనరుల శాఖ న

'సంతాన' భద్రాసనం!

సంతాన అవయవాల సమస్యలతో బాధపడుతున్నారా? అయితే భద్రాసనాన్ని సాధన చేయండి. ఇది మూత్ర, సంతాన అవయవాలకు ఆక్సిజన్‌తో నిండిన రక్తం బాగా సరఫరా అయ్యేలా చేస్తుంది. ఆ భాగంలోని కండరాలను, కండర బంధనాలను వదులుగానూ చేస్తుంది.

ఎలా చెయ్యాలి?

- చాప మీద కూర్చొని, కాళ్లు తిన్నగా చాచాలి.
- రెండు పాదాల మడమలను తాకించి.. వాటిని నెమ్మదిగా గజ్జల దగ్గరికి తీసుకురావాలి.
- అర చేతులను మోకాళ్ల మీద పెట్టి కిందికి నెట్టాలి. మోకాళ్లు నేలకు తాకేలా చూసుకోవాలి.
- కళ్లు మూసుకొని నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి.
- కొద్దిసేపయ్యాక కాళ్లను తిన్నగా చాచి, విశ్రాంతి తీసుకోవాలి.
- ఆసనం వేసేటప్పుడు మనసును మలద్వారం, జననాంగాల మధ్య (మూలాధారం) కేంద్రీకరించాలి.

ప్రయోజనాలేంటి?

- తొడలు, మోకాళ్లు, పిక్కలకు కొత్త శక్తి వస్తుంది.
- కటిభాగంలోని కండరాలు, కండర బంధనాలు వదులవుతాయి.
- మానసిక ప్రశాంతత, భద్రత చేకూరుతుంది.
- సయాటికా, సిరల ఉబ్బు, నెలసరి సమస్యల బాధలు తగ్గుతాయి.
- శరీర భంగిమ, ఏకాగ్రత మెరుగవుతాయి.

రత్నాలకు రాళ్ల బాధ!

ఇంటికి రత్నాలు పిల్లలే. అలాంటి రత్నాలకు ఇప్పుడు రాళ్ల బాధ మొదలవుతోంది! పెద్దల్లోనే ఎక్కువనుకునే కిడ్నీ రాళ్ల సమస్య ఇటీవల పిల్లల్లోనూ పెరిగిపోతోంది మరి. పుట్టుకతో వచ్చే లోపాలు, జన్యుపరమైన అంశాలకు తోడు మారిపోతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు,, అపరిశుభ్రత, విటమిన్ల లోపం వంటివెన్నో దీనికి ఆజ్యం పోస్తున్నాయి. పెద్దవారికైనా, పిల్లలకైనా కిడ్నీ రాళ్ల బాధ ఒకటే గానీ చిన్నారుల్లో దీన్ని గుర్తించటం కాస్త కష్టం. నొప్పి ఎక్కడ్నుంచి వస్తోందో, ఎటు నుంచి ఎటు వెళ్తోందో పిల్లలు సరిగా చెప్పలేరు. కొందరిలో అపెండిక్స్ వాపు వంటి ఇతరత్రా సమస్యల మాదిరిగానూ కనబడొచ్చు. నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలో వాపు, ఇన్‌ఫెక్షన్లు, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్ర దుష్పరిణామాలకూ దారితీయొచ్చు. కాబట్టి 'చిన్న' సమస్యేనని కొట్టిపారేయటం తగదు.

కిడ్నీలు మహా గట్టి పిండాలు. శరీరానికి పనికిరాని మలినాలను విసర్జించే అవయవాల్లో ఇవి చాలా కీలకమైనవి. నిరంతరం రక్తాన్ని శుద్ధి చేస్తూ.. జీవక్రియల అనంతరం మిగిలిపోయే యూరియా, యూరిక్ ఆమ్లం వంటి వాటిని వడగడుతూ.. పనికిరాని వాటిని మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోయేలా చేస్తాయి. కిడ్నీల్లో తయారయ్యే మూత్రం ముందుగా మూత్రనాళం గుండా మూత్రాశయానికి చేరుకొని.. అక్కడ్నుంచి మూత్ర మార్గం ద్వారా వెలుపలికి వచ్చేస్తుంది. ఈ క్రమంలో ఎక్కడ అడ్డంకి తలెత్తినా మూత్రకోశ వ్యవస్థ మొత్తం ప్రభావితమవుతుంది. కిడ్నీలో రాళ్లు ఇలాంటి సమస్యే. ఇవి కిడ్నీలో ఏర్పడి అక్కడే తిష్ఠ వేసుకోవచ్చు. లేదూ మూత్రనాళం, మూత్రాశయంలో చిక్కుకోవచ్చు. దీంతో మూత్రం సరిగా రాక.. నొప్పి, మంట వంటివి తీవ్రంగా వేధిస్తాయి. నిజానికి కిడ్నీ రాళ్లు పెద్దవారిలోనే ఎక్కువ. అలాగని పిల్లలకు రాకూడదనేమీ లేదు. ఇటీవల ఒకింత ఎక్కువగానూ కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లల్లో కిడ్నీ రాళ్లు, వాటితో కలిగే నష్టాలు, నివారణ మార్గాల గురించి తెలుసుకొని ఉండటం ఎంతైనా అవసరం.

డా॥ హనుమంతరాయుడు
పీడియాట్రిక్ సర్జన్
సూపరింటెండెంట్ (రిటైర్డ్)
జనరల్ హాస్పిటల్
కర్నూలు

ఎక్కడివీ రాళ్లు?

కిడ్నీలో రాళ్లు ఎక్కడో బయటి నుంచి వచ్చి చేరేవి కావు. లోపల తయారయ్యేవే. నీటిలో బాగా ఉప్పు వేసి మరిగించారనుకోండి. కొంతసేపటికి నీరంతా ఇగిరిపోయి.. గిన్నెలో ఉప్పు రాళ్లు ఏర్పడతాయి కదా. కిడ్నీ రాళ్లూ ఇలాగే తయారవుతాయని అనుకోవచ్చు. వీటికి మూలం- మూత్రంలో క్యాల్షియం, ఆక్సలేట్, యూరిక్ ఆమ్లం వంటి లవణాలు, ఖనిజాలు, రసాయనాల స్థాయులు పెరగటం. దీంతో మూత్రం చిక్కబడుతుంది. క్రమంగా దానిలోని లవణాలు, రసాయనాలన్నీ చిన్న చిన్న స్ఫటికాలుగా గూడుకట్టుకోవటం ఆరంభిస్తాయి. ఇవి మొదట్లో కిడ్నీలో మూత్రం నిల్వ ఉండే వ్యవస్థలో పోగుపడి.. లోపలి పైపొర మీద అంటుకుంటాయి. దాని మీద మరొక స్ఫటికం.. దానిపై మరోటి.. ఇలా చేరుకుంటూ వచ్చి, చివరికి రాళ్ల మాదిరిగా గట్టిపడిపోతాయి.





లక్షణాలు

- **నొప్పి, మంట:** మూత్రనాళం ఒంపుల్లో రాళ్లు చిక్కుపడితే తీవ్రమైన నొప్పి తలెత్తుతుంది. నొప్పి నడుం దగ్గర పక్కలవైపు మొదలై.. గజ్జల వరకూ పాకుతుంది. మూత్రం పోస్తున్నప్పుడు మంట పుట్టొచ్చు. చిక్కేంటంటే- నొప్పి పుడుతున్నా పిల్లలు ఎక్కడ్నుంచి వస్తుందో సరిగ్గా చెప్పలేకపోవటం. నొప్పి ఎక్కడ్నుంచి వస్తుందని అడిగితే కడుపు చూపిస్తారు. దీంతో ఒక్కోసారి అపెండిక్స్ వాపుగానూ పొరపడొచ్చు.
- **మూత్రం సరిగా రాకపోవటం:** ముఖ్యంగా మూత్రనాళంలో గానీ మూత్రమార్గంలో గానీ రాయి చిక్కుపడితే మూత్రం పోయటానికి ఇబ్బంది పడతారు. కొన్నిసార్లు మూత్రంలో రక్తం కనపడొచ్చు.
- **వాంతి, వికారం:** సమస్య తీవ్రంగా ఉంటే వాంతి, వికారం వేధిస్తుంటాయి.
- **తరచూ మూత్రం:** పిల్లలు తరచుగా మూత్రం పోస్తుంటారు. కొంతమంది మగపిల్లలు అదేపనిగా అంగాన్ని పట్టుకొని లాగుతుంటారు.
- **జ్వరం:** మూత్రం నిల్వ ఉండటం వల్ల ఇన్‌ఫెక్షన్ తీవ్రమైతే జ్వరం, చలి, బలహీనత ముంచుకురావొచ్చు. మూత్రం చెడువాసన కొట్టొచ్చు.

దుష్పరిణామాలతో జాగ్రత్త!

కిడ్నీ రాళ్లు ఇతరత్రా దుష్ప్రభావాలకూ దారితీస్తాయి.

- మూత్రనాళంలో అడ్డంకి మూలంగా మూత్రం వెనక్కి వెళ్లిపోయి కిడ్నీ వాపు (హైడ్రోనెఫ్రోసిస్) తలెత్తొచ్చు. చివరికిది కిడ్నీ దెబ్బతినటానికీ దారితీయొచ్చు.
- మూత్రాశయంలో మూత్రం ఎక్కువసేపు నిల్వ ఉంటే దీర్ఘకాల ఇన్‌ఫెక్షన్ (సిస్టైటిస్) రావొచ్చు.
- మూత్రనాళం సంకోచించటం వల్ల ఇతర అవయవాలకు దారులు (ఫిస్టులా) ఏర్పడొచ్చు.
- మూత్రాశయం ఉబ్బిపోయి తరచూ మూత్రం రావొచ్చు.

నివారణ ఉత్తమం

- నీళ్లు, ద్రవాలు ఎక్కువగా తీసుకునేలా చూడాలి. కూల్‌డ్రింకుల వంటి వాటికి దూరంగా ఉంచటం మంచిది.
- ఉప్పు, కొవ్వులు మితంగా తినేలా చూసుకోవాలి.
- రోజూ తప్పకుండా ఆరుబయట ఆటలు ఆడేలా ప్రోత్సహించాలి.
- రాళ్లు ఏర్పడే స్వభావం ఉన్న పిల్లలకు టమోటా, క్యాబేజీ, పాలకూర తక్కువగా ఇవ్వాలి.

ప్రధానంగా నాలుగు రకాలు

కిడ్నీ రాళ్లలో ప్రధానంగా నాలుగు రకాలు కనబడుతుంటాయి.

- **క్యాల్షియం రాళ్లు:** మూత్రంలో క్యాల్షియం, ఆక్సలేట్, యూరియా మోతాదులు అధికంగా.. సిట్రేట్ చాలా తక్కువగా ఉండడం వల్ల ఇవి ఏర్పడతాయి.

- **స్ట్రువైట్ రాళ్లు:** వీటికి మూలం దీర్ఘకాల మూత్ర ఇన్‌ఫెక్షన్లు. ఇన్‌ఫెక్షన్ కారక బ్యాక్టీరియా మూత్రంలో రసాయనాల స్థాయులను అస్తవ్యస్తం చేయటం వల్ల ఇవి పుట్టుకొస్తాయి.

- **యూరిక్ ఆమ్లం రాళ్లు:** మూత్రంలో ఆమ్ల గుణం పెరిగినప్పుడు యూరిక్ ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇది స్ఫటికాలుగా మారి రాళ్లు ఏర్పడతాయి.

- **సిస్టిన్ రాళ్లు:** జన్యుపరంగా కొందరికి రక్తంలోని సిస్టిన్ రసాయనం సరిగా బయటకు వెళ్లిపోదు. ఫలితంగా దీని మోతాదులు పెరిగి రాళ్లుగా మారుతుంటాయి.

కారణాలు ఎన్నెన్నో..

పుట్టుకతో వచ్చే మూత్రకోశ లోపాల దగ్గర్నుంచి విటమిన్ల లోపం, ఆహార అలవాట్ల వరకూ ఎన్నెన్నో కారణాలు కిడ్నీరాళ్లకు దారితీయొచ్చు.

- **జన్యుపరంగా:** కొందరికి జన్యుపరంగా మూత్రంలో సిస్టిన్ ఎక్కువగా పోవటం రాళ్లకు దారితీయొచ్చు.
- **మూత్రం ఆపుకోవటం:** టీవీ చూస్తూనో, ఆటల్లో మునిగిపోయో కొందరు చాలాసేపు మూత్రం ఆపుకొంటూ ఉంటారు. ఇలా మూత్రం నిల్వ ఉంటే ఇన్‌ఫెక్షన్లు రావొచ్చు. లవణాలు పెద్దమొత్తంలో పేరుకుపోవచ్చు. ఇవి రెండూ రాళ్లకు దారితీసేవే.
- **నీటిశాతం తగ్గటం:** పిల్లలు ఏదో వ్యాపకంలో మునిగిపోయి నీళ్లు తాగటం మరచిపోతుంటారు. కొందరికి చిన్నపేగుల్లో ఇన్‌ఫెక్షన్ల మూలంగానూ ద్రవాలు సరిగా గ్రహించక ఒంట్లో నీటిశాతం తగ్గొచ్చు. దీంతో మూత్రం గాఢంగా, చిక్కగా తయారై.. రాళ్లు ఏర్పడే ప్రమాదముంది.
- **ఉప్పు ఎక్కువగా తినటం:** ప్రస్తుతం జంక్‌ఫుడ్ తినటం ఎక్కువైంది. పేద కుటుంబాల్లో పచ్చళ్ల వంటివి తినటమూ ఎక్కువే. వీటిల్లో ఉప్పు (సోడియం) పెద్దమొత్తంలో ఉంటుంది. సోడియంతో మూత్రంలో క్యాల్షియం మోతాదులు పెరిగిపోయి రాళ్లకు దారితీయొచ్చు.
- **యూరిక్ ఆమ్లం పెరగటం:** జంతువుల ప్రోటీన్ మూలంగా యూరిక్ ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. మూత్రంలో దీని మోతాదులు పెరిగిపోయి రాళ్లు ఏర్పడొచ్చు. మూత్రంలో ఎక్కువ ఆమ్ల స్వభావం ఉన్నా ఇవి ఏర్పడొచ్చు.
- **మూత్రనాళం ఇరుకు:** కొందరికి పుట్టుకతో మూత్రనాళంలో కొన్నిచోట్ల సన్నగా, ఇరుకుగా ఉంటుంది. కొందరికి కిడ్నీ, మూత్ర నాళం కలుసుకునే చోట అడ్డంకి ఉండొచ్చు. దీంతో మూత్రం కిందికి సరిగా వెళ్లక, ఎక్కువసేపు నిల్వ ఉండటం వల్ల ఇన్‌ఫెక్షన్లు.. ఫలితంగా రాళ్లు ఏర్పడొచ్చు.
- **ఊబకాయం:** ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. దీంతో మూత్రంలో క్యాల్షియం మోతాదులూ ఎక్కువవుతాయి. ఇది రాళ్ల ముప్పు పెరిగేలా చేస్తుంది.
- **కొన్ని మందులు:** అసిటిజోలమైడ్, యాంటాసిడ్లు, గ్లూకోకార్టికాయిడ్ల వంటి మందులూ రాళ్లకు దారితీయొచ్చు. మూర్ఛతో బాధపడేవారు ఎక్కువగా మందులు తీసుకోవటమూ కారణం కావొచ్చు.
- **వెన్నుపాము లోపాలు:** వెన్నుపాము లోపాలతో పుట్టిన పిల్లల్లో మూత్రాశయం సరిగా పనిచేయకపోవటం మూలంగా మూత్రం ఎక్కువసేపు అక్కడే ఉండిపోయి రాళ్లు ఏర్పడొచ్చు.
- **నివసించే ప్రదేశం:** భూగర్భంలో 'కఠిన జలం' ఉన్న ప్రాంతాల్లో నివసించేవారికి కిడ్నీ రాళ్లు వచ్చే అవకాశం ఎక్కువ.
- **పేదరికం:** పేద పిల్లలకు కిడ్నీ రాళ్ల ముప్పు ఎక్కువ. దీనికి ప్రధాన కారణం అపరిశుభ్రత, సరైన పోషకాహారం తీసుకోకపోవటం.

విటమిన్ ఎ లోపం:

విటమిన్ ఎ లోపం మూలంగా మూత్రాశయం లోపలి గోడ పొరలు పొరలుగా ఊడుతుంటుంది. వీటిల్లో ఏదైనా పొర ఎక్కడైనా స్థిరపడితే దాని చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయి చివరికి రాయిగా మారుతుంది.

నిర్ధారణ

నొప్పి, మూత్రం మంట వంటి లక్షణాలతోనే కిడ్నీ రాళ్లను అనుమానిస్తారు. రాళ్లు ఉన్నట్టు అనిపిస్తే తగు పరీక్షలు చేసి నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.

- **ఎక్స్‌రే:** ఇది ప్రధానమైన పరీక్ష. మూత్రకోశం ఎక్స్‌రే తీస్తే రాళ్లు ఎక్కడున్నాయనేది తెలుస్తుంది. 80% వరకు రాళ్లు ఎక్స్‌రేలోనే కనపడతాయి. అవసరమైతే అల్ట్రాసౌండ్, సీటీస్కాన్ పరీక్షలూ చేయాల్సి వస్తుంది. వీటితో రాయి ఉందా లేదా? ఉంటే ఎక్కడుంది? మూత్రపిండాలు ఎలా పనిచేస్తున్నాయి? ఎక్కడైనా ఉబ్బాయా? అనేవి బయటపడతాయి.
- **మూత్రపరీక్ష:** రసాయనాలు, లవణాల మోతాదులు.. ఇన్‌ఫెక్షన్ కారక బ్యాక్టీరియా ఇందులో తెలుస్తాయి.
- **మూత్ర పరిమాణం:** పిల్లల విషయంలో 24 గంటల వ్యవధిలో మూత్రం ఎంత వస్తోందనేది చూడటం చాలా ముఖ్యం.
- **థైరాయిడ్ పరీక్ష:** అవసరమైతే పారాథైరాయిడ్ గ్రంథి పనితీరు పరీక్ష చేస్తారు.

చికిత్స- రాయిని బట్టి..

చిన్న చిన్న రాళ్లు వాటంతటవే బయటకొచ్చేస్తాయి. కొన్నిసార్లు ఇవి మూత్రనాళంలో, మూత్రమార్గంలో చిక్కుకొని పోవచ్చు. కొన్ని రాళ్లు.. ముఖ్యంగా ఆక్సలేట్ రకం రాళ్లు కిడ్నీ లోపలి పొర కణజాలానికి కరచుకొని అలాగే ఉండిపోతుంటాయి. పెద్దగానూ అవుతుంటాయి. అందువల్ల రాయి పరిమాణం, అది ఎక్కడుంది? ఇతరత్రా ఇబ్బందులేంటి? అనేవి దృష్టిలో పెట్టుకొని చికిత్స చేయాల్సి ఉంటుంది.

చిన్నరాళ్లకు..

సాధారణంగా 3-5 మి.మీ. సైజు రాళ్ల విషయంలో పెద్దగా కంగారు పడాల్సిన పనిలేదు. పిల్లలు నీళ్లు ఎక్కువగా తాగేలా చూసుకుంటే క్రమంగా బయటకు వచ్చేస్తాయి. అదే రాయి కాస్త పెద్దగా (5-8 మి.మీ.) ఉందనుకోండి. మూత్రపిండాలు సరిగా పనిచేస్తూ.. పెద్దగా వాపు, నొప్పి లేవనుకోండి. ఇలాంటి పరిస్థితుల్లో నొప్పి మాత్రలు, నార్కొటిక్స్‌తో మంచి ఉపశమనం లభిస్తుంది. వాంతి, వికారం తగ్గటానికి తగు మందులు వాడుకోవాల్సి ఉంటుంది.

పెద్దరాళ్లకు..

రాళ్లు 8 మి.మీ. కన్నా పెద్దగా ఉండి.. మూత్రపిండాల పనితీరు దెబ్బతింటూ.. తీవ్రమైన నొప్పి (రీనల్ కోలిక్), జ్వరం వేధిస్తున్నట్టయితే వెంటనే రాళ్లను బయటకు తీయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆపరేషన్ అవసరం లేకుండానే రాళ్లను తొలగించే పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

- **ఎక్స్‌ట్రాకార్పొరల్ షాక్ వేవ్ లిథోట్రిప్సీ:** ఇందులో బయటి నుంచి శబ్ద లేదా షాక్ తరంగాల సాయంతో రాళ్లను పగలగొడతారు. దీంతో అవి ముక్కలు ముక్కలై మూత్రం ద్వారా పడిపోతాయి. ముక్కలు లోపల చిక్కుకోకుండా మూత్రనాళంలో స్టెంట్ అమర్చుతారు. దీంతో అవి తేలికగా బయటకు వచ్చేస్తాయి. ఈ చికిత్సకు సుమారు 45 నిమిషాలు పడుతుంది.



- **యురెటెరోస్కోపిక్ పద్ధతి:** మూత్రనాళంలో రాయి చిక్కుకున్నవారికిది ఉపయోగపడుతుంది. ఇందులో మూత్రమార్గం ద్వారా యురెటెరోస్కోపీని లోపలికి పంపించి రాయిని తీయొచ్చు లేదా పగలగొట్టొచ్చు.
- **ఆపరేషన్:** 2 సెం.మీ. కన్నా ఎక్కువుండే రాళ్లకు కీహోల్ విధానంలో చిన్న రంధ్రం చేసి లోపలికి వెళ్లి రాయిని ముక్కలు చేయాల్సి ఉంటుంది. కిడ్నీలో మూత్రనాళం కలిసే చోట ఏర్పడే రాళ్లు (స్టాగ్‌హార్న్) కదలకుండా అక్కడే అతుక్కుపోతాయి. ఇలాంటివాటిని చిన్న కోతతో నెఫ్రోలిథాటమీ పద్ధతిలో ఆపరేషన్ చేసి తీస్తారు.

సమస్య - సలహా

అప్పుడే జుట్టు నెరిసిందేం?

సమస్య: నా వయసు 26 సంవత్సరాలు. అప్పుడే జుట్టంతా నెరిసిపోయింది. దీనికి ఏదైనా పరిష్కారముందా? – మహిపాల్ (ఈ-మెయిల్ ద్వారా)

సలహా: మరీ చిన్న వయసులో జుట్టంతా నెరిసిపోవటమనేది అరుదు. సాధారణంగా కుటుంబంలో ఎవరికైనా ఇలాంటి సమస్య ఉంటే.. జన్యుపరంగా ఒకరి నుంచి మరొకరికి వస్తుంటుంది. మీ వయసును బట్టి చూస్తుంటే ఇదే ప్రధాన కారణంగా అనిపిస్తోంది. కొందరికి పోషణలోపంతోనూ త్వరగా జుట్టు నెరిసిపోవచ్చు. మెలితిప్పటానికి, త్వరగా పొడిబారటానికి వెంట్రుకలకు ఎక్కువ వేడి తగిలేలా చేసినా వర్ణ ద్రవ్యం (మెలనిన్) దెబ్బతిని జుట్టు తెల్లబడొచ్చు. రంగులు, షాంపూల వంటి సౌందర్య సాధనాల్లోని రసాయనాలతోనూ కొందరికి వెంట్రుకలు త్వరగా నెరవొచ్చు. విటమిన్ బి12 లోపం, థైరాయిడ్ సమస్యల వంటివీ జట్టు నెరవటానికి దారితీయొచ్చు. ఇలాంటి సమస్యలకు చికిత్స తీసుకుంటే జుట్టు తిరిగి నల్లబడుతుంది. జన్యుపరంగా జుట్టు తెల్లబడితే మాత్రం చేయగలిగిందేమీ లేదు. అయితే మరీ త్వరగా నెరవకుండా చూసుకునే అవకాశముంది. ఇందుకు విటమిన్ మాత్రలతో పాటు క్యాల్షియం పాంటోథినేట్‌తో కూడిన మాత్రలు, మెలనిన్‌తో తయారుచేసిన లోషన్లు బాగా ఉపయోగపడతాయి. వీటిని డాక్టర్ సలహా మేరకు 6 నెలల వరకు వాడుకుంటే మంచి ఫలితం కనబడుతుంది. జుట్టు పూర్తిగా నల్లబడటం సాధ్యం కాకపోయినా కొంతవరకు రంగు మెరుగవుతుంది. అసలు మందులు, చికిత్సల కన్నా ఆహారపరంగా జాగ్రత్తలు తీసుకోవటం ముఖ్యం. వెంట్రుకలు చాలావరకు ప్రొటీన్‌తో తయారవుతాయి. అందువల్ల ప్రొటీన్ ఎక్కువగా ఉండే పప్పులు, సోయాబీన్స్, పుట్టగొడుగులు, మొలకలు, ఉడకబెట్టిన వేరుశనగలు, చిక్కుళ్ల వంటివి తీసుకోవటం మంచిది. మాంసాహారులైతే గుడ్డు తెల్లసొన, చేపలు, చికెన్ తినొచ్చు. అలాగే బాదం పప్పు, ఖర్జూరం కూడా తీసుకుంటే మేలు. **ఖర్జూరంలో ఐరన్ దండిగా ఉంటుంది. ఇది జుట్టుకు రంగునిచ్చే మెలనిన్ ఉత్పత్తి పెరగటానికి తోడ్పడుతుంది.** ఏదేమైనా మీరు ఒకసారి వెంట్రుకల నిపుణులను సంప్రదించటం ఉత్తమం. కారణాన్ని గుర్తించి అవసరమైన చికిత్స చేస్తారు.

– డా॥ వై.వి.రావు
ప్లాస్టిక్, కాస్మెటిక్ సర్జన్

మీ ఆరోగ్య సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా

సమస్య – సలహా **సుఖీభవ** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in

రాత్రి మగతకు 'చిరు'సాయం!

వేళాపాళా లేని తిండి. ముంచుకొచ్చే నిద్ర మత్తు, మందగించే ఆలోచనలు. రాత్రి షిఫ్టుల్లో పనిచేసేవారు తరచుగా ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉంటారు. వీటిని తగ్గించుకోవటానికి ఆహారంలో మార్పులు చేసుకోవటం.. ముఖ్యంగా చిరుతిండి (స్నాక్స్) బాగా ఉపయోగపడుతున్నట్టు దక్షిణ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొంటోంది. రాత్రివేళల్లో పనిచేసేవారు కడుపు నిండా తిన్నప్పుడు, కడుపు మాడ్చుకున్నప్పుడు, చిరుతిండి తిన్నప్పుడు కనపడే ప్రభావాలను పరిశోధకులు బేరీజు వేసి మరీ ఈ విషయాన్ని గుర్తించారు. ప్రస్తుతం ఉద్యోగాల తీరుతెన్నులు మారిపోయాయి. రాత్రనకా పగలనకా రోజంతా సేవలందించటం పరిపాటిగా మారిపోయింది. వైద్యం, విమాన, రవాణా, గనులు, సాఫ్ట్‌వేర్.. ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా రాత్రి షిఫ్టు ఉద్యోగాలు తప్పనిసరి అయిపోయాయి. ఇలాంటివాళ్లు రాత్రిపూట మెలకువగా, అప్రమత్తంగా ఉండటం నిజంగా కత్తి మీద సామే. దీంతో చాలామంది ఏదో ఒకటి తింటూనో.. కాఫీ, కూల్‌డ్రింకుల వంటివి తాగుతూనో మెలకువగా ఉండటానికి ప్రయత్నిస్తుంటారు. ఇది ఆరోగ్యానికి మంచిదా? కాదా? అన్నదానిపై పెద్దగా పరిశోధనలు జరగలేదు. ఈ నేపథ్యంలోనే దక్షిణ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ పరిశోధకులు వినూత్నమైన అధ్యయనం నిర్వహించారు. కాస్త ఎక్కువ భోజనం చేసినవారు, పూర్తిగా కడుపు మాడ్చుకున్నవారితో పోలిస్తే.. చిరుతిండి (ఓ పళ్లీ పట్టీ, యాపిల్) తిన్నవారు ఒకింత అప్రమత్తంగా ఉంటున్నట్టు, పనిలో నైపుణ్యం మెరుగవుతున్నట్టు బయటపడటం గమనార్హం. మగత, అలసట సైతం తక్కువగానే ఉండటం విశేషం. అందువల్ల రాత్రి షిఫ్టులో పనిచేసేటప్పుడు నూనె, కొవ్వులు ఎక్కువగా ఉండే చిప్స్, జంక్‌ఫుడ్ వంటి వాటికి బదులు ఓ పండో, పళ్లీ పట్టి లాంటివో వెంట తీసుకెళ్లండి. వీటితో పనిలో రాణిస్తూనే ఆరోగ్యాన్నీ కాపాడుకోవచ్చు.



ఈనాడు సినిమా

13 ఏళ్ల తర్వాత విజయశాంతి మేకప్

మీ జోరుకి సరిలేరెవ్వరూ

'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో ప్రముఖ నటి విజయశాంతి ఓ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ఆమె సెట్‌లోకి అడుగుపెట్టారు. 13 ఏళ్ల తర్వాత మళ్లీ మేకప్ వేసుకొన్నారు. ఆ విషయాన్ని ట్విటర్ ద్వారా తెలిపారు అనిల్ రావిపూడి. "విజయశాంతిగారికి మేకప్ సమయమిది. ఈ 13 ఏళ్లలో ఆమెలో మార్పు లేదు. అదే క్రమశిక్షణ, నడవడిక, చైతన్యం' అంటూ ట్వీట్ చేశారు అనిల్ రావిపూడి.



అనిల్ రావిపూడి, మహేష్‌బాబు

అగ్ర కథానాయకుడి సినిమా అంటే ఎప్పుడు మొదలవుతుందో, ఎప్పుడు విడుదలవుతుందో చెప్పలేని పరిస్థితి. అలాంటిది విడుదల తేదీని ఖరారు చేశాకే 'సరిలేరు నీకెవ్వరు' చిత్రానికి కొబ్బరికాయ కొట్టారు. అందుకు తగ్గట్టుగానే మెరుపు వేగంతో చిత్రీకరణ జరుపుకొంటోంది సినిమా. కొన్నాళ్ల కిందటే కశ్మీర్‌లో తొలి షెడ్యూల్‌ని పూర్తి చేసుకొని, హైదరాబాద్‌కి తిరిగొచ్చింది చిత్రబృందం. ఆ వెంటనే రైలు ప్రయాణం నేపథ్యంలో సాగే కీలక సన్నివేశాల్ని పూర్తి చేసింది. త్వరలోనే రామోజీ ఫిలింసిటీలో వేసిన కొండారెడ్డి బురుజు సెట్ నేపథ్యంలో చిత్రీకరణ జరపబోతున్నారు. ఈ వేగం గమనించినవాళ్లు ఎవరైనా 'మీ జోరుకి సరిలేరెవ్వరూ' అనాల్సిందే! వచ్చే సంక్రాంతికే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు కాబట్టి కథానాయకుడు మహేష్‌బాబు విరామం లేకుండా ఉత్సాహంగా చిత్రీకరణలో పాల్గొంటున్నారు. అదే ఉత్సాహం దర్శకుడు అనిల్ రావిపూడిలోనూ కనిపిస్తోంది. అందుకే ఈ జోరు. మహేష్‌కి అనిల్ రావిపూడి ఓ సన్నివేశాన్ని వివరిస్తున్న దృశ్యమిది. ఈ చిత్రంలో మహేష్ ఆర్మీ మేజర్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే.

పూరి జగన్నాథ్, విజయ్ దేవరకొండ, ఛార్మి

పూరి చిత్రంలో విజయ్

మరో కొత్త కలయిక కుదిరింది. యువ కథానాయకుడు విజయ్ దేవరకొండతో, అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ఒక చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఛార్మి, పూరి జగన్నాథ్ నిర్మించబోతున్నారు. ఈ విషయాన్ని సోమవారం అధికారికంగా ప్రకటించారు. 'ఇస్మార్ట్ శంకర్'తో ఇటీవలే విజయాన్ని అందుకొన్నారు పూరి. విజయ్ దేవరకొండ 'డియర్ కామ్రేడ్'తో పలకరించారు. వీరి కలయికలో సినిమా రూపొందబోతోందనే ప్రచారం కొన్ని రోజులుగా సాగుతోంది. దాన్ని ధ్రువీకరిస్తూ ఓ ప్రకటనని విడుదల చేశారు పూరి, ఛార్మి. 'జనగణమణ' పేరుతో చాలా రోజుల కిందటే ఓ కథని సిద్ధం చేసుకొన్నారు పూరి. ఆ కథనే విజయ్‌తో తెరకెక్కించబోతున్నారని ప్రచారం సాగుతోంది. అది నిజమో కాదో తెలియాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే. కథకి సంబంధించిన పూర్తి వివరాలతో పాటు ఇతర నటీనటులు, సాంకేతిక బృంద వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రాన్ని లావణ్య సమర్పిస్తున్నారు.

ఆయుష్మాన్ ఖురానా

చీరకట్టాడు జాతీయ ఉత్తమ నటుడు

తాజాగా 66వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ నటుడిగా నిలిచారు ఆయుష్మాన్ ఖురానా. 'అంధాధున్' చిత్రంలో అంధుడిగా నటించి మెప్పించినందుకు ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఇప్పుడు ఆయన మరో కొత్త తరహా పాత్ర పోషిస్తున్న చిత్రం 'డ్రీమ్ గర్ల్'. ఓ చిన్న పట్టణానికి చెందిన యువకుడి పాత్రలో ఆయుష్మాన్ నటిస్తున్నాడు. వివిధ రకాల మహిళలకు సంబంధించిన గొంతులతో మాట్లాడటం అతడి ప్రత్యేకత. ఈ సినిమాకు సంబంధించిన కొన్ని పోస్టర్‌లలో చీరకట్టులో కనిపించి అలరించాడు ఆయుష్మాన్. తాజాగా ముంబయిలో జరిగిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో చీరకట్టులో వేదికపై కనిపించి అందర్నీ ఆకట్టుకున్నాడు. రాజ్ శాండిల్య తెరకెక్కిస్తున్న ఈ చిత్రం వచ్చే నెల 13న రానుంది.

రైల్వే కూలీ నెం.1 కానుక

సారా అలీఖాన్, వరుణ్ ధావన్

వరుణ్ ధావన్, సారా అలీఖాన్ నాయకా నాయికలుగా నటిస్తున్న చిత్రం 'కూలీ నెం.1'. అదే పేరుతో గోవిందా, కరిష్మా కపూర్ జంటగా నటించిన చిత్రానికి రీమేక్ ఇది. వరుణ్ ధావన్ తండ్రి డేవిడ్ ధావన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సోమవారం సారా పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఒక పోస్టర్‌లో ఎర్ర చొక్కా, తెల్ల ప్యాంటు, తలపై తెల్ల టోపీ, నడుముకు బెల్టు, మెడలో తువ్వాలుతో అచ్చమైన రైల్వే కూలీలా కనిపిస్తున్న వరుణ్ లగేజీ ట్రాలీతో పోజివ్వగా, మరో పోస్టర్‌లో అదే గెటప్పుతో సారాను హత్తుకుని రొమాంటిక్‌గా కనిపిస్తున్నారు. "సారా నీ పుట్టినరోజు కానుకగా ఈ పోస్టర్‌లను తెచ్చాను" అని ట్వీట్ చేశారు వరుణ్. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

పూజా సోలంకి, విజయ్ రాజా

అసలేం జరిగింది?

నటుడు శివాజీరాజా తనయుడు విజయ్ రాజా కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఏదైనా జరగొచ్చు'. పూజా సోలంకి, సాషా సింగ్ నాయికలు. బాబీసింహా కీలక పాత్రధారి. కె.రమాకాంత్ దర్శకుడు. సుదర్శన్ హనగోడు నిర్మాత. సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. శివాజీరాజా ట్రైలర్‌ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "మూడేళ్లు ఈ సినిమా కోసం కష్టపడ్డాడు రమాకాంత్. మా అబ్బాయి ఒక మంచి కథతో వస్తున్నాడ"న్నారు. "డార్క్ కామెడీ హారర్ చిత్రమిది. ఏప్రిల్ ఒకటిన పుట్టిన ముగ్గురు వ్యక్తుల కథ. వాళ్ల పనుల వల్ల ఏం జరిగిందన్నది తెరపైనే చూడాల" న్నారు దర్శకుడు. 23న విడుదల చేస్తున్నామన్నారు నిర్మాత. "దర్శకుడు నాపై నమ్మకంతో ఈ సినిమాని తీశార"న్నారు విజయ్. అజయ్ ఘోష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అందంగా కనిపించే కథానాయికలు కొంతమంది. అభినయంలో దిట్ట అనిపించుకొనేవాళ్లు కొంతమంది. ఆ రెండూ కలగలిసినవాళ్లూ కనిపిస్తుంటారు. అందులో ఒకరు రెజీనా. కెరీర్ తొలి నుంచీ మొన్నటి 'అ!' వరకు గుర్తుండిపోయే పాత్రలు చేశారు. ఇటీవల అడివి శేష్‌తో కలిసి 'ఎవరు'లో నటించారు. పీవీపీ సినిమా పతాకంపై రామ్‌జీ దర్శకత్వంలో తెరకెక్కిన ఆ చిత్రం ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా రెజీనా సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది. ఆ విషయాలివీ...

నేనేం ఇవ్వగలను

రెజీనా

'ఎవరు' కథ విన్నాక మీకొచ్చిన మొట్టమొదటి ఆలోచన ఏంటి?

దర్శకుడు రామ్‌జీ, కథానాయకుడు శేష్ వచ్చి కథ చెప్పారు. వింటున్నప్పుడే నేను చేయబోయే సమీర పాత్రకి సంబంధించి కొన్ని దృశ్యాలు కళ్ల ముందు మెదిలాయి.

ఈ పాత్ర మీ కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపిస్తుందంటారు?

ఒక కథ కానీ, పాత్ర గురించి కానీ విన్నాక 'దీనికి ఒక నటిగా నేనేం ఇవ్వగలను' అనేదే ఆలోచిస్తా. అది నా కెరీర్‌కి ఎంత మేలు చేస్తుంది? ఎలాంటి ప్రభావం చూపిస్తుందని ఆలోచించను. 'అ!' కోసమూ అలాగే కష్టపడ్డా. దానికి జాతీయ పురస్కారాలొచ్చాయి.

అగ్ర హీరోల సినిమాల్లో ఎక్కువగా అవకాశాలు అందుకోలేకపోయారేంటి?

ఏడేళ్లుగా చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్నా. ఏం జరిగిందో, ఎక్కడ తప్పులు దొర్లాయో ఇంకా అర్థం కాలేదు. నా వాళ్లెవరూ ఇక్కడ లేరు. అర్థం చేసుకోవడానికి సమయం పట్టింది. కొంతమంది ఇలా చేయాలి, అలా చేయకూడదని చెప్పారు కానీ... నేను మాత్రం నా అనుభవం ప్రకారమే నిర్ణయాలు తీసుకొన్నా. నా తప్పులు, నా పరాజయాలు నన్ను నేను మరింత బాగా అర్థం చేసుకోవడానికి దోహదం చేశాయి.

మీ తొలి హిందీ చిత్రం 'ఏక్ లడ్‌కీ కో దేఖా తో..'లో స్వలింగ సంపర్కురాలిగా నటించారు. దానికి ఎలాంటి స్పందన వచ్చింది?

ఆ సినిమాకు పిలుపొచ్చాక చేయాలా వద్దా? అని చాలా ఆలోచించా. 'ఏక్ లడ్‌కీ కో దేఖాతో ఐసా లగా'లో నా పాత్రని చూసి చాలామంది కమర్షియల్ కథానాయిక అయినా, ఇలాంటి పాత్రలు చేయడం బాగుందని మెచ్చుకున్నారు.

'అ!'కి జాతీయ పురస్కారాలు వచ్చాయని తెలిశాక మీ అనుభూతేంటి?

ఆ విషయం గురించి నాని నాకు మెసేజ్ చేశారు. మేకప్‌కి జాతీయ పురస్కారం వచ్చింది, అందుకు నువ్వొక ప్రధాన కారణం అని అందులో రాశారు. అది చూశాక నాకు చాలా ఆనందం కలిగింది. 'అ!'కి మేకప్ వేసుకోవడానికి నాకు 24 గంటలు పట్టేది. రోజులో 2, 3 గంటలే నిద్రపోయేదాన్ని. అంత కష్టపడి చేసిన సినిమా అది.

నాకు ధైర్యాన్నిచ్చింది 'గుణ 369'

కార్తికేయ, అర్జున్ జంధ్యాల

"నేను ఇకపై ఎంపిక చేసుకొనే కథలమీద 'గుణ 369' ప్రభావం ఉంటుంది. ఎంత ఖర్చు పెట్టినా రాని బాధ్యతగల నటుడనే పేరు ఈ సినిమాతో నాకొచ్చింది" అన్నారు కార్తికేయ. ఆయన హీరోగా, అర్జున్ జంధ్యాల తెరకెక్కించిన చిత్రం 'గుణ 369'. అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి నిర్మాతలు. ప్రవీణ కడియాల సమర్పించారు. చిత్రబృందం సోమవారం విజయోత్సవాన్ని నిర్వహించింది. కార్తికేయ మాట్లాడుతూ "సినిమా చూసి కొంతమంది మహిళలు నన్ను పట్టుకొని ఏడ్చినప్పుడు, వాళ్లకి ఈ కథ ఎంతగా చేరువైందో అర్థమైంది. మా అమ్మ కూడా కన్నీళ్లు పెట్టుకొన్నారు. నాకు ధైర్యాన్నిచ్చిన చిత్రమిది" అన్నారు. "నిర్మాతల నమ్మకం నిజమైనందుకు ఆనందంగా ఉంది. సినిమా పంపిణీదారులు, ప్రదర్శనకారులు కళ్లల్లో సంతోషం చూడటం తృప్తినిచ్చింది" అన్నారు దర్శకుడు. ప్రవీణ మాట్లాడుతూ "మనసుల్లో నిలిచిపోయే సినిమాల్లో 'గుణ 369' ఒకటి" అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు మహేష్, సంగీత దర్శకుడు చైతన్ తదితరులు పాల్గొన్నారు.

నీ లైఫ్ నీ కంటే ఎవరికీ ఇంపార్టెంట్ కాదు.

చిత్రం: చిత్రలహరి – పంపిన వారు: మేడిశెట్టి నాయుడు, ఎరుకువానిపాలెం

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

పంచ్ డైలాగ్

"మంచి కథ కావాలి కానీ, పాత్ర చిన్నదా.. పెద్దదా అనేది పట్టించుకోను. పాత్ర ప్రభావం బలంగా ఉంటే చాలు" అంటోంది కల్యాణి ప్రియదర్శన్. 'హలో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ఇటీవల 'చిత్రలహరి'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. తాజాగా 'రణరంగం'లో నటించింది. శర్వానంద్ కథానాయకుడిగా, సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సోమవారం విలేకర్లతో ముచ్చటించింది కల్యాణి. ఆ విషయాలివీ...

దర్శకత్వం వహిస్తా!

కల్యాణి ప్రియదర్శన్

'రణరంగం'లో మిమ్మల్ని ఆకర్షించిన అంశాలేంటి?

సుధీర్ వర్మ చెప్పిన కథ కొత్తగా అనిపించింది. ఓవైపు గత కాలానికి సంబంధించిన కథను చెప్తూనే.. ప్రస్తుత జీవితాన్ని చూపిస్తుంటారు. ఒక గ్యాంగ్‌స్టర్ 20 ఏళ్ల జీవిత ప్రయాణాన్ని ఆవిష్కరించారు.

మీ పాత్ర ఎలా ఉండబోతుంది?

గీత అనే అమ్మాయిగా కనిపిస్తా. కథ మొత్తం శర్వా చుట్టూనే తిరుగుతుంది. ఎంత గొప్ప మగవాడైనా అమ్మాయిల దగ్గర తమ బలహీనతను బయటపెట్టుకుంటారు. శర్వా పాత్ర కూడా అంతే. గీత ప్రేమ కోసం పరితపిస్తుంటాడు. ప్రేక్షకులంతా నా పాత్రతోనే శర్వాలోని ఈ కోణాల్ని చూడగలుగుతారు.

గ్యాంగ్‌స్టర్ సినిమాలంటే మీకు ఇష్టమా?

చిన్నప్పట్నుంచి ఆసక్తిగా చూస్తుంటా. నాకు తుపాకీ పట్టుకోవడమంటే చాలా ఇష్టం. నాన్నను ఫైరింగ్ నేర్పించమని ఎప్పుడూ అడుగుతుండేదాన్ని. ఆ కోరిక సుధీర్ ద్వారా 'రణరంగం' సెట్స్‌లో తీరింది.

మీ నాన్న ప్రియదర్శన్ దర్శకత్వంలో చేస్తున్న 'మరక్కర్' సంగతులేంటి?

ప్రస్తుతం గ్రాఫిక్స్‌కు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఇందులో నా పాత్ర చిన్నదే కానీ, ప్రాధాన్యత ఉన్నది. కానీ ఆయన ముందు నటిస్తున్నప్పుడు ఒత్తిడిగా అనిపించింది.

మీ నాన్న బాటలో దర్శకత్వం వైపు అడుగులేసే ఆలోచన ఉందా?

ఎప్పుడనేది చెప్పలేను కానీ, దర్శకత్వం కచ్చితంగా చేస్తా. ఇప్పుడు నా దృష్టంతా నటన మీదే. వెనక్కి తిరిగి చూసుకుంటే గర్వంగా అనిపించే కథల్లోనే నటిస్తా.

బంధాల్ని గుర్తు చేసే.. 'నీకోసం'

దీక్షితా పార్వతి, సుభాంగి పంత్

అరవింద్ రెడ్డి, సుభాంగి పంత్, అజిత్ రాధారామ్, దీక్షితా పార్వతి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నీకోసం'. అవినాష్ కోకటి దర్శకుడు. అల్లూరమ్మ (భారతి) నిర్మాత. సోమవారం హైదరాబాద్‌లో బెక్కెం వేణుగోపాల్ ట్రైలర్‌ని విడుదల చేశారు. "నిజాయతీగా ఓ మంచి సినిమాని తీశాం. మరిచిపోయిన బంధాల్ని మళ్లీ గుర్తు చేసే చిత్రమిద"న్నారు దర్శకుడు. "మేం కొత్తవాళ్లమే అయినా, కొత్తదనంతో కూడిన కథతో వస్తున్నాం. ప్రతి ఒక్కరూ తమని తాము చూసుకొనేలా దర్శకుడు తెరకెక్కించార"న్నారు నాయకానాయికలు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు శ్రీనివాస్‌శర్మతో పాటు చిత్రబృందం పాల్గొంది.

వసుంధర

చెదరనివ్వకుండా... చమక్కుమనేలా!

చిన్నచిన్న వేడుకలకు మేకప్ వేసుకోవడం ఈ రోజుల్లో మామూలే. మరి చినుకులు పడుతున్నప్పుడు చేసుకునే అలంకరణ చెదిరిపోకుండా ఉండాలంటే... ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూడండి.

ఈ కాలంలో ఎంత తక్కువ మేకప్ వేసుకుంటే అంత మంచిదంటారు నిపుణులు.

- ముందుగా ముఖానికి మాయిశ్చరైజర్ రాసుకోవడం తప్పనిసరైనా... దీన్ని చాలా తక్కువ మొత్తంలో ఉపయోగించాలి. ఫౌండేషన్ ఎక్కువ సమయం పాటు నిలిచి ఉండాలంటే దాంతోపాటు బీబీ క్రీమ్‌నూ కలిపి ముఖానికి, మెడకు రాసుకోవాలి. కాంపాక్ట్ లేదా పౌడర్‌నీ వీలైనంత కొద్దిగానే వాడాలి. బ్లష్ వాడుతుంటే... పౌడర్ రకానికి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది.

- చినుకులు పడుతున్నప్పుడు ఐ లైనర్, కాజల్ వాడకపోవడమే ఉత్తమం. మస్కారా తప్పనిసరి అనుకుంటే వాటర్‌ప్రూఫ్ రకాన్ని ఎంచుకుని చూడండి. ఒక కోటింగ్ మాత్రమే వేసుకుంటే చాలు.
- పెదాలకు ఈ కాలంలో ఏదో ఒక లిప్‌స్టిక్ కాకుండా... న్యూడ్ రంగుల్ని ఎంచుకోవడానికి ప్రయత్నించాలి. తప్పనిసరి అనుకుంటేనే మ్యాటీ లిప్‌స్టిక్ వేసుకోవాలి. ముఖ్యంగా లేత రంగులు నప్పుతాయి.
- కనుబొమల్ని దిద్దుకోవడానికి ఐబ్రో పెన్సిల్ వాడకపోవడమే మంచిది. చినుకులు పడితే... అది చెదిరిపోయే అవకాశం ఎక్కువ. చర్మం జిడ్డుగా ఉన్నా సరే... ఎప్పటికప్పుడు నీటి ఆధారిత మాయిశ్చరైజర్ రాసుకోవడం తప్పనిసరి.

చేతుల అందం... చూడతరమా

చీరెంత సాదా రకం అయినా... దానికి జత చేసే బ్లవుజు మాత్రం ట్రెండీగా ఉండాలి. అప్పుడే చీరకట్టుకో లుక్కు వస్తుందంటున్నారు డిజైనర్లు. అసలు ఎవరికి ఎలాంటి రకాలు నప్పుతాయో... ఇప్పుడు ఉన్న డిజైన్లేంటో చూద్దామా...

మహానటి సినిమాలో కీర్తి సురేష్ వేసుకున్న సావిత్రి బ్లవుజులు ఎంత ట్రెండ్ అయ్యాయో తెలుసు కదా! ఇప్పుడు ఆ పాతే కొత్తగా ఈ తరాన్ని ఆకట్టుకుంటోంది. అవే ట్రెండ్ ఎల్బో స్లీవ్స్ ఎంబ్రాయిడరీ హంగామా తగ్గించి అంచులతోనే మోచేతి పై వరకు ఎంచుకునే నయా శైలి ఇది. సాదా చీరల మీదకూ ఈ స్టైల్ బాగుంటుంది. ఈ డిజైనులో పైన బుట్ట కింద అంచు వచ్చేలా కుట్టించుకుంటే కళగా ఉంటుంది.

- కాస్త సన్నగా ఉండే అమ్మాయిలకు చక్కని ఎంపిక బుట్ట చేతులు. పొడవుగా ఉండేవారికి ఇవి కొత్త లుక్‌ని తెచ్చిపెడతాయి. పట్టు, రాసిల్క్, బెనారస్ వంటివాటితో కుట్టించుకుంటే ఆ అందమే వేరు. షిఫాన్, ఫ్యాన్సీ రకాల్ని జత చేసి బుట్ట చేతుల్ని కుట్టించుకోవచ్చు. మీ ఎత్తు, శరీరాకృతిని బట్టి వాటిని కాస్త పొడుగ్గా, లేదా చిన్నగా ఉండేలా చూసుకోవాలి.
- పొట్టి చేతులు... వీటిని కాస్త లావుగా, ఎత్తు తక్కువగా ఉండేవారికి బాగుంటాయి. పొడుగ్గా ఉన్నవారు ఎంచుకోవాలనుకుంటే మరీ పొట్టిగా కాకుండా కుట్టించుకోవాలి. ఇవి ఒంటికి పట్టేసేలా కాకుండా కాస్త వదులుగా బెల్ ఆకృతిలోనో, మరో స్టైల్‌నో ప్రయత్నిస్తే ఆధునికంగా కనిపిస్తారు.

- కాలేజీ అమ్మాయిలకు త్రీఫోర్త్ చేతులు అదిరిపోతాయి. కాస్త సన్నగా ఉండేవారూ ఈ స్టైల్‌ని అనుసరించవచ్చు. ఈ డిజైను పట్టు, స్టిఫ్ ఫ్యాబ్రిక్, కంచి, బెనారస్, రాసిల్క్ వంటి వాటికి బాగోదు. కలంకారీ, నూలు వంటి నేత రకాల్లో దీన్ని ప్రయత్నిస్తే కొత్తగా కనిపిస్తారు. ఫ్యాన్సీ చీరలైన బ్రాసో, నెట్, జార్జెట్ చీరల మీదకు దీన్ని ఎంచుకున్నా మీ లుక్ మారిపోతుంది. వీటిల్లో బెల్ స్లీవ్స్‌నీ ప్రయత్నించొచ్చు. భుజాలు, చేతులు లావుగా ఉన్నవారు కుట్టించుకుంటే ఆ లోపం కనిపించకుండా చేయొచ్చు. చేతులూ సన్నగా కనిపిస్తాయి.
- నెట్టెడ్, జాలువారే తరహా వస్త్రాన్ని పొడవు చేతులతో కుట్టించుకుంటేనే బాగుంటుంది. ఫుల్ క్రేప్, జార్జెట్ వస్త్రాలతో రూపొందించిన ఇవి ఫ్యాన్సీ చీరల మీదకు సరైన ఎంపిక.
- కేప్... ఒకప్పుడు పాశ్చాత్య వస్త్రశైలి అయినా.. ప్రస్తుతం సంప్రదాయ రకాలతోనూ కలుస్తోంది. దీన్ని ఇప్పుడు... చీరల మీదకు ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా స్లీవ్‌లెస్ వేసుకోవడం ఇష్టం ఉండి వేసుకోలేని వారు కేప్‌ని ఎంచుకోవచ్చు.
- బెల్ బాటమ్... క్రేప్, జార్జెట్, షిఫాన్, శాటిన్ లాంటి చీరల మీదకూ ఈ చేతుల్ని ప్రయత్నించొచ్చు. అంటే.. చేతులు కొంతవరకూ బిగుతుగా... అడుగున వదులుగా, వెడల్పుగా ఉండటమే ఈ డిజైను ప్రత్యేకత. ఇలా ఎంచుకుంటున్నప్పుడు చేతులు త్రీఫోర్త్ ఉంటేనే బాగుంటుంది.

ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నా... గూడేల్లో ఇంకా పేదరికం, నిరక్షరాస్యత కనిపిస్తుంది. అధికారులతో తమ బాధలు చెప్పుకోలేని అమాయకత్వం వారిది. వీటన్నింటిని గమనించిన ఓ జిల్లా పాలనాధికారి గిరిసీమలో వెలుగులు నింపేందుకు ఓ సాధారణ మహిళగా వారితో కలిసిపోయారు. ఆదివాసుల ఆడపడుచుగా గుర్తింపు పొంది, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆమే ఆదిలాబాద్ జిల్లా పాలనాధికారి దివ్యా దేవరాజన్.

గిరిసీమలో వెలుగుల దివ్య

అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో ఆదివాసీ, గిరిజన జనాభా ఎక్కువ. వారిని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలంటే వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు ఆ జిల్లా కలెక్టర్ దివ్యా దేవరాజన్. స్థానిక సమస్యల గురించి తెలుసుకోవడానికి గ్రామాల్లో పర్యటించినప్పుడు ఎవరూ స్పందించకపోవడం గమనించారామె. వారికి దగ్గర కావాలనే ఉద్దేశంతో ఆదివాసీల గోండి భాషను నేర్చుకున్నారు. గ్రామాలకు వెళ్లి వారి భాషలోనే పలకరించడం, అక్కడి సంప్రదాయాలపై ఆసక్తి చూపడంతో క్రమంగా వాళ్ల సమస్యలు తెలిశాయి. ఎప్పటికప్పుడు ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో ఆమెపై మరింత నమ్మకం పెరిగింది. ఇప్పటి వరకు ఏ అధికారీ ఇంతలా మమేకం కాకపోవడంతో వారంతా ఆ కలెక్టరును తమ ఆడపడుచుగా భావించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు విలువ...

దండారి ఉత్సవాలు, ఇతర పండగల్లో పాల్గొంటూ అక్కడి మహిళలకు దగ్గరయ్యారు. ఆదివాసీల ఆచార వ్యవహారాలకు ప్రధాన కేంద్రమైన నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులతో కలసి పూజల్లో పాల్గొనడంతో పాటు, ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. నాగోబా ఉత్సవాల సందర్భంగా 10 లక్షల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాదు... గ్రామాల్లో పర్యటిస్తూ రహదారులకు మరమ్మతులూ చేయించారు. శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి లేఖలు పంపడం మొదలుపెట్టారు. క్రమంగా ఎంతో మార్పు తెచ్చారు.

భిన్న ప్రాంతాల్లో... తమిళనాడుకు చెందిన దివ్యా దేవరాజన్ 2010-11 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారిణి. శిక్షణ అనంతరం 2012లో భువనగిరి సబ్‌కలెక్టరుగా మొదటి పోస్టింగ్ రావడంతో అక్కడ రెండేళ్లు, అనంతరం భద్రాచలం ఐటీడీఏ పీవోగా రెండేళ్లు పనిచేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో 2016 అక్టోబరులో వికారాబాద్ జిల్లాకు కలెక్టరుగా వెళ్లారు. రెండేళ్ల క్రితం ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆదివాసీలు, అక్కడ ఉండే మిగతావారి మధ్య జరిగిన గొడవలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారు.

ఆదర్శంగా పీహెచ్‌సీలు...

కొండ ప్రాంతాల వారికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ పీహెచ్‌సీలు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు), ఆసుపత్రుల అభివృద్ధిపై దృష్టి సారించారు. ఇప్పుడు ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. ఇంద్రవెల్లి, దంతన్‌పల్లి, ఇచ్చోడ మండలాల ఆరోగ్య కేంద్రాలు జాతీయ స్థాయిలో కాయకల్ప, ఆంక్వా అవార్డులు సాధించాయి.

వ్యవసాయం...

రైతుల సంక్షేమానికి 'కిసాన్ మిత్ర' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన ఆమె... ఒక టోల్‌ఫ్రీ నెంబరు ఇచ్చి వాళ్లు ఎదుర్కొనే ఎలాంటి సమస్యలైనా అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వచ్చిన ఫిర్యాదుల్లో 65 శాతం మంది రైతుల సమస్యలను పరిష్కరించారు. ఆత్మహత్యలు చేసుకున్న వ్యవసాయదారుల వివరాలను సేకరించి వారి కుటుంబాలకు ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పథకమైన దళితులకు సాగు భూమి పంపిణీలో ఆదిలాబాద్ జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలవడానికి ఈమె చేసిన కృషే కారణం.

ప్రతి మండల కేంద్రంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులు తీసుకొని విడతల వారీగా 80 శాతం రైతులకు రెవెన్యూ హక్కులు కల్పించారు. ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికీ కృషి చేశారు. ఉట్నూర్ మండలం ధర్మాజీపేట్‌లో 30 కుటుంబాలకు ఉచితంగా పత్తి, జొన్న, పప్పు ధాన్యాల విత్తనాలను సరఫరా చేయించడం తన బాధ్యత అనుకున్నారు.

ప్రత్యేక కృషి...

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఇప్పపూల పండుగను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఇప్పపూలతో తినుబండరాలను తయారు చేయించి ఆ మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసులు ఉండటానికి కేవలం నిరక్షరాస్యతే ప్రధాన కారణమని గుర్తించి, అక్షరాస్యతను పెంచేందుకు కార్యక్రమాలు రూపొందించి... విద్యాభివృద్ధికీ కృషి చేస్తున్నారామె.

- *బండారి లక్ష్మీనర్సయ్య, న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి*

వెనకడుగు వద్దు

ఈ తరం మహిళలు పురుషులతో సమానంగా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. మారుతున్న కాలంతో పాటు కొత్త అవకాశాలను సృష్టించుకుంటూ, వివిధ రంగాల్లో దూసుకుపోతున్నారు. తమకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అసలు ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే... మన ఆలోచనాధోరణి ఎలా ఉండాలో చూద్దామా...

- ఎప్పుడూ కొత్త విషయాలను తెలుసుకుంటూనే ఉండాలి. పరిశోధనాత్మకంగా, వాస్తవికంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. తోటి ఉద్యోగులు ఏయే అంశాల్లో మీకంటే ముందున్నారో విశ్లేషించుకోండి. వాటిని బట్టి నేర్చుకోవాల్సిన విషయాలను గుర్తించండి. ఇతరుల అభిప్రాయాలనూ తెలుసుకోండి. పనితీరు మెరుగుపరచుకోవడానికి వారి సూచనలనూ పరిగణించండి.
- ఎక్కడైనా విమర్శలు సర్వసాధారణం. వాటిని పట్టించుకోవద్దు. చేస్తున్న పనిపైనే దృష్టి పెట్టండి. మీరు చేసే పనులు ఇంకొకరికి నచ్చకపోయినా, వారు మీ మాటల్ని ఏకీభవించకపోయినా మీరు వెనకడుగు వేయొద్దు.

- చేయాలనుకున్న పని వందశాతం కచ్చితత్వంతో చేయండి. పని మొదలు పెట్టాక గెలుపు గురించే ఆలోచిస్తూ, ధైర్యంగా ముందడుగు వేయాలి తప్ప సంకోచాలు, సందేహాలు ఉండకూడదు. ఒకవేళ వైఫల్యం ఎదురైతే నిరాశ చెందకుండా ఓటమి నుంచి గెలుపు పాఠాలు నేర్చుకోవాలనే సానుకూల దృక్పథాన్ని అలవాటు చేసుకోండి.
- డబ్బులు సంపాదించడానికే ఉద్యోగం చేస్తున్నాం అనే భావన మీ ఎదుగుదలకు ఆటంకంగా మారవచ్చు. చేసే పని మీద పూర్తిగా దృష్టి సారిస్తేనే ఒక్కో మెట్టు ఎక్కుతూ ఉన్నత స్థానాలకు చేరుకుంటారు. దాంతోపాటు అందరితో కలిసి పనిచేస్తేనే కెరీర్‌లో మీకంటూ ఓ గుర్తింపు వస్తుందని తెలుసుకోండి.
- ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం అలవాటు చేసుకోకపోవడం మంచిది. అది మీకు బలహీనత కావొచ్చు. మీ లక్ష్యం ఎలాంటిదైనా దాన్ని చేరుకునే క్రమంలో ఆటుపోట్లు సహజమని నమ్మాలి. పనితీరును సమీక్షించుకుంటూ తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోండి. అప్పుడే గెలుపు మీకు సొంతమవుతుంది.

భర్త పేరు తొలగించలేనా?

? నేనొక ప్రభుత్వ సంస్థలో బోధనావృత్తిలో ఉన్నాను. భర్తతో విభేదాల కారణంగా పదేళ్ల నుంచి ఒంటరిగానే ఉంటున్నా. ఇద్దరు పిల్లలు. నా వైవాహిక జీవితం గురించి మా సంస్థలో ఎలాంటి వివరాలు ఉండటానికి నేను ఇష్టపడటం లేదు. నాకు సంబంధించిన అన్ని ఆస్తుల్లో పిల్లలిద్దరికీ చెరో యాభై శాతం చెందేలా ఏర్పాట్లు చేయాలనుకుంటున్నా. నా సంపాదనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల జాబితా నుంచి నా భర్త వివరాలను తొలగించమని సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశా. సెల్ఫ్ డిక్లేరేషన్ పత్రం సరిపోదని, ఇందుకు ఆధారాలు సమర్పించమని అడుగుతున్నారు. న్యాయపరంగా ఆయన పేరు తొలగించే అవకాశం ఉందా?

- ఓ సోదరి

✔ మీ ప్రశ్నలో స్పష్టత లేదు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపు తనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలను నామినీలుగా దరఖాస్తులో నింపి ఇవ్వాల్సి ఉంటుంది. కుటుంబ పింఛను నియమాల ప్రకారం తల్లి, తండ్రి, భర్త, పిల్లల పేర్లను ఇందులో రాయాల్సి ఉంటుంది. వారెవరూ లేకపోతే రక్త సంబంధీకులెవరినైనా నామినీలుగా చూపించవచ్చు. మీరు మీ భర్తతో విడాకులు తీసుకున్నారో లేదో తెలియజేయలేదు. ఒకవేళ తీసుకుంటే ఆ కాగితాలు చూపించి అతడి పేరు తొలగించుకోవచ్చు. మీపై ఆధారపడిన వ్యక్తుల్లో భర్త పేరు తీసేసి...పిల్లల పేర్లను మాత్రమే నామినీలుగా చూపించుకోవచ్చు. మీ వివాహ బంధం గురించి మాత్రం చెప్పాల్సి ఉంటుంది. భర్త పేరు చెప్పకుండా పిల్లల్ని చట్టబద్ధంగా వారసులుగా నిరూపించలేరు. మీ భర్త పేరు తీసేయమని అధికారులకు దరఖాస్తు ఇస్తే... వారు తగిన ధ్రువీకరణ పత్రాలను చూపించమని అడిగారని అంటున్నారు. అందుకు కారణాలు వారికీ తెలియాలి కదా! చట్టబద్ధంగా పుట్టిన/దత్తత తీసుకున్న పిల్లలు మాత్రమే నామినీలుగా అర్హులు. తరువాత వచ్చే పర్యవసానాలను పరిహరించేందుకే వారు ఇలా అడిగి ఉంటారు. ఒకవేళ మీరు ఇంకా విడాకులు తీసుకోకపోతే ముందు వాటి కోసం దరఖాస్తు చేయండి. ఉద్యోగులు ఎవరైనా సరే, సాధారణంగా కుటుంబ సభ్యుల నామినేషన్‌ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. మీరు దానికి అనుగుణంగా మీ వైవాహిక స్థితి మారిందని చెప్పండి. తప్పులేదు. వాళ్లూ అర్థంచేసుకుంటారు. మీకూ ఎలాంటి సమస్యా ఉండదు.

డియర్ వసుంధర

జి. వరలక్ష్మి
న్యాయవాది

మీ ప్రశ్నలు ఇకపై vasulegal@eenadu.net కు పంపించగలరు.

స్నేహితులు ఉన్నారా...

సామాజిక చొరవ, ఆటుపోట్లను తట్టుకునే శక్తి, ఆత్మవిశ్వాసం పెరగాలంటే... స్నేహితులు ఉండాలి. మీ పిల్లలు అలాంటి స్నేహితుల సంఖ్యను పెంచుకోవాలంటే... మీ వంతుగా ఏం చేయాలో చూడండి.

టీనేజీలో స్నేహితులు పెరిగే కొద్దీ... అభద్రతా భావం దూరమవుతుంది. మీ పిల్లలకు మంచి స్నేహితులు లేకపోతే కారణం తెలుసుకోండి. వారిలో ఏదైనా సమస్య ఉందనిపిస్తే గమనించి సరిచేయండి. నలుగురితో కలిసేలా ప్రోత్సహించండి. వారిలోని నైపుణ్యాలను మెరుగుపరచుకునేలా చేస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అదే స్నేహితుల సంఖ్యను పెంచేలా చేస్తుంది.

- స్నేహబంధంలో ఉద్యోగాలను సమన్వయం చేసుకోవడం మీ పిల్లలకు నేర్పించడం మంచిది. లేదంటే స్నేహితులతో కలిసున్నప్పుడు సంతోషంగా... సంబంధాలు దెబ్బతినగానే కుంగిపోవడం వంటివి మీ పిల్లలు అనుసరించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- పిల్లలకు స్నేహితులను పరిచయం చేసే ముందు మీకు మీ స్నేహితులు, ఇరుగుపొరుగు వారితో ఎలాంటి సత్సంబంధాలు ఉన్నాయో గమనించుకోండి. ఏవయినా సమస్యలుంటే సరిదిద్దుకోండి. మీ పిల్లలూ దాన్నే అనుసరిస్తారు.

నజరానా

తలనొప్పిగా ఉన్నప్పుడు శొంఠిపొడి, గంధం కలిపి ముద్దలా చేయాలి. దాన్ని నుదురుకు పట్టీలా వేస్తే... తలనొప్పి తగ్గిపోతుంది.

బంగారం వెండి

12న ముగింపు–క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	38,900	38,650	-------	38,700
ఆర్నమెంట్	36,020	36,260	-------	35,820
వెండి (కిలో)	44,800	44,575	-------	44,700
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	37,350	37,250	38,930	38,680
ఆర్నమెంట్	34,350	34,600	36,030	35,820
వెండి (కిలో)	43,000	43,500	44,800	44,600
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	38,690	38,370	-------	-------
ఆర్నమెంట్	35,990	35,690	3,603	3,582 గ్రా
వెండి (కిలో)	45,500	45,500	47.60	47.30 గ్రా

డిగ్రీ విద్యార్థులకు భవిష్యత్తు ప్రణాళిక

డిగ్రీ అడ్మిషన్లు దాదాపు పూర్తయ్యాయి. అందరూ మొదటి సంవత్సరం తరగతులకు హాజరవుతున్నారు. చాలామంది ఇక మూడు లేదా నాలుగేళ్లు గడిస్తే ఆ తర్వాతేంటో అప్పుడు ఆలోచించవచ్చు.. అనుకుంటారు. అందువల్ల విలువైన కాలాన్ని, భవిష్యత్తును నష్టపోయే అవకాశం ఉంది. డిగ్రీలో చేరగానే రిలాక్స్ కాకుండా తర్వాత ఏం చేయాలో ఇప్పుడే ఒక నిర్ణయానికి రావడం మంచిది. తగిన ప్రణాళిక తయారు చేసుకొని ఇప్పటి నుంచే సన్నద్ధమైతే కలలను సాకారం చేసుకోవచ్చు.

ముందే వేసుకోండి మూడేళ్ల ప్లాన్

TIME TO PLAN TIME TO

ఉన్నత విద్యకు, పలు ఉద్యోగాలకు కనీస అర్హత డిగ్రీ. దీనితో కలెక్టర్ ఉద్యోగాల నుంచి క్లర్కు పోస్టుల వరకు పోటీపడవచ్చు. ఎన్నో రకాల పీజీలు చేయవచ్చు. పరిశోధనలు చేసి డాక్టరేట్‌లు సంపాదించుకోవచ్చు. ఎన్ని మార్గాలు ఉన్నా... ఎవరి ఆసక్తి మేరకు వారు తమ మార్గాన్ని ముందే నిర్దేశించుకోవాలి. తగిన ప్రయత్నాలను డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే ప్రారంభించాలి. అభిరుచుల మేరకు నిపుణులు, సీనియర్ల సాయంతో స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకోవాలి. మంచి భవిష్యత్తు కోసం మూడేళ్లకు అనువైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి.

డిగ్రీ తర్వాత ముఖ్యంగా కనిపించే మార్గాలు మూడు. అవి... డిగ్రీకి అనుబంధంగా ఉన్నత విద్య కొనసాగింపు, ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరడం, ఉద్యోగ ప్రయత్నాలు. ఈ మూడింటిలో ఏదో ఒకదాన్ని నిర్ణయించుకుని అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే సన్నద్ధమైతే కెరియర్ సరైన దిశగా సాగుతుంది. సమయం వృథా కాకుండా కోరుకున్న దారిలో స్థిరపడవచ్చు. ప్రణాళిక లేకపోతే అన్ని విధాలుగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రస్తుత కోర్సులకు కొనసాగింపుగా ఉన్నత విద్యలో చేరాలనే లక్ష్యం ఉన్నవారు డిగ్రీ సిలబస్ బాగా చదవాలి. ప్రొఫెషనల్ కోర్సులు, ఉద్యోగాలు చేయాలనుకునేవారు సంబంధిత పరీక్షల వివరాలను సేకరించుకోవాలి. అందుకు అవసరమైన సబ్జెక్టుల్లో ప్రావీణ్యం సంపాదించాలి.

అనుబంధ ఉన్నత విద్య

డిగ్రీ తర్వాత పీజీ చేయాలనుకునేవారు ఇప్పుడే తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆ సబ్జెక్టు స్పెషలైజేషన్‌తో పీజీ చేయవచ్చు. ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం వల్ల చేయాలనుకుంటున్న పీజీకి తగిన సంస్థ ఏది, ప్రవేశం ఎలా తదితర వివరాలను సేకరించుకోవచ్చు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, జాతీయ ప్రాధాన్యం ఉన్న సంస్థలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అర్గనైజేషన్లను ఎంచుకుంటే పీజీలో నాణ్యమైన విద్యను పొందవచ్చు. అందుకే అవగాహనతో అడుగులేస్తే మేటి సంస్థల్లో సీటు సాధించుకోవచ్చు. పలు ఐఐటీలు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ కోర్సులను ఎమ్మెస్సీ స్థాయిలో అందిస్తున్నాయి. వాటిలో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కూడా అందుబాటులో ఉంది. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నత చదువులకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని సన్నద్ధం కావచ్చు. దేశంలోని టాప్ విశ్వవిద్యాలయాల్లో హెచ్‌సీయూ ఒకటి. సైన్స్ కోర్సులకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, బెంగళూరు, ఐఐఎస్‌ఈఆర్; హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్‌కు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూదిల్లీ; ఆంగ్లం, విదేశీ భాషలకు ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, హైదరాబాద్ ప్రఖ్యాత సంస్థలు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో బెనారస్ హిందూ యూనివర్సిటీ, దిల్లీ యూనివర్సిటీ, అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ, తేజ్‌పూర్ యూనివర్సిటీ మొదలైనవి ముందు వరుసలో ఉంటాయి. డిగ్రీ ప్రారంభం నుంచే ప్రణాళికతో ప్రయత్నిస్తే వీటిలో సీటు సంపాదించుకోవచ్చు.

ప్రొఫెషనల్ కోర్సులు

ప్రొఫెషనల్ కోర్సులు అంటే ఎంబీఏ, ఎంసీఏ, లా, బీఎడ్ మొదలైనవి. డిగ్రీలో చదివిన గ్రూపులతో సంబంధం లేకుండా ఎవరైనా వీటిలో చేరవచ్చు. ఈ కోర్సులు చదివే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఎక్కువమంది ఎంబీఏ చదవడానికి ప్రాధాన్యమిస్తున్నారు. మేనేజ్‌మెంట్ కోర్సులకు రాష్ట్రస్థాయిలో ఐసెట్, జాతీయస్థాయిలో క్యాట్, ఎక్స్‌ఏటీ, మ్యాట్... తదితర పరీక్షలెన్నో ఉన్నాయి. ఎంబీఏకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లు జాతీయ స్థాయిలో ప్రసిద్ధ సంస్థలు. క్యాట్ స్కోర్‌తో ఐఐఎంలతోపాటు జాతీయ స్థాయిలో పేరు పొందిన ప్రభుత్వ సంస్థలు, బీ-స్కూళ్లలో ప్రవేశం పొందవచ్చు. 80 పర్సంటైల్ సాధించివారికి మంచి బిజినెస్ స్కూల్‌లో సీటు లభిస్తుంది. వీటిలో కోర్సు పూర్తి చేస్తే ఆకర్షణీయ వేతనంతో ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు. డిగ్రీ ప్రథమ సంవత్సరం నుంచి సన్నద్ధమైన వారు క్యాట్‌లో 80 పర్సంటైల్ పొందడం సాధ్యమే. అందుకే మేనేజ్‌మెంట్ కోర్సులు లక్ష్యమైతే క్యాట్‌పై గురి పెట్టాలి. ఎంసీఏ చదవాలనుకున్నవారు ఎన్ఐటీలు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సీటు కోసం నిమ్‌సెట్ పరీక్ష రాసుకోవచ్చు. డిగ్రీ అనంతరం లా కోర్సుల్లో చేరాలనుకున్నవారికి జాతీయ స్థాయిలో దిల్లీ యూనివర్సిటీ మేటి సంస్థ. రాష్ట్రస్థాయి సంస్థల్లో లాసెట్ ద్వారా అవకాశం లభిస్తుంది. బీఎడ్‌కి ఆర్ఐఈ, మైసూరు; అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం తదితరాలు పేరున్న సంస్థలు. ప్రసిద్ధ సంస్థల్లో సీటు కోసం మంచి ర్యాంకు సాధించడానికి ఇప్పటి నుంచే సిద్ధం కావడం వల్ల ఆశించిన ప్రయోజనం దక్కుతుంది.

ఉద్యోగాల దిశగా...

డిగ్రీ అనంతరం ఉద్యోగాన్ని ఆశించేవారికి జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు అత్యున్నతమైనవి. కేంద్రంలోని వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి నిర్వహించే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షకు పోటీ పడవచ్చు. జాతీయ బ్యాంకుల్లో క్లర్క్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఐబీపీఎస్ నిర్వహించే క్లరికల్, పీవో పరీక్షలకు ప్రిపేర్ కావచ్చు. రాష్ట్ర స్థాయిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ జరిపే గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు హాజరుకావచ్చు. యూనిఫాం ఉద్యోగాలు కోరుకునేవారికి డిగ్రీ అర్హతతో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు మంచి అవకాశం. తరచూ రైల్వేలు నిర్వహించే స్టేషన్ మాస్టర్, గూడ్స్ గార్డు, క్లర్క్..తదితర పోస్టుల పరీక్షలకూ డిగ్రీనే కనీస విద్యార్హత. ఇలా పలు రకాల ఉద్యోగాలు ఉన్నాయి. వాటిలో ఆసక్తి ఉన్నవాటిని ఎంచుకొని డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే సిద్ధమైతే త్వరగా ఉద్యోగాన్ని సంపాదించుకోవచ్చు.

రైల్వే, బ్యాంక్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ప్రభుత్వ బీమా కంపెనీలు తదితర ఉద్యోగ పరీక్షలన్నింటికీ సిలబస్ దాదాపు ఒకే రకంగా ఉంటుంది. అందువల్ల ఒకదానికి సన్నద్ధమైనా మిగతా పరీక్షలన్నీ రాసుకోవచ్చు. గ్రూప్-1, సివిల్స్ లక్ష్యంగా పెట్టుకుంటే సిలబస్‌కు అనుగుణంగా సమకాలీన అంశాలను గమనిస్తూ అధ్యయనం చేయాలి. ఆర్ట్స్ కోర్సులు అంటే హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, జాగ్రఫీ తదితర సబ్జెక్టులను డిగ్రీలో చదువున్నవారికి చాలా వరకు ఆ సిలబస్ పోటీ పరీక్షల్లో ఉండటం కొంత కలిసొస్తుంది. వీరు సైన్స్ సబ్జెక్టులపై దృష్టి సారించాలి. అభ్యర్థులు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రాథమికాంశాలపై పట్టు పెంచుకోవడం డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి ప్రారంభించాలి.

జాతీయ స్థాయి ప్రవేశపరీక్షలు

జామ్: సైన్స్ కోర్సుల్లో పీజీ చేయాలనుకునేవారు దృష్టి సారించాల్సిన పరీక్ష జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ (జామ్). దీనిద్వారా ఐఐటీలు, ఐఐఎస్‌సీ, ఐఐఎస్‌ఈఆర్‌లు, ఎన్ఐటీల్లో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పీహెచ్‌డీ కోర్సుల్లోకి ప్రవేశం లభిస్తుంది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ, బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ తదితర పీజీ కోర్సుల్లో చేరవచ్చు. సాధారణ డిగ్రీతో ఐఐటీ కల నెరవేర్చుకోవడానికి జామ్ చక్కని దారి. వాటి తర్వాత భవిష్యత్తులో పరిశోధనల దిశగా అడుగులేయవచ్చు.

సీఈఈబీ: బయోటెక్నాలజీలో ఉన్నత విద్య సాగించాలని కోరుకునేవారు కంబైన్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఫర్ బయోటెక్నాలజీ (సీఈఈబీ) పై దృష్టి పెట్టవచ్చు. జేఎన్‌యూ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ పరీక్షను నిర్వహిస్తుంది. జేఎన్‌యూ, హెచ్‌సీయూతోపాటు 40కి పైగా సంస్థల్లో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ కోర్సుల్లోకి ఈ పరీక్ష స్కోరు ద్వారా ప్రవేశం లభిస్తుంది. కోర్సుల్లో చేరినవారికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ నెలకు రూ.5000 స్టయిపెండ్ అందిస్తుంది.

సీయూసెట్: కొత్తగా ఏర్పడిన కేంద్రీయ విశ్వవిద్యాలయాలు సెంట్రల్ యూనివర్సిటీస్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు (సీయూసెట్) పేరుతో పరీక్ష నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వివిధ సబ్జెక్టుల్లో ఎంఏ, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సహా 14 సెంట్రల్ యూనివర్సిటీలు, బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ప్రవేశాలు సీయూసెట్‌తో జరుపుతారు.

ఐఎస్ఐ: ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ)- కోల్‌కతా, దిల్లీ, బెంగళూరు, చెన్నైల్లో రెండేళ్ల మాస్టర్ ఆఫ్ స్టాటిస్టిక్స్, మాస్టర్ ఆఫ్ మ్యాథమాటిక్స్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ కోర్సుల్లో ప్రవేశానికి ఏటా జాతీయస్థాయిలో పరీక్ష నిర్వహిస్తుంది. వీటిల్లో చేరితే నెలకు రూ.5000 చొప్పున స్టయిపెండ్ అందుకోవచ్చు. ఏ విభాగంలో పీజీ ఎంచుకుంటారో దాన్ని డిగ్రీ స్థాయిలో ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

జెస్ట్: జాయింట్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్టు (జెస్ట్)తో ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పీహెచ్‌డీ కోర్సుల్లో చేరవచ్చు. స్టయిపెండ్ ఇస్తారు. ఫిజిక్స్, మ్యాథ్స్‌లతో డిగ్రీ చేస్తున్నవారు ఈ పరీక్షకు హాజరుకావచ్చు. సిలబస్ వివరాలను చూసుకొని ముందు నుంచి సన్నద్ధం కావడం మంచిది.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

నైపర్ అహ్మదాబాద్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైపర్), అహ్మదాబాద్... రెగ్యులర్/ కాంట్రాక్టు ప్రాతిపదికన ఫ్యాకల్టీ, నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: ఫ్యాకల్టీ-28, నాన్ ఫ్యాకల్టీ-25
పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అకౌంటెంట్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ తదితరాలు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: సెప్టెంబరు 8
హార్డు కాపీలను పంపడానికి చివరితేదీ: సెప్టెంబరు 23
వెబ్‌సైట్: https://niperarecruitments.in/

దిల్లీ హైకోర్టు

దిల్లీ హైకోర్టు.. డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: డ్రైవర్ (షాఫర్)
ఖాళీలు: 35
అర్హత: మెట్రిక్/ హయ్యర్ సెకండరీ ఉత్తీర్ణత, లైట్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్, రెండేళ్ల అనుభవం.
వయసు: 18-27 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: ప్రిలిమినరీ పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తు: ఆగస్టు 14 నుంచి సెప్టెంబరు 5 వరకు
వెబ్‌సైట్: www.delhihighcourt.nic.in

ప్రవేశాలు

మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ

నాగ్‌పూర్‌లోని మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ... ఇతర వర్సిటీల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న సర్టిఫికెట్, పీజీ డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
కోర్సులు: సర్టిఫికెట్ - శాస్త్రీక్ మెథడ్ ఆఫ్ ఆర్బ్యుమెంటేషన్ (3 నెలలు), పీజీ డిప్లొమా - ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్, ఫ్యామిలీ డిస్ప్యూట్ రిజల్యూషన్, ఎనర్జీ లాస్ అండ్ పాలసీ (ఏడాది).
అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్
చివరితేదీ: ఆగస్టు 27
వెబ్‌సైట్: www.nlunagpur.ac.in

అప్రెంటిస్‌షిప్

హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్

రాంచీ (ఝార్ఖండ్)లోని హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్... అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● **అప్రెంటిస్ ట్రైనీ**
ఖాళీలు: 126
ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, టర్నర్, ప్లంబర్ తదితరాలు.
అర్హత: ఎనిమిదో తరగతి, పదోతరగతి, ఐటీఐ ఉత్తీర్ణత.
వయసు: 14-40 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: ఆగస్టు 26
వెబ్‌సైట్: www.hecltd.com

ఎస్‌సీటీఐఎంఎస్‌టీ, తిరువనంతపురం

తిరువనంతపురంలోని శ్రీ చిత్ర తిరునాళ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ (ఎస్‌సీటీఐఎంఎస్‌టీ)... అప్రెంటిస్ ఖాళీల భర్తీకి వాక్‌ఇన్ నిర్వహిస్తోంది.

● **జనరల్ అప్రెంటిస్**
ఖాళీలు: 10
కాలవ్యవధి: ఒక ఏడాది
స్టైపెండ్: నెలకు రూ.7000
అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
వయసు: 35 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
వాక్‌ఇన్ తేదీ: ఆగస్టు 21
వెబ్‌సైట్: www.sctimst.ac.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

కామర్స్‌లో తమ సత్తా చాటాలనుకునేవారికి ఓ మంచి అవకాశం. ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) టాలెంట్ టెస్ట్ ద్వారా ఆ అవకాశాన్ని కల్పిస్తోంది. స్కూలు స్థాయి నుంచి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ చేస్తున్నవారెవరైనా దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రకటన విడుదలైంది.

ఐసీఏఐ- కెరియర్ కౌన్సెలింగ్ గ్రూపు (సీసీజీ) ఐసీఏఐ కామర్స్ విజర్డ్- 2019 పేరుతో ఈ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తోంది. కామర్స్ విద్యకు ప్రాచుర్యం కల్పించడం, విద్యార్థిలోని కాన్సెప్టు అర్థం చేసుకోగల సామర్థ్యాన్ని అంచనా వేయడం ఈ టెస్ట్ ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా విద్యార్థికి సబ్జెక్టు ఎంతవరకూ తెలుసో కాకుండా ఒక్కో కాన్సెప్టును ఏమేరకు అర్థం చేసుకున్నాడో పరీక్షిస్తారు.

తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు, బీకాం, బీబీఏ, బీఎంఎస్, సంబంధిత విభాగానికి చెందిన అభ్యర్థులెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. దూరవిద్యను అభ్యసించేవారూ అర్హులే.

రెండు దశలు

రెండు దశల్లో విద్యార్థిని పరీక్షిస్తారు. రెండూ ఆన్‌లైన్ విధానంలోనే ఉంటాయి. లెవల్-1ను విద్యార్థి తమ ల్యాప్‌టాప్/ డెస్క్‌టాప్ ద్వారా నచ్చిన ప్రదేశంలో పరీక్ష నిర్వాహకుల నిబంధనల మేరకు రాయాల్సి ఉంటుంది. సిస్టమ్‌కు సంబంధించి కొన్ని ప్రమాణాలు (ఓఎస్, ప్రాసెసర్, ర్యామ్, బ్రౌజర్, ఇంటర్నెట్ స్పీడ్‌లకు సంబంధించినవి) ఉండటం తప్పనిసరి. దీనిలో ఎంపికైన వారికి లెవల్-2 నిర్వహిస్తారు.

లెవల్-1లో ప్రతి తరగతి నుంచి 800 మందిని లేదా హాజరైనవారిలో 10% మందిని లెవల్-2కు ఎంపిక చేస్తారు. లెవల్-2 కూడా ఆన్‌లైన్ పరీక్షే. దీనిని సంస్థ కొన్ని టెస్ట్ సెంటర్లలో నిర్వహిస్తుంది. పరీక్ష ఆంగ్లంలోనే ఉంటుంది. సీబీఎస్‌ఈ/ ఐసీఎస్‌ఈ, నేషనల్, స్టేట్ బోర్డులు, సెకండరీ, సీనియర్ సెకండరీ పరీక్షలకు సరిపోయేలా ఉంటుంది. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 100 ప్రశ్నలకు 75 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది.

లెవల్-1లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపెంట్ సర్టిఫికెట్ ఇస్తారు. లెవల్-2లో ప్రథమ ర్యాంకు సాధించిన వారికి రూ.లక్ష, ద్వితీయ ర్యాంకు వారికి రూ.50,000, మూడో బహుమతిగా రూ.25,000 ఇస్తారు. వీటిని తొమ్మిది, పది, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలవారు, డిగ్రీ (బీకాం/ బీబీఏ /బీఎంఎస్/ సంబంధిత విభాగాలు) వారికి విడివిడిగా అందజేస్తారు. టాప్ 200 మందికి సర్టిఫికెట్‌తోపాటు రూ.500 చొప్పున కన్సోలేషన్ బహుమతులుంటాయి. వీరిని కూడా ప్రతి తరగతి నుంచీ ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫీజు రూ.100. విద్యార్థి సొంతంగా అయినా, విద్యా సంస్థ తరపున అయినా దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవడానికి చివరితేదీ: డిసెంబరు 24, 2019 **లెవల్-1 పరీక్ష తేదీ:** జనవరి 5, 2020 (తరగతులను బట్టి పరీక్ష సమయాల్లో తేడాలుంటాయి)

లెవల్-2 పరీక్ష తేదీ: జనవరి 19, 2020

http://icaicommercewizard.org/

వాగు గండం గట్టెక్కారు!

వానాకాలంలో ఏజెన్సీ మండలాల్లో వైద్యం కోసం గర్భిణులకు కష్టాలు తప్పటం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రోళ్లగడ్డ పంచాయతీ కన్నాయిగూడెం వద్ద మల్లన్న వాగులో వరద పారుతోంది. ఇక్కడ ద్విచక్ర వాహనాలు అతికష్టం మీద వెళ్తున్నాయి. మిగతా వాహనాలకు ఇబ్బందికరంగా మారింది. గ్రామానికి చెందిన కల్తి నిర్మలకు ఆదివారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు సంజీవని వాహనానికి సమాచారం అందించారు. వాహనం వాగు వద్దకు వచ్చింది. నిర్మలను ఇంటి నుంచి వాగువద్దకు ఆటోలో తీసుకెళ్లారు. అనంతరం కుటుంబసభ్యులు చేతుల మీద మోసుకుంటూ అవతలి ఒడ్డుకు చేర్చారు. తర్వాత వాహనంలో గుండాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చిన్నారికి జన్మనిచ్చారు. వైద్య సేవలు అందించిన అనంతరం తల్లి, శిశువును సోమవారం మళ్లీ చేతులమీదుగానే వాగును దాటించి స్వగ్రామానికి తరలించారు. వాగుపై వంతెన పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, గుండాల

జలాశయాలన్నీ పోటెత్తుతుంటే.. నిజాంసాగర్ ఆటెత్తుతోంది!

రాష్ట్రంలో జలాశయాలన్నీ పొంగిపొర్లుతున్నా... కామారెడ్డి జిల్లాలోని మంజీరా నదిపై ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు మాత్రం మైదానంలా కనిపిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి ఈ ఏడాది చుక్క నీరు రాలేదు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 17.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.13 టీఎంసీనే ఉంది. నెలవుల సమయంలో ఇక్కడికి వచ్చే పర్యాటకులు ప్రాజెక్టు లోపల క్రికెట్ ఆడుతున్నారు.

– న్యూస్‌టుడే, నిజాంసాగర్

నాగార్జున సాగర్

కృష్ణవేణి కరుణించింది.. ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహం.. దానికితోడు పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పొంగిపొర్లుతోంది!
తూర్పుకొండలు పచ్చటి పావడా కట్టుకుని నల్లటి కృష్ణమ్మకు స్వాగతం పలుకుతుండగా.. ఆ ఘట్టాన్ని చూడడానికి దట్టమైన నల్లటి మేఘాలు నేల మీదకు దిగిపోయాయన్నట్లుగా ఉండే సుందరదృశ్యం.. నాగార్జున సాగర్ ప్రాజెక్టు గేట్లన్నీ ఎత్తివేయడంతో అంతవరకు శివుని జటాఝూటంలో చిక్కుకున్న గంగమ్మ ఒక్కసారిగా బయటకు ఉరికినట్లు ప్రవాహం వెల్లువెత్తగా తెలుగురాష్ట్రాలు పులకించి పోతున్నాయి..

- పదేళ్ల అనంతరం సాగర్ అన్ని గేట్ల ఎత్తివేత
- ఆగస్టులో నీటి విడుదల పదకొండేళ్లలో తొలిసారి
- ఎగువ నుంచి 7.6 లక్షల క్యూసెక్కులకు పైగా ప్రవాహం
- మరో రెండు రోజుల పాటు వరద
- కృష్ణాకు తోడైన తుంగభద్ర
- శ్రీశైలానికి పది లక్షలకు పైగా క్యూసెక్కుల రాక
- పులిచింతలకు భారీ వరద
- పుష్కర ఘాట్‌లో ఈతకు వెళ్లి ఒకరి గల్లంతు

నాగార్జునసాగర్ అన్ని గేట్లను ఎత్తడంతో కిందికి దూకుతున్న నీరు

ఈనాడు, నల్గొండ, హైదరాబాద్, విజయపురిసౌత్ (గుంటూరు), న్యూస్‌టుడే: రెండు తెలుగురాష్ట్రాలకు వరప్రదాయిని అయిన నాగార్జునసాగర్ నిండుకుండలా మారింది. ప్రవాహం అంతకంతకూ పెరుగుతుండడంతో పదేళ్ల తర్వాత సోమవారం మొత్తం గేట్లు అన్నింటినీ ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. మొదట ఉదయం 7.25 గంటలకు 4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల ప్రారంభించారు. కొద్దిసేపటికే మరో రెండు.. ఆ తర్వాత మరికొన్ని చొప్పున మొత్తం 26 గేట్లనూ ఎత్తేశారు. సాగర్‌కు సోమవారం సాయంత్రానికి దాదాపు 7.6 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. కృష్ణా ప్రవాహానికి తుంగభద్ర తోడయింది. శ్రీశైలం ఎగువన రెండు నదుల ప్రవాహం కలిపి 10 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. జూరాల నుంచి దిగువకు 8.21 లక్షల క్యూసెక్కులు, తుంగభద్ర నది నుంచి సుంకేశుల బ్యారేజీ వద్ద 2.08 లక్షల క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. ఈ ప్రవాహమంతా శ్రీశైలం జలాశయానికి పరుగులు పెడుతోంది. ఎగువన ఆలమట్టి వద్ద 5.5 లక్షలు, నారాయణపూర్ వద్ద 5.90 లక్షలకు పైగా ప్రవాహాలు ఉన్నాయి. జూరాల వద్ద 8.5 లక్షల క్యూసెక్కుల వరద నమోదు అవుతోంది. భీమా నదిలోనూ లక్ష క్యూసెక్కుల ప్రవాహం దిగువకు వస్తోంది. ఇవన్నీ కలిసి శ్రీశైలం జలాశయానికి పెద్దఎత్తున పోటెత్తుతున్నాయి. అక్కడి నుంచి దిగువకు 8.26 లక్షల క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. వరద అంతకంతకూ పెరగడంతో సాయంత్రానికి మొత్తం సాగర్‌కున్న మొత్తం 26 గేట్లనూ 12 అడుగుల మేర ఎత్తి 3.27 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. విద్యుదుత్పత్తి, ఎడమ కాల్వ, ఎలిమినేటి మాధవ రెడ్డి ప్రాజెక్టుకు కలిపి మరో 40 వేల క్యూసెక్కుల నీరు కిందకు వెళుతోంది. ప్రాజెక్టుకు ఉన్న మొత్తం 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడం 2009 తర్వాత ఇదే తొలిసారి. అలాగే గోదావరి నుంచి ధవళేశ్వరం ఆనకట్ట వద్ద 12 లక్షల క్యూసెక్కులు సముద్రంలో కలుస్తున్నాయి.

సాగర్ సంగతులివి..

- సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు - 312 టీఎంసీలు.
- కృష్ణా నదికి భారీ వరదలొచ్చిన 2009లో సాగర్ నీటిమట్టం 549 అడుగులు ఉన్నప్పుడే నీటిని దిగువకు విడుదల చేశారు.
- ఇప్పుడు సాగర్ నీటిమట్టం 557 అడుగులు ఉన్నప్పుడు ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తడం గమనార్హం.
- సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 566.60 (246 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉంది.

పదకొండేళ్లలో ఇదే తొలిసారి

- రెండు నెలల నుంచి వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న అన్నదాతలు ఈ ఏడాది ఆగస్టులోనే సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు రెండో వారంలోనే కాల్వలకు, క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడం 2008 తర్వాత ఇదే తొలిసారి.
- అప్పుడు భారీ వర్షాలతో కృష్ణా బేసిన్‌లో వరదలు రావడంతో ఆగస్టు తొలి వారంలోనే నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తామని అధికారులు తెలిపారు.
- ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో గతేడాది సెప్టెంబరు 2న రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు.
- వచ్చే రెండు మూడు రోజుల్లో కృష్ణా బేసిన్‌కు 130 టీఎంసీల వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు ఎన్నెస్పీ చీఫ్ ఇంజినీరు నర్సింహ వెల్లడించారు.
- ఈ ప్రవాహం ఇలాగే రెండు రోజులు స్థిరంగా కొనసాగితే రానున్న 36 గంటల్లో సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంటుందన్నారు.

పులిచింతలను తాకిన కృష్ణమ్మ

సాగర్ నుంచి అన్ని క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటం.. కింద ఉన్న టెయిల్‌పాండ్ ప్రాజెక్టు గేట్లను సైతం ఎత్తడంతో కృష్ణమ్మ పులిచింతల వైపు పరుగులు పెడుతోంది. పులిచింతల ప్రాజెక్టుకు సోమవారం సాయంత్రానికి 2.4 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. మొత్తం 45 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటుందని, అక్కడి నుంచి ప్రకాశం బ్యారేజీ వైపు కృష్ణమ్మ పరుగులు పెట్టనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

సాగర్‌లో పర్యాటకుల సందడి

పదేళ్ల అనంతరం సాగర్ అన్ని గేట్ల ఎత్తి నీటిని దిగువకు వదులుతుండడంతో ఆ సుందర జలదృశ్యాన్ని చూడడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఘాట్‌రోడ్లపై ఎటు చూసినా కార్లే కనిపిస్తున్నాయి. కృష్ణమ్మ పరవళ్ల సుందర దృశ్యాలు మరో వారం పాటు ఉండే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

కర్నూలు నగరాన్ని తాకిన వరద

ఈనాడు డిజిటల్, కర్నూలు: ఒకవైపు కృష్ణా జలాలు, మరోవైపు తుంగభద్ర జలాశయం నుంచి వరదనీరు పోటెత్తుతుండడంతో కర్నూలు నగర ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శ్రీశైలం వెనుక జలాలు నగరంలోని జమ్మి చెట్టు ప్రాంతాన్ని తాకడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సంకలబాగ్ సమీపంలో గంగమ్మ తల్లి దేవాలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది.

కృష్ణాగోదావరి బేసిన్లలోని ప్రాజెక్టుల్లో సోమవారం నాటి నీటి నిల్వలు, ప్రవాహాల వివరాలు

ప్రాజెక్టు పేరు	పూర్తిస్థాయి నీటినిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటినిల్వ (టీఎంసీల్లో)	వస్తున్న ప్రవాహం (క్యూసెక్కుల్లో)	దిగువకు విడుదల (క్యూసెక్కుల్లో)
కృష్ణా పరీవాహకం				
ఆలమట్టి	129.72	101.03	5,70,700	5,40,000
నారాయణపూర్	37.64	26.27	5,90,000	5,99,000
ఉజ్జయిని	117.24	117.24	67,964	1,05,950
జూరాల	9.66	5.76	8,34,000	8,26,855
తుంగభద్ర	100.86	88.66	2,44,003	2,12,635
శ్రీశైలం	215.81	193.41	8,19,254	8,48,673
నాగార్జునసాగర్	312.05	242.24	7,89,094	3,67,580
పులిచింతల	45.77	5.95	3,10,940	25,000
ప్రకాశం బ్యారేజీ	3.07	2.66	10,021	10,021
గోదావరి పరీవాహకం				
సింగూరు	29.91	0.46	00	20
నిజాంసాగర్	17.80	0.14	--	10
శ్రీరామసాగర్	90.31	16.35	2,960	389
మధ్యమానేరు	25.87	3.55	--	83
దిగువ మానేరు	24.07	3.53	--	204
కడెం	7.60	6.84	4,089	4,980
ఎల్లంపల్లి	20.18	19.53	5,570	5,570
ధవళేశ్వరం	2.93	3.18	12,33,035	12,23,035

నాగార్జునసాగర్ దిగువన వ్యక్తి గల్లంతు

నర్సింహ

జహీరాబాద్, న్యూస్‌టుడే: సాగర్ జలాశయం గేట్లు తెరవడంతో స్నేహితులతో కలిసి చూడడానికి వెళ్లిన ఒక వ్యక్తి అనూహ్యంగా నదిలో గల్లంతయ్యాడు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఆర్యనగర్‌కు చెందిన నర్సింహ(45), అతడి స్నేహితులు సోమవారం తెల్లవారుజామున సాగర్ చూసేందుకని వాహనంలో బయలుదేరి మధ్యాహ్నానికి అక్కడికి చేరుకున్నారు. నీటిని చూసిన ఉత్సాహంలో స్నానం చేయడానికని పుష్కరఘాట్‌లోకి దిగారు. నర్సింహకు ఈత వచ్చినా.. ఎగువనుంచి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ఉద్ధృతికి తాళలేక అందరూ చూస్తుండగానే నీటిలో కొట్టుకుపోయాడు. కొంతసేపు ఒడ్డుకు చేరడానికి చేసిన అతడి ప్రయత్నాలు ఫలించలేదు. గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలించినా సాయత్రం వరకు ఆచూకీ లభించలేదు.

నారాయణపేట జిల్లా కృష్ణా మండలం హిందూపూర్ వద్ద వరద పరిస్థితిని పవర్ బోట్‌లో వెళ్లి పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్‌రావు, ఎస్పీ చేతన

వదలని వరదలు

- ముంచుకొచ్చిన కొండచరియల ముప్పు
- జమ్మూ-కశ్మీర్, ఉత్తరాఖండ్‌లలో 9 మంది మృతి
- కేరళలో ఇంకా తెలియరాని కూరుకుపోయిన వారి ఆచూకీ

దిల్లీ: దేశంలో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు సోమవారం కాస్త తెరిపినివ్వడంతో వరద తాకిడి ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. మరోవైపు పలు రాష్ట్రాల్లో కొండచరియలు విరిగిపడుతుండడంతో విపత్తు తీవ్రత పెరిగింది. జమ్మూ-కశ్మీర్, ఉత్తరాఖండ్‌లలో కొండచరియల కింద చిక్కుకొని తొమ్మిది మంది మరణించారు. జమ్మూ ప్రాంతంలోని రెసాయి జిల్లాలో బండలు పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో మూడు చోట్ల కొండచరియలు విరిగిపడి ఆరుగురు చనిపోయారు. వరదలు చుట్టుముట్టిన కేరళ, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రల్లో మృతుల సంఖ్య 200కు పెరిగింది. కేరళలో వరద ముప్పు పూర్తిగా తొలగిపోలేదు. మృతుల సంఖ్య 83కు చేరుకుంది. మలప్పురం, వయనాడ్ జిల్లాల్లో కొండచరియలు కూలడంతో కనిపించకుండా పోయిన 58 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. గుజరాత్‌లోని కచ్ జిల్లా, సౌరాష్ట్ర ప్రాంతాల్లో భారీగా నష్టం సంభవించింది.

వీడని పేగుబంధం!

ముంచెత్తిన వరద బురద, విరిగిపడిన కొండచరియ తాలూకు మట్టిపెళ్లలను తొలగించి సహాయ చర్యలు చేపడుతున్న సిబ్బంది ఆదివారం ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. ఏడాదిన్నర కుమారుడి లేత చేతిని అమ్మ గట్టిగా పట్టుకున్న స్థితిలోనే విగతజీవులై ఉన్న ఆ తల్లీ బిడ్డల స్థితిని చూసి చలించిపోయారు. దయనీయమైన ఈ ఘటన కేరళలోని కొట్టక్కున్నులో ఆదివారం చోటు చేసుకుంది. శుక్రవారం ఆకస్మికంగా వచ్చిన వరద, ఆపై విరిగిపడ్డ మట్టిపెళ్లల్లో గీతు (21), ఆమె ఒకటిన్నర ఏళ్ల కుమారుడు ధ్రువ్ చిక్కుకున్నారు. ప్రాణాలతో బైటపడటం అసాధ్యమని ఆమెకు అర్థమైంది. అయినాసరే బిడ్డ చేతిని విడువ లేదు. ఇద్దరూ అదే స్థితిలో ప్రాణాలు విడిచారు. ఆమె భర్త శరత్ ఈ ప్రమాదం నుంచి తప్పించుకోగా, అత్త సరోజిని బురదలో కూరుకుపోయారు.

వరదను ఎదురీది.. వెండి పతకం పొంది..

విజయం సాధించాలన్న పట్టుదల ముందు వరద ఉద్ధృతి ఏపాటి? వరదకు ఎదురీది 19 ఏళ్ల కర్ణాటక బాక్సర్ వెండి పతకాన్ని పొందడం అందరి ప్రశంసలు అందుకుంటోంది. బెలగావి జిల్లాలోని మన్నూర్ గ్రామం వరద ముంపునకు గురయింది. ఆ గ్రామానికి ఉన్న మూడు రోడ్లూ మునిగిపోయాయి. అదే గ్రామానికి చెందిన యువ బాక్సర్ నిశాన్ మనోహర్ కదమ్ బెంగళూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనాల్సిన సమయం కూడా దగ్గరపడింది. ఈ నెల ఏడో తేదీన బెంగళూరు వెళ్లే రైలు ఎక్కితేగానీ పోటీలో పాల్గొనే అవకాశం దక్కదు. మరోవైపు ఊరు దాటే పరిస్థితి కనిపించలేదు. కుమారుని ఉత్సాహాన్ని గమనించిన తండ్రి వరద ప్రవాహంలో ఈదుకుంటూ వెళ్లామని ధైర్యం చెప్పాడు. ఇద్దరూ కలిసి సాయంత్రం 3.45 గంటల సమయంలో సాహస ఈతను ప్రారంభించారు. 2.5 కి.మీ. దూరాన్ని 45 నిమిషాల్లో ఈది ఆవలి ఒడ్డుకు చేరుకొని, సకాలంలో బెంగళూరు రైలును అందుకోగలిగారు. నిశాన్ పోటీలో ప్రతిభ చూపి కష్టానికి ప్రతిఫలం దక్కించుకున్నాడు.

కన్నడనీమ కకావికలం

ఈనాడు డిజిటల్, బెంగళూరు: భారీ వర్షాలు, వరదలతో తల్లడిల్లిన కర్ణాటక సోమవారం కాస్త ఊపిరి పీల్చుకుంది. ఉద్ధృతి కాస్త తగ్గినా మరో 3రోజులు వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించటంతో బాధితులను పునరావాస కేంద్రాలను వీడవద్దని ప్రభుత్వం హెచ్చరించింది. ఇప్పటివరకు 42 మంది చనిపోయారని, 40 మంది జాడ తెలియలేదని పేర్కొంది. వరదల్లో ఇల్లు కోల్పోయినవారికి రూ.5లక్షల తక్షణ పరిహారం అందించనున్నట్లు ముఖ్యమంత్రి యడియూరప్ప ప్రకటించారు. కొత్తగా ఇళ్లు నిర్మించేవరకు నెలకు రూ.5వేల వరకు బాడుగ భత్యంగా చెల్లించనున్నామని తెలిపారు.

విదేశీయులు సురక్షితం

తుంగభద్ర దిగువన విరుపాపురగడ్డ పర్యాటక కేంద్రంలో చిక్కుకున్న దేశవిదేశీ పర్యాటకులను సోమవారం సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జలాశయం నీరు వీరి ఆవాసాలను చుట్టేసింది. ఎన్‌డీఆర్ఎఫ్, సైనిక బృందం రంగంలోకి దిగి వీరిని కాపాడాయి.

భారీ వర్షాల ధాటికి కొండచరియలు విరిగిపడటంతో కర్ణాటకలోని చిక్కమగళూరులో ధ్వంసమైన ఓ ఇల్లు. పాక్షికంగా బురదలో కూరుకుపోయిన జీపు

పాలమూరుకు పోటెత్తుతున్న వరద

భీమా, తుంగభద్రలకు పెరిగిన ఇన్‌ఫ్లో

మహబూబ్‌నగర్, ఈనాడు డిజిటల్: ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలవారిని వరద భయం వెన్నాడుతోంది. కృష్ణా, భీమా, తుంగభద్రలో వరద ఉద్ధృతి పెరుగుతుండటంతో చాలాచోట్ల తీర ప్రాంత ప్రజలు గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. మరికొన్ని గ్రామాల్లో అవసరమైతే ఇళ్లు ఖాళీ చేయడానికి సిద్ధంగా ఉండాలంటూ అధికారులు దండోరా వేయిస్తున్నారు. నారాయణపేట జిల్లాలోని తీరగ్రామాలను వరద జలాలు తాకుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కృష్ణా మండలంలోని హిందూపూర్, వాసూనగర్, మందిపల్లి, గుర్జాలకు వరదనీరు వచ్చింది. ఈ నాలుగు గ్రామాల్లోని 319 కుటుంబాలను కున్సిలో ఏర్పాటు చేసిన నిరాశ్రయ కేంద్రానికి తరలించగా, 957 మంది ఆశ్రయం పొందుతున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని దత్తక్షేత్రం 10 అడుగుల వరకు మునిగిపోయింది. గద్వాల మండలంలో కృష్ణా నది మధ్యలో ఉండే గుర్రంగడ్డ గ్రామం చుట్టూ నీరు చేరడంతో 1000 మంది గ్రామస్థులకు బయటి ప్రపంచంతో రవాణా సంబంధాలు తెగిపోయాయి.

ఫోన్ మాట్లాడుతూ వరదలో చిక్కుకున్న వ్యక్తి

రాజోలి, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన సయ్యద్ వలి సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి గ్రామం పక్కన ఉన్న సుంకేసుల డ్యాంలో చిక్కుకోవడంతో స్థానిక జాలర్లు కాపాడారు. స్నానానికని వెళ్లిన అతడు డ్యాం వైపు చూడకుండా ఫోన్ మాట్లాడుతూ ఉండిపోయాడు. డ్యాం నుంచి నీటిని విడుదల చేయటంతో ఒక్కసారిగా వరద చుట్టుముట్టింది. ఓ బండరాయి మీదకు చేరుకున్న అతడిని జాలర్లు కాపాడారు.

కోజికోడ్‌లోని థామ్రస్సేరీలో వరద బాధిత మహిళను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

వయనాడ్‌లోని పుథుమలాలో కొండచరియలు విరిగిపడిన స్థలంలో మృతదేహాల కోసం గాలింపు నిర్వహిస్తున్న సహాయక సిబ్బంది

బాహుబలి నాలుగో పంపు వెట్‌రన్ విజయవంతం

రామడుగు, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టు ఎనిమిదో ప్యాకేజీలో భాగంగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ పంపుహౌస్‌లోని బాహుబలి నాలుగో పంపు వెట్‌రన్ విజయవంతమైంది. సోమవారం రాత్రి 9.30 గంటలకు నాలుగో పంపు నుంచి 3100 క్యూసెక్కుల జలాలను ఎత్తిపోసి ఎస్సారెస్పీ వరద కాలువలోకి వదిలారు. మధ్యాహ్నం నుంచి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున చేరుకుని వెట్‌రన్ కోసం ఎదురుచూశారు. సాంకేతిక కారణాలతో ఆలస్యం కావడంతో అంతా వెళ్లిపోయారు. చివరికి రాత్రివేళ వెట్‌రన్ నిర్వహించారు. ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రి కార్యాలయానికి వెట్‌రన్ విజయవంతమైనట్లు సమాచారమిచ్చారు. దీంతో సీఎం కేసీఆర్ ఫోన్‌లో అభినందించినట్లు వెల్లడించారు. ఎత్తిపోతల నీటిని ఎస్సారెస్పీ వరదకాలువ ద్వారా మధ్యమానేరుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. ఈఈ నూనె శ్రీధర్, డీఈ గోపాలకృష్ణ, ఏఈ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సింబా.. చూడు.. సూర్యకిరణాలు పడే ప్రతీ చోటూ మన రాజ్యమే'

- అంటూ 'ద లయన్ కింగ్' సినిమాలో యువరాజుకు రాజు ముఫాసా చెబుతుంటే.. ఎవరికైనా రోమాలు నిక్కబొడుచుకుంటాయి.

ముకేశ్ అంబానీ తమ ఫైబర్ సేవల ఆరంభంలో ఈ దృశ్యాన్నే చూపి, తమ కంపెనీ బ్రాడ్‌బ్యాండ్ ప్రణాళిక ఎంతటి శక్తిమంతమైందో చాటారు. మూడేళ్లలోనే జియో మొబైల్ కనెక్షన్లు 34 కోట్లను చేరగా, అత్యధిక వేగం బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించే జియో ఫైబర్ కూడా ప్రతి ఇంటికీ చేరేలా పథక రచన చేసి, అధికారిక ప్రకటన చేశారు. కంపెనీ రుణభారాన్ని తీర్చేందుకు తొలిసారిగా తమ సంస్థల్లో వాటాలు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. కొత్త సేవల గురించి ముకేశ్, ఆకాశ్, ఈశా అంబానీ మాటల్లోనే..

రిలయన్స్ ఇండస్ట్రీస్ 42వ వార్షిక సాధారణ సమావేశం

జిల్.. జిల్.. జియో ఫైబర్

- సెప్టెంబరు 5 నుంచి బ్రాడ్‌బ్యాండ్ సేవలు
- ప్రీమియం చందాదార్లు ఇళ్లలోనూ కొత్త సినిమా చూసే వీలు
- ఈ సేవలు వచ్చే ఏడాది నుంచి
- రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ

ముంబయిలో సోమవారం జరిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ 42వ వార్షిక సాధారణ సమావేశానికి హాజరవుతున్న కోకిలా బెన్, నీతా అంబానీ, ముకేశ్ అంబానీ

ఈశా అంబానీ

సెప్టెంబరు 5 నుంచి

జియో ఫైబర్ సేవలను జియో మూడో వార్షికోత్సవ రోజైన సెప్టెంబరు 5 నుంచి మొదలుపెట్టనున్నాం. కనీసం 100 ఎమ్‌బీపీఎస్ వేగంతో బ్రాడ్‌బ్యాండ్ సేవలు నెలకు రూ.700 (జీఎస్‌టీ అదనం) నుంచి పొందవచ్చు. 1 జీబీపీఎస్ వేగం సేవలు పొందేందుకు నెలవారీ రూ.10,000 (జీఎస్‌టీ అదనం) వరకు అద్దె పథకాలున్నాయి.

ఎస్‌టీబీ ఇస్తాం

జియో ఫైబర్ సేవల కింద జియో 4కే సెట్ టాప్ బాక్స్ ఉచితంగా అందజేస్తారు. వైఫై రూటరు, సెట్‌టాప్ బాక్స్ కలిపే ఉంటాయి. వీటితో సాధారణ టీవీనీ స్మార్ట్ టీవీగా మార్చుకోవచ్చు. లైవ్ టీవీ ఛానళ్లు, ఉచితంగా అంతర్జాతీయ వీడియో కాన్ఫరెన్స్, కన్సోల్ క్వాలిటీ గేమింగ్, వీఆర్ (వర్చువల్ రియాలిటీ), ఏఆర్ (ఆగ్మెంటెడ్ రియాలిటీ) సొల్యూషన్లు పొందొచ్చు. హాట్‌స్టార్, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, సోటీలైవ్, ఎరోస్‌నౌ, హోయ్‌చోయ్, ఆల్ట్ బాలాజీ వంటి ఓటీటీ కంటెంట్ ప్రొవైడర్లకు సంబంధించిన ప్రీమియమ్ సబ్‌స్క్రిప్షన్లూ జియో ఫైబర్‌లో అందుబాటులో ఉంటాయి. (కేబుల్ ఫైబర్/డీటీహెచ్ ద్వారా ప్రసారమయ్యే టీవీ ఛానళ్లకు మాత్రం చందాదార్లు అదనంగా చెల్లించాల్సిందేనని కంపెనీ సీనియర్ అధికారి తెలిపారు.)

ఉచిత వాయిస్‌కాల్స్

చందాదార్లందరికీ ల్యాండ్‌లైన్ ఫోన్ ఉచితంగా ఇస్తాం. భారత్‌లోని ఏ మొబైల్/ల్యాండ్‌లైన్‌కైనా జీవితకాలం పాటు ఉచితంగా వాయిస్‌కాల్స్ చేసుకోవచ్చు. అత్యంత తక్కువ ధరకు అంతర్జాతీయ అపరిమితి కాలింగ్ ప్యాక్‌ను కూడా జియో అందిస్తోంది. ల్యాండ్‌లైన్ నుంచి అమెరికా, కెనడాలకు రూ.500 నెలవారీ సబ్‌స్క్రిప్షన్‌తో పొందొచ్చు. ప్రస్తుత మార్కెట్ టారిఫ్‌లను చూస్తే ఇవి 5-10వ వంతు మాత్రమే.

ఇంట్లోనే కొత్త సినిమా

భారత్‌లోనే తొలిసారిగా కొత్త సినిమాలను విడుదల రోజే, నేరుగా ఇంట్లో చూసే ఆలోచనతో ముందుకొచ్చాం. ప్రీమియం జియో ఫైబర్ వినియోగదార్లు తమ ఇంట్లోనే తిలకించవచ్చు. అయితే ఈ 'జియో ఫస్ట్ డే ఫస్ట్ షో' సేవలను 2020 మధ్యలో తీసుకురానున్నాం.

వేగంలో సాటి లేదు

ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశమైన అమెరికాలో సగటు ఫిక్స్‌డ్ లైన్ డౌన్‌లోడ్ వేగం 90 ఎమ్‌బీపీఎస్‌గా ఉంది. భారత్‌లో జియో ఫైబర్ పథకాల్లో ప్రారంభ పథకంలోనే 100 ఎమ్‌బీపీఎస్ వేగాన్ని అందిస్తున్నాం. అంతర్జాతీయ రేట్లతో పోలిస్తే పదో వంతు ధరలకే వీటిని ప్రకటిస్తున్నాం. ఈ పథకాలకు అనుబంధంగా ప్రీమియమ్ ఓవర్ ద టాప్(ఓటీటీ) అప్లికేషన్లనూ సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. తొలి ఏడాదిలోనే దాదాపు 1600 పట్టణాలలో 2 కోట్ల గృహాలు, 1.5 కోట్ల వ్యాపార సంస్థలకు మేం సేవలందించాలని నిర్ణయించాం.

ఇంటా.. బయటా

జియో పోస్ట్‌పెయిడ్ ప్లస్‌తో ప్రయారిటీ సిమ్-సెటప్ సేవలను అందిస్తారు. ఇంటా.. బయటా అన్ని డివైజ్‌లకు డేటా, వాయిస్ అనుసంధాన సేవలు ఉంటాయి. వీటిలో కుటుంబపథకాలు, అంతర్జాతీయరోమింగ్ పథకాలుంటాయి.

టీవీ ఉచితం

జియో ఫైబర్, జియో సెట్‌టాప్ బాక్స్‌ల సేవల్లో అత్యుత్తమ నాణ్యత, అనుభవం కావాలంటే అది.. ఎల్‌ఈడీ టీవీ ఉంటేనే సాధ్యం. అందుకే వార్షిక పథకాలను(జియో ఫరెవర్ ప్లాన్స్) ఎంచుకునే వినియోగదార్లకు హెచ్‌డీ లేదా 4కే ఎల్‌ఈడీ టీవీ, 4కే సెట్ టాప్ బాక్స్‌లను ఉచితంగా ఇస్తాం.

రూ.3.5 లక్షల కోట్ల పెట్టుబడులు

రిలయన్స్ జియో పెట్టుబడులు పూర్తయ్యాయి. డిజిటల్ నెట్‌వర్క్ కోసం రూ.3.5 లక్షల కోట్లను పెట్టుబడులుగా పెట్టాం. అందుకే మూడేళ్లలోపే 34 కోట్ల మంది మొబైల్ వినియోగదార్లను సాధించాం. ఇక ఇపుడు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), గృహ, కంపెనీలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు, ఎస్ఎమ్ఈలకు బ్రాడ్‌బ్యాండ్ వంటి కొత్త వృద్ధి బాటలను పట్టాం. ఈ ప్రతీ విభాగం నుంచీ ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఆదాయాలు రావడం ప్రారంభమవుతుంది. జియోకు 50 కోట్ల మంది వినియోగదార్లను సాధించగలమన్న విశ్వాసం ఉంది. జియో ఐఓటీ ప్లాట్‌ఫాంను జనవరి 1, 2020న ప్రారంభిస్తాం.

జియో, రిలయన్స్ రిటైల్ నమోదు

జియో ఐఓటీ ప్లాట్‌ఫాంపై కనీసం 100 కోట్ల పరికరాలను అనుసంధానించాలన్నదే జియో లక్ష్యం. అంటే ఏటా రూ.20,000 కోట్ల ఆదాయ అవకాశం జియోకు ఉందన్నమాట. జియో, రిలయన్స్ రిటైల్ వ్యాపారాల కోసం వ్యూహాత్మక, ఆర్థిక పెట్టుబడుదార్ల నుంచి బలమైన ఆసక్తి కనిపిస్తోంది. వచ్చే కొద్ది త్రైమాసికాల్లో అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను భాగస్వాములుగా తీసుకుంటాం. వచ్చే అయిదేళ్లలో ఈ రెండు కంపెనీలను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేస్తాం.

–ముంబయి

అంకురాలకు ఉచిత క్లౌడ్ సేవలు

- దేశవ్యాప్తంగా త్వరలో డేటా కేంద్రాలు
- మైక్రోసాఫ్ట్‌తో దీర్ఘకాల ఒప్పందం

దేశవ్యాప్తంగా భారీ స్థాయి డేటా కేంద్రాలను జియో ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం మైక్రోసాఫ్ట్‌తో దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రకటించింది. ఈ కేంద్రాల్లో మైక్రోసాఫ్ట్ తన 'అజూర్' క్లౌడ్ ప్లాట్‌ఫాంను తీసుకొస్తుంది. గుజరాత్, మహారాష్ట్రలో తొలి రెండు డేటా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. 2020 నుంచి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఎందుకీ డేటా కేంద్రాలు..

'అంకురాల వ్యయాల్లో 80 శాతం క్లౌడ్, అనుసంధాన మౌలిక వసతులపైనే వెచ్చించాల్సి వస్తోంది. జియో ఈ వ్యయాలను భరిస్తుంది. అంటే అంకురాలకు ఉచితంగా క్లౌడ్ సేవలను అందించడానికి జియో సిద్ధంగా ఉంద'ని ముకేశ్ అంబానీ ప్రకటించారు. అంకురాలు తమకు కావలసిన ప్యాకేజీని జనవరి 1, 2020 నుంచి జియో.కామ్‌లో ఎంచుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. 'భారత అవసరాలైన వ్యవసాయం, ఆరోగ్యసంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి వాటికి పరిష్కారం చూపే అంకురాల్లో జియో పెట్టుబడులు పెడుతుంది. ఆర్థికంగా మద్దతు అందిస్తామ'ని ఆయన తెలిపారు.

ఎస్ఎమ్ఈల కోసం..

'భారత ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీలు కీలకం. ఈ కంపెనీలకు అనుసంధాన, ఉత్పాదకత, ఆటోమేషన్ టూల్స్ వ్యయాలు ఎంత లేదన్నా రూ.15,000-20,000 వరకు అవుతున్నాయి. వీరికి ఈ అనుసంధాన సేవలను నెలకు రూ.1500 ప్రారంభ ధరతో అందజేయనున్నాం. అపరిమిత ఎంటర్‌ప్రైజ్-గ్రేడ్ వాయిస్, డేటా సేవలు, వీడియో కాన్ఫరెన్స్, సెక్యూరిటీ సొల్యూషన్స్, మార్కెటింగ్, విక్రయాలు, తదితర ఉత్పాదక టూల్స్‌ను మా నుంచి పొందొచ్చ'ని వివరించారు. 'భారత్ కంపెనీలు వృద్ధి చెందడానికి మా సాంకేతికతను అందచేస్తామ'ని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్లోకా అంబానీ, ఆకాశ్ అంబానీ

అప్పు.. 0!

రాబోయే 18 నెలల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను (ఆర్ఐఎల్) రుణరహిత స్థితికి తీసుకొస్తామని ముకేశ్ వెల్లడించారు. దిగ్గజ చమురు ఎగుమతిదారు, సౌదీ సంస్థ అరామ్‌కోకు రిలయన్స్ చమురు, రసాయనాల వ్యాపారంలో 20 శాతం వాటాను రూ.1.05 లక్షల కోట్లకు పైగా మొత్తానికి విక్రయించనున్నారు. రిలయన్స్ పెట్రోలు బంకుల విభాగంలో 49 శాతం వాటాను బ్రిటిష్ పెట్రోలియమ్ (బీపీ) రూ.7,000 కోట్లకు కొనుగోలు చేయనుంది. ప్రతిపాదిత ఈ రెండు లావాదేవీల వల్ల రిలయన్స్‌కు దాదాపు రూ.1.15 లక్షల కోట్ల వరకు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి కావచ్చన్నది ముకేశ్ అంచనా.

- 18 నెలల్లో రుణరహిత స్థితికి ఆర్ఐఎల్
- చమురు, రసాయనాల్లో 20% వాటా విక్రయం
- పెట్రోలు బంకుల్లో 49% వాటా బీపీకి రూ.7000 కోట్లకు

రూ.9.5 లక్షల కోట్లు
టెలికాం, రిటైల్ వ్యాపారాలతో కలుపుకొని ఆర్ఐఎల్ గ్రూపు విలువ (సుమారు)

రూ.1,31,710 కోట్లు
జూన్ 30 నాటికి ఆర్ఐఎల్ నగదు నిల్వలు

రూ. 5.4 లక్షల కోట్లు
చమురు, రసాయనాల వ్యాపార విస్తరణ, 4జీ వైర్‌లెస్ టెలికాం నెట్‌వర్క్ ఏర్పాటుకు గత ఐదేళ్లలో ఆర్ఐఎల్ పెట్టిన పెట్టుబడి. పూర్తిగా రుణం రూపేణానే ఈ నిధులు సమీకరించింది.

అరామ్‌కోకు అమ్మకంపై..

- రిలయన్స్ ఇండస్ట్రీస్ తన చమురు, రసాయన విభాగ విలువను 75 బిలియన్ డాలర్లుగా (రూ.5,25,000 కోట్లు) లెక్కగట్టింది. ఇందులో 20 శాతాన్ని విక్రయించడం ద్వారా రూ.1,05,000 కోట్లకు పైగా (15 బిలియన్ డాలర్లు) వచ్చే వీలుంది. దేశ చరిత్రలోనే ఒక విదేశీ సంస్థ ఇంత భారీ స్థాయిలో పెట్టుబడి పెట్టడం ఇదే తొలిసారి అని ముకేశ్ అంబానీ తెలిపారు.
- ఈ ఒప్పందంలో భాగంగా గుజరాత్‌లోని జామ్‌నగర్ వద్ద రిలయన్స్‌కున్న రెండు రిఫైనరీలకు దీర్ఘకాలిక పద్ధతిలో రోజుకు 5,00,000 బ్యారెళ్లు చొప్పున చమురును అరామ్‌కో సరఫరా చేస్తుంది. ప్రస్తుతం సౌదీ అరేబియా నుంచి రిలయన్స్ కొనుగోలు చేస్తున్న చమురుతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు. ఈ విక్రయ లావాదేవీకి నియంత్రణ సంస్థల అనుమతులను ఆర్ఐఎల్ పొందాల్సి ఉంది.
- వచ్చే ఐదేళ్లలోగా చమురు, రసాయనాల వ్యాపారం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఎక్స్ఛేంజీల్లో నమోదుకాని అనుబంధ సంస్థగా రూపాంతరం చెందుతుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.ఎమ్.ఎస్.ప్రసాద్ అన్నారు.

బీపీకి విక్రయంతో..

- పెట్రోలు బంకులు, విమాన ఇంధన (ఏటీఎఫ్) విక్రయ కేంద్రాల ఏర్పాటు నిమిత్తం ఓ సంయుక్త సంస్థను ఏర్పాటు చేసేందుకు గతవారం ఆర్ఐఎల్, బ్రిటిష్ సంస్థ బీపీల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సంయుక్త సంస్థలో బీపీకి 49% వాటాను రూ.7000 కోట్లకు విక్రయిస్తోంది. రిలయన్స్‌కు 51 శాతం మేర వాటా మిగులుతుంది. రిలయన్స్‌కు ఉన్న దాదాపు 1400 పెట్రోలు బంకులు, 31 విమాన ఇంధన స్టేషన్లు సంయుక్త సంస్థకు బదిలీ అవుతాయి.
- వచ్చే ఐదేళ్లలో పెట్రోల బంకుల సంఖ్యను 5500కి పెంచుకోవాలని ఇరు సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

అప్పు ఎలా తీరుస్తారంటే

2019 జూన్ చివరినాటికి ఆర్ఐఎల్ గ్రూపు రుణం రూ.2,88,243 కోట్లుగా ఉంది. టవర్లు లాంటి టెలికాం మౌలిక వసతుల ఆస్తుల విలువను లెక్కలోకి తీసుకుంటే నికరంగా అప్పు రూ.1,54,478 కోట్లకు దిగివస్తుంది. ఇప్పుడు ఈ రెండు లావాదేవీలు పూర్తి చేయడం ద్వారా వచ్చే 18 నెలల్లో అంటే 2021, మార్చి 31 నాటికి నికరంగా అప్పురహిత స్థితికి తీసుకొచ్చేందుకు కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేసుకుందని ముకేశ్ వెల్లడించారు.

జమ్మూ-కశ్మీర్‌లో పెట్టుబడులు పెడతాం

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు జమ్మూ, కశ్మీర్, లద్దాఖ్ ప్రజల అవసరాలు తీర్చేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని ముకేశ్ తెలిపారు. ఈ మూడు ప్రాంతాల అభివృద్ధికి కొన్ని ప్రకటనలు త్వరలో చేస్తామని ముకేశ్ హామీ ఇచ్చారు.

హర్షాతిరేకాలు

- భవిష్యత్తులో అధిక డివిడెండ్లు ఇస్తామని, ఫైబర్ సేవల వార్షిక చందాదార్లకు టీవీలు ఉచితంగా అందచేస్తామని ముకేశ్ అంబానీ ప్రకటించినప్పుడూ హర్షధ్వానాలు మిన్నంటాయి.
- ఏఆర్, వీఆర్ వంటి వినూత్న సాంకేతికత గురించి ఆకాశ్, ఈశా అంబానీ వివరించినపుడు కరతాళ ధ్వనులతో మదుపర్లు అభినందనలు తెలిపారు.

12వ ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	328	వరంగల్	331
చిల్లరగా (ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	352
బెంగళూరు	340	చెన్నై	355
13వ తేదీకి...		చిత్తూరు	348
విజయవాడ	339	నమక్కల్	350
గోదావరి	334		

ఎన్‌సీసీ లిమిటెడ్ లాభాల్లో క్షీణత

ఈనాడు, హైదరాబాద్: ఎన్‌సీసీ లిమిటెడ్ మొదటి త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.72.27 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. త్రైమాసిక టర్నోవర్ రూ.2371.51 కోట్లు ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో టర్నోవర్ రూ.2530.81 కోట్లు, నికరలాభం రూ.102.16 కోట్లు ఉంది. దీంతో పోల్చితే ప్రస్తుత మొదటి త్రైమాసికంలో టర్నోవర్, నికరలాభం తగ్గాయి. ఈపీఎస్ కూడా రూ.1.71 నుంచి రూ.1.24కు తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీకి రూ.636 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు లభించాయి. దీంతో కంపెనీ చేతిలో ఉన్న మొత్తం ఆర్డర్ల విలువ రూ.33,495 కోట్లకు పెరిగింది.

జీవీకే పవర్‌కు పెరిగిన నష్టాలు

ఈనాడు, హైదరాబాద్: జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు నష్టాలు పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.131.51 కోట్ల నికర నష్టాన్ని ఈ సంస్థ నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో నికర నష్టం రూ.54.86 కోట్లు మాత్రమే. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.1042.12 కోట్ల మొత్తం ఆదాయాన్ని ఈ సంస్థ ఆర్జించింది. ఏడాది క్రితం ఇదేకాలంలో మొత్తం ఆదాయం రూ.1106.33 కోట్లు ఉంది.

మన మార్కెట్లు పని చేయలేదు

బక్రీద్ సందర్భంగా నిన్న (సోమవారం) బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు, ఫారెక్స్, మనీ మార్కెట్లు పనిచేయలేదు. ప్రధాన కమొడిటీ మార్కెట్లకు కూడా పగలంతా సెలవే. అంతర్జాతీయ విపణులతో పాటు రాత్రి పనిచేశాయి.

ఛాంపియన్

ఇంటర్వ్యూలు ఆ ఆరుగురికే..

కోచ్ పదవికి తుది జాబితా ఖరారు చేసిన కపిల్ కమిటీ

ముంబయి

టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ ఎంపికకు రంగం సిద్ధమవుతోంది. ఈ శుక్రవారమే ఈ పదవి కోసం ఇంటర్వ్యూలు చేపట్టనుంది కపిల్ దేవ్, అన్షుమన్ గైక్వాడ్, శాంత రంగస్వామిలతో కూడిన క్రికెట్ సలహా కమిటీ. ఇందు కోసం ఆరుగురితో తుది జాబితాను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుత కోచ్ రవిశాస్త్రితో పాటు టామ్ మూడీ, మైక్ హెసన్, ఫిల్ సిమన్స్, రాబిన్ సింగ్, లాల్‌చంద్ రాజ్‌పుత్‌లను మాత్రమే ఇంటర్వ్యూలకు పిలవనున్నారట. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలోనే కపిల్ కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. అభ్యర్థులకు దీనిపై ఇప్పటికే సమాచారం అందించారట. అయితే అందరూ నేరుగా ఇంటర్వ్యూల్లో పాల్గొనే అవకాశం లేదు. ముంబయికి రాలేని వాళ్లు స్కైప్ ద్వారా కపిల్ కమిటీతో మాట్లాడతారు. ప్రెజెంటేషన్ ఇస్తారు. ప్రస్తుతం టీమ్‌ఇండియాతో పాటు వెస్టిండీస్ పర్యటనలో ఉన్న రవిశాస్త్రి సైతం అక్కడి నుంచే స్కైప్ ద్వారా ఇంటర్వ్యూలో పాల్గొంటాడు. వెస్టిండీస్ కాలమానం ఆలస్యంగా ఉంటుంది కాబట్టి ఇంటర్వ్యూకు చివరగా హాజరయ్యేది రవిశాస్త్రే అని తెలిసింది. తానైతే రవిశాస్త్రే కోచ్‌గా కొనసాగాలని కోరుకుంటానని టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లి ఇటీవల పేర్కొనడం.. అన్షుమన్ గైక్వాడ్ బహిరంగంగానే రవికి మద్దతు పలకడంతో ప్రస్తుత కోచ్‌నే మళ్లీ ఎంపిక చేస్తారనే ప్రచారం గట్టిగా జరుగుతోంది. అయితే కోచ్ ఎంపికలో కోహ్లి అభిప్రాయాల్ని కమిటీ పరిగణనలోకి తీసుకోదని, స్వతంత్రంగా వ్యవహరిస్తుందని బీసీసీఐ స్పష్టం చేసింది. టామ్ మూడీ, మైక్ హెసన్‌ల నుంచి రవిశాస్త్రికి గట్టి పోటీ ఎదురు కావచ్చని తెలుస్తోంది. కపిల్ కమిటీ ప్రధాన కోచ్ పదవికి మాత్రమే ఇంటర్వ్యూలు చేపట్టనుందట. సహాయ కోచ్‌లు, ఇతర సిబ్బంది కోసం ఇంటర్వ్యూల్ని భారత క్రికెట్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ నిర్వహించనున్నట్లు సమాచారం. అవి ఎప్పుడన్నది ఇంకా నిర్ణయం కాలేదు. ప్రధాన కోచ్ సహా అన్ని పదవులకూ కలిపి బీసీసీఐకి 2 వేల దాకా దరఖాస్తులు రావడం విశేషం. ఇంటర్వ్యూలు పూర్తయిన రెండు మూడు రోజుల్లోపే కోచ్ ఎవరన్నది ప్రకటిస్తారని బీసీసీఐ వర్గాల సమాచారం.

పాట వింటే.. కాలు కదులుతుంది

క్రికెట్‌ను ఆస్వాదించే క్రమంలో కెప్టెన్సీ అడ్డుగా నిలవడం తనకు ఇష్టం లేదని విరాట్ కోహ్లి అంటున్నాడు. వర్షం కారణంగా రద్దైన తొలి వన్డే విరామ సమయంలో క్రిస్‌గేల్, మైదాన సిబ్బందితో కలిసి కోహ్లి చిందులు వేస్తూ కనిపించిన విషయం తెలిసిందే. "హుషారెత్తించే సంగీతం విన్నప్పుడల్లా కాళ్లు కదపాలనిపిస్తుంది. మైదానంలో ఉన్నంతసేపు పూర్తిగా ఆస్వాదిస్తా. నన్ను నేను సంతృప్తి పరుచుకుంటా. నేను జట్టుకు నాయకుడినా? కాదా? అనేది అనవసరం. చేతులు కట్టుకొని ఊరికే నిల్చోవడం నాకు నచ్చదు. దేవుడు అద్భుతమైన జీవితాన్ని ఇచ్చాడు. దేశం తరపున ఆడే అవకాశమిచ్చాడు. ఇలాంటి చిన్న చిన్న విషయాలను ఆస్వాదించడమూ ముఖ్యమే" అని కోహ్లి చెప్పాడు. జట్టుకు అన్ని విధాలుగా ఉపయోగపడడం కోసం తన జీవనశైలి, శిక్షణ, ఆహార నియమాలు మార్చుకున్నానని అతను పేర్కొన్నాడు.

కోహ్లి 'డ్రాప్' లేపాడు

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: బాటిల్ క్యాప్ ఛాలెంజ్.. కొన్ని నెలలుగా సామాజిక మాధ్యమాల్ని ఊపేస్తున్న ప్రక్రియ. టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి కాస్త ఆలస్యంగా ఈ సవాల్‌ను స్వీకరించాడు. సీసా మూతను లేపిన వీడియోను శనివారం ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. ఎడమచేతి వాటం శైలిలో షాట్ ఆడిన కోహ్లి బ్యాటుతో సీసా మూతను పడగొట్టి అందులోని నీళ్లు తాగాడు. ఈ వీడియోకు కోచ్ రవిశాస్త్రి ఒకప్పుడు వ్యాఖ్యానం చేసిన ఆడియోను జోడించడం విశేషం.

భువి ముగించాడు

అదరగొట్టిన భారత పేసర్

వెస్టిండీస్‌పై భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. టీ20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన కోహ్లీసేన.. వన్డే సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితం తేలిన రెండో వన్డేలో భారత్.. 59 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై ఘనవిజయం సాధించింది. మొదట కెప్టెన్ విరాట్ కోహ్లి (120) శతకానికి, యువ బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్ (71) అర్ధశతకం తోడవడంతో విండీస్ ముందు 280 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది భారత్. వర్షం వల్ల డ/లూ పద్ధతిలో లక్ష్యాన్ని 46 ఓవర్లలో 270గా సవరించారు. భువనేశ్వర్ (4/31) ధాటికి విండీస్ 42 ఓవర్లలో 210 పరుగులకే ఆలౌటైంది. తొలి వన్డే వర్షం వల్ల రద్దయిన సంగతి తెలిసిందే. సిరీస్‌లో చివరిదైన మూడో వన్డే బుధవారం జరుగుతుంది.



- రెండో వన్డేలో విండీస్ ఓటమి
- సిరీస్‌లో కోహ్లీసేనకు 1–0 ఆధిక్యం

పోర్ట్ ఆఫ్ స్పెయిన్

వరుణుడు ఒకటికి రెండుసార్లు అంతరాయం కలిగించినా.. గత మ్యాచ్‌లతో పోలిస్తే వెస్టిండీస్ బాగానే పోరాడినా.. టీమ్‌ఇండియాకు ఢోకా లేకపోయింది. రెండో వన్డేలో ప్రతికూల పరిస్థితుల నుంచి పుంజుకున్న భారత్.. అలవోకగా మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. బౌలర్లు సమయోచితంగా రాణించడంతో ఛేదన మధ్యలో విండీస్ దారి తప్పింది. ఓపెనర్ ఎవిన్ లూయిస్ (65; 80 బంతుల్లో 8×4, 1×6), నికోలస్ పూరన్ (42; 52 బంతుల్లో 4×4, 1×6) భారత్‌ను భయపెట్టినా.. వీరిని బౌలర్లు సరైన సమయంలో ఔట్ చేసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పారు. వీరు ఔటయ్యాక విండీస్ అసలు పోటీలోనే లేదు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 279 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

ఆ వికెట్టే మలుపు..: గేల్ (11), షై హోప్ (5), హెట్‌మెయర్ వికెట్లను త్వరగా కోల్పోయిన విండీస్‌కు.. ఛేదనలో మంచి అవకాశాలు కల్పించింది లూయిసే. ఆరంభం నుంచి అతను ధాటిగా ఆడుతూ సాగాడు. అతడికి పూరన్ కూడా తోడవడంతో విండీస్ మంచి స్థితికి చేరుకుంది. 27 ఓవర్లకు వెస్టిండీస్ స్కోరు 147/3. మిగిలిన 19 ఓవర్లలో 123 పరుగులు చేయాలి. సాధించాల్సిన రన్‌రేట్ 6.47 మాత్రమే. లూయిస్ 65, పూరన్ 30 పరుగులతో ఆడుతున్నారు. ఇద్దరూ బాగా కుదురుకున్నారు. ఊపుమీదున్నారు. షాట్లు ఆడుతున్నారు. ఇంకా రోస్టన్ చేజ్, కార్లోస్ బ్రాత్‌వైట్, హోల్డర్ ఆడాల్సి ఉంది. దీంతో అప్పటికి మొగ్గు అయితే విండీస్ వైపే ఉంది. ఈ స్థితిలో కుల్‌దీప్ (2/59) మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. లూయిస్‌ను ఔట్ చేశాడు. కోహ్లి ఒంటి చేత్తో పట్టిన అద్భుత క్యాచ్‌కు అతను వెనుదిరిగాడు. చేజ్ (18)తో కలిసి పూరన్ మళ్లీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు కానీ.. రెండో స్పెల్ కోసం బౌలింగ్‌కు వచ్చిన భువనేశ్వర్ వీళ్లిద్దరినీ ఒకే ఓవర్లో (35) ఔట్ చేసి విండీస్‌కు ఆశల్లేకుండా చేశాడు. ప్రమాదకర బ్రాత్‌వైట్ (0)ను జడేజా డకౌట్ చేశాడు. విండీస్ 148/3 నుంచి 182/8కు చేరుకుంది. షమి (2/39) మిగతా రెండు వికెట్లు పడగొట్టి 210 వద్ద ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

భారత్ ఇన్నింగ్స్: 279/7

వెస్టిండీస్ ఇన్నింగ్స్: గేల్ ఎల్బీ (బి) భువనేశ్వర్ 11; లూయిస్ (సి) కోహ్లి (బి) కుల్‌దీప్ 65; షై హోప్ (బి) ఖలీల్ 5; హెట్‌మెయర్ (సి) కోహ్లి (బి) కుల్‌దీప్ 18; పూరన్ (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 42; చేజ్ (సి) అండ్ (బి) భువనేశ్వర్ 18; హోల్డర్ నాటౌట్ 13; కార్లోస్ బ్రాత్‌వైట్ (సి) షమి (బి) జడేజా 0; కీమర్ రోచ్ (బి) భువనేశ్వర్ 0; కాట్రెల్ (సి) జడేజా (బి) షమి 17; ఒషేన్ థామస్ ఎల్బీ (బి) షమి 0; ఎక్స్‌ట్రాలు 21 **మొత్తం:** (42 ఓవర్లలో ఆలౌట్) **210; వికెట్ల పతనం:** 1-45, 2-52, 3-92, 4-148, 5-179, 6-179, 7-180, 8-182, 9-209; **బౌలింగ్:** భువనేశ్వర్ 8-0-31-4; షమి 8-0-39-2; ఖలీల్ అహ్మద్ 7-0-32-1; కుల్‌దీప్ యాదవ్ 10-0-59-2; కేదార్ జాదవ్ 5-0-25-0; జడేజా 4-0-15-1

'నాలుగు'కు అయ్యర్ సరైనోడు

ధోని మాదిరి అయిదు లేదా ఆరో స్థానంలో మంచి ఫినిషర్‌గా రిషభ్ పంత్ సరిపోతాడు. కోహ్లి, రోహిత్, ధావన్ 40-45 ఓవర్ల వరకు బ్యాటింగ్ చేస్తే పంత్‌ను 'నాలుగు'కు పరిశీలించొచ్చు. కానీ ఎక్కువ ఓవర్లు ఆడాల్సి వచ్చినప్పుడు 'నాలుగు'కు అయ్యర్.. 'అయిదు'కు పంత్ సరైనోళ్లు. విండీస్‌తో రెండో వన్డేలో అయ్యర్ చక్కగా ఆడాడు. నాలుగో స్థానం అతడికే ఖాయం చేయాలి. –గావస్కర్

మరోసారి 'టై'టాన్స్

బంగాల్‌తో మ్యాచ్ టై

ప్రొ కబడ్డీ

ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో తెలుగు టైటాన్స్ మరో మ్యాచ్‌ను టై చేసుకుంది. గత మ్యాచ్‌లో గుజరాత్‌పై గెలిచి బోణీ కొట్టిన టైటాన్స్.. బంగాల్ వారియర్స్‌తో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌ను ఫలితం తేలకుండా ముగించింది. ఈ సీజన్‌లో టైటాన్స్‌కిది రెండో టై. చివరి రైడ్‌లో సురాజ్ దేశాయ్ పాయింట్ తెస్తే టైటాన్స్ గెలిచేదే. కానీ రక్షణాత్మక ధోరణి అవలంభించిన జట్టు టైతోనే సరిపెట్టుకుంది.

టైటాన్స్- బంగాల్ మ్యాచ్‌లో ఓ దృశ్యం

అహ్మదాబాద్

సీజన్‌లో ఆలస్యంగా పుంజుకున్న తెలుగు టైటాన్స్ మరో మ్యాచ్‌లో ఓడకుండా జాగ్రత్తపడింది. పోరాడితే గెలిచే అవకాశం ఉన్నా కూడా రక్షణాత్మకంగా ఆడి మ్యాచ్‌లో ఫలితం తేలకుండా చేసుకుంది. సోమవారం టైటాన్స్, బంగాల్ వారియర్స్ మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్ 29-29తో టైగా ముగిసింది. టైటాన్స్ తరపున రైడింగ్‌లో సూరజ్ దేశాయ్ (7), ట్యాక్లింగ్‌లో ఫర్హాద్ మిలాఘర్దాన్ (3) ఆకట్టుకున్నారు. 12 సార్లు రైడ్‌కు వెళ్లిన సిద్ధార్థ్ దేశాయ్ నాలుగు పాయింట్లే తెచ్చి మరోసారి నిరాశ పరిచాడు. బంగాల్ జట్టులో మహమ్మద్ నబిబక్ష్ (8) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటాడు. మొదట్లో సిద్ధార్థ్, ఫర్హాద్ మెరవడంతో తొలి ఆరు నిమిషాలు ముగిసేసరికి టైటాన్స్ 5-3తో ఆధిక్యం సంపాదించింది. రైడింగ్‌లో మణిందర్ (5) రాణించడంతో పుంజుకున్న బంగాల్ 7-7తో స్కోరు సమం చేసింది. టైటాన్స్ 13-11తో తొలి అర్ధభాగాన్ని ముగించింది. విరామం తర్వాత సూరజ్ దూకుడుతో ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన టైటాన్స్ 17-12తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే అలవాటైన రీతిలో మరోసారి పట్టు వదలి ప్రత్యర్థికి పుంజుకొనే అవకాశం కల్పించింది. 29వ నిమిషంలో ఆలౌటైన టైటాన్స్ 21-23తో వెనకబడింది. విశాల్, సూరజ్ ప్రతిఘటించి 26-26తో స్కోరు సమం చేసి జట్టును పోటీలోకి తెచ్చారు. అక్కడి నుంచి రెండు జట్లు ఆచితూచి ఆడాయి. కేవలం డూ ఆర్ డై రైడ్లలోనే పాయింట్లు సాధించేందుకు ప్రయత్నించాయి. దాంతో స్కోర్లు సమం అవుతూ సాగాయి. చివరికి మ్యాచ్ ఫలితం తేలకుండానే ముగిసింది. ఎనిమిది మ్యాచ్‌లాడిన టైటాన్స్ ఓ విజయం, రెండు టైలతో మొత్తం 13 పాయింట్లు సాధించి పట్టికలో కింది నుంచి రెండోస్థానంలో కొనసాగుతోంది.

బుల్స్‌కు షాక్: డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు బుల్స్‌కు షాక్ తగిలింది. ఆ జట్టు 33-35 తేడాతో యూపీ యోధ చేతిలో ఓడింది. బుల్స్‌కు వరుసగా ఇది రెండో పరాజయం. మరోవైపు యూపీకి ఈ సీజన్‌లో ఇది రెండో విజయం. రైడింగ్, ట్యాక్లింగ్‌లో రాణించిన పవన్ సెరావత్ (15) పోరాటం వృథా అయింది. శ్రీకాంత్ జాదవ్ (9), మోను గోయత్ (8) చెలరేగి యూపీని విజయతీరాలకు చేర్చారు. పవన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రెచ్చిపోవడంతో బుల్స్ తొలి నాలుగు నిమిషాల ఆట ముగిసే సరికి 6-1తో నిలిచింది. తిరిగి పుంజుకొన్న యూపీ బుల్స్‌ను ఆలౌట్ చేసి 13-13తో స్కోరు సమం చేసింది. 15-15తో తొలి అర్ధభాగం ముగిసింది. విరామం తర్వాత యూపీ ఆట మరో స్థాయికి చేరింది. ఓ దశలో ఆ జట్టు 27-21తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. చివరి వరకు ఆధిక్యాన్ని నిలుపుకొని మ్యాచ్ వైపసం చేసుకుంది.

కన్నీట సెరెనా

టొరంటో: వెన్ను నొప్పి కారణంగా రోజర్స్ కప్ ఫైనల్ నుంచి అర్ధంతరంగా తప్పుకున్న సెరెనా విలియమ్స్ టెన్నిస్ కోర్టులోనే కన్నీంటి పర్యంతమైంది. ఆదివారం జరిగిన ఫైనల్లో బియాంక ఆండ్రీస్కు (కెనడా)తో సెరెనా తలపడింది. సెరెనా సర్వీస్‌ను బ్రేక్ చేసిన బియాంక 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. వెన్ను నొప్పి ఎక్కువవడంతో ఫిజియోతో మాట్లాడిన సెరెనా మ్యాచ్ నుంచి తప్పుకుంది. "నన్ను క్షమించండి. నేను ఆడలేకపోతున్నా. ఎంత ప్రయత్నించినా నా వల్ల కావడం లేదు" అంటూ సెరెనా కన్నీటి పర్యంతమైంది. విజేతగా నిలిచిన బియాంక.. సెరెనాను ఓదార్చింది. రోజర్స్ కప్ పురుషుల సింగిల్స్‌లో మెద్వెదెవ్‌ను ఓడించి నాదల్ టైటిల్ అందుకున్నాడు.

దిల్లీ క్యాపిటల్స్‌కు రహానె?

దిల్లీ: టీమ్‌ఇండియా మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ అజింక్య రహానె ఐపీఎల్‌లో ఫ్రాంఛైజీ మారబోతున్నట్లు సమాచారం. అయిదు సీజన్ల పాటు ప్రాతినిధ్యం వహించిన రాజస్థాన్ రాయల్స్‌కు అతను గుడ్‌బై చెప్పేబోతున్నాడట. వచ్చే సీజన్‌కు అతను దిల్లీ క్యాపిటల్స్‌కు మారబోతున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్‌లో మొదట ముంబయి ఇండియన్స్‌కు ఆడిన రహానె.. 2011లో రాయల్స్‌కు మారాడు. మధ్యలో ఆ ఫ్రాంఛైజీ సస్పెన్షన్‌లో ఉన్న రెండేళ్లు పుణె సూపర్‌జెయింట్‌కు ఆడాడు. రాయల్స్ పునరాగమనం చేశాక రెండేళ్లూ ఆ జట్టుతోనే కొనసాగాడు. ఈ ఏడాది సీజన్ మధ్యలో రహానెను రాయల్స్ కెప్టెన్సీ నుంచి తప్పించింది. జట్టుతో పాటు తన ప్రదర్శనా అంత బాలేకపోవడంతో ఫ్రాంఛైజీ మారాలని యోచిస్తున్నట్లు సమాచారం. దిల్లీ కూడా రహానెను చేర్చుకోవడానికి సుముఖంగానే ఉందట. వరుస వైఫల్యాల నుంచి బయటపడ్డ ఆ జట్టు ఈసారి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే.

యువ భారత్‌దే ముక్కోణపు సిరీస్

హోవ్ (ఇంగ్లాండ్): అండర్-19 ముక్కోణపు వన్డే సిరీస్‌లో యువ భారత్ విజేతగా నిలిచింది. ఆదివారం ఫైనల్లో భారత అండర్-19 జట్టు ఆరు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. మొదట బంగ్లా 50 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. భారత్ 48.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. యశస్వి (50), దివ్యాంశ్ (55), ప్రియం గార్గ్ (73), ధ్రువ్ (59 నాటౌట్) మెరిశారు.

వీరూకి సెలక్టర్ కావాలనుందట!

దిల్లీ: ఆటగాడిగా కెరీర్ ముగిశాక చాలామంది మాజీల్లాగే వ్యాఖ్యాత అవతారం ఎత్తాడు వీరేంద్ర సెహ్వాగ్. ఐపీఎల్‌లో కింగ్స్‌ఎలెవన్ పంజాబ్‌కు మెంటార్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. అయితే ఇప్పుడతను తనకు సెలక్టర్ కావాలనుందని అంటుండటం విశేషం. "నాకు సెలక్టర్ కావాలనుంది. నాకు అవకాశం ఇచ్చేదెవరు" అని వీరూ ట్విటర్లో పేర్కొన్నాడు. ఐతే ట్విటర్లో వీరూ ఎక్కువగా సరదా సందేశాలే పెడుతుంటాడు కాబట్టి.. ఈ ట్వీట్ ఉద్దేశమేంటన్నది అతనే చెప్పాల్సి ఉంది.

ప్రకృతి మన ప్రియనేస్తం

- దానితో సంఘర్షణ ప్రమాదకరమే
- బేర్‌గ్రిల్స్‌తో సాహసయాత్రలో ప్రధాని మోదీ వ్యాఖ్య
- 18 ఏళ్లలో తొలిసారి సెలవు తీసుకున్నట్లు వెల్లడి

ఈనాడు, దిల్లీ: సాహసయాత్రకు వెళ్లడాన్ని సెలవు (వెకేషన్)గానే భావిస్తే.. 18 ఏళ్లలో తొలిసారి తాను ఈ సెలవు తీసుకున్నట్లేనని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. చూస్తేనే ఒళ్లు జలదరించే 250 రాయల్ బెంగాల్ పులులు సంచరించే ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ అభయారణ్యంలో బేర్‌గ్రిల్స్ అనే సాహసికుడితో కలిసి ఆయన చేసిన యాత్ర ఆద్యంతం ఆసక్తికరంగా నిలిచింది. తన జీవితయాత్రను ఆ సాహసయాత్రతో సమ్మిళితం చేసిన మోదీ.. యువతలో ప్రకృతిపట్ల ప్రేమ, సహజవనరుల సంరక్షణ బాధ్యత పెంపొందించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమం 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' పేరుతో సోమవారం రాత్రి 9 నుంచి 10వరకు డిస్కవరీ ఛానల్‌లో ప్రసారమైంది. యాత్రలో భాగంగా ఇప్పటివరకు ఎవరూ వెళ్లని మార్గాన్ని ఎంచుకుని 5 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లారు. ప్రధాని తన ప్రతి మాటనూ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకే ఉపయోగించారు. 'భారతదేశవ్యాప్తంగా 100 భాషలు, 1600 మాండలికాలున్నాయి. ఇంత వైవిధ్యం ప్రపంచంలో ఎక్కడా కనిపించదు" అని బేర్‌గ్రిల్స్‌తో ప్రధాని మోదీ అన్నారు. తర్వాత ఇద్దరూ పులులున్న చోటుకు చేరుకున్నారు. ఇలాంటిచోట నిరాయుధులుగా వెళ్లడం క్షేమం కాదన్న బేర్‌గ్రిల్స్‌కు మోదీ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. "ప్రకృతి ఎప్పుడూ ప్రమాదకరం కాదు. ప్రకృతితో సంఘర్షణ ప్రమాదకరమే. కలిసి జీవిస్తే ప్రకృతి మనకు సాయంచేస్తుంది" అని చెప్పారు. ఈ సందర్భంగా బేర్‌గ్రిల్స్ ప్రధాని బాల్యం సాగిన తీరును తెలుసుకొనే ప్రయత్నం చేశారు. చిన్నతనంలో రైల్వేప్లాట్‌ఫారాలపై టీ అమ్మిన సంఘటనలను మోదీ నెమరేసుకున్నారు. నిరాయుధులుగా ఉండకూడదని బేర్‌గ్రిల్స్ తనతో తెచ్చిన ఓ కత్తిని కర్రకు కట్టి మోదీ చేతికిచ్చారు. మీరు ముఖ్యమైన వ్యక్తి కాబట్టి మిమ్మల్ని కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని అన్నారు. మోదీ మాత్రం పైవాడిపై నమ్మకం పెట్టుకుంటే ఎవరికీ ఏమీకాదని వేదాంతధోరణిలో వ్యాఖ్యానించారు. ముందే ఎండుగడ్డి, ఎండుకర్రలు, ప్లాస్టిక్ కవర్‌తో తయారుచేసి పెట్టిన తెప్పమీదుగా నదీప్రయాణం మొదలుపెట్టారు. తాను చిన్నప్పుడు నదుల్లో స్నానం చేసేవాడినని, తమకు అంతకుమించిన వసతులు ఉండేవికావని మోదీ గుర్తుచేసుకున్నారు. చెరువులో స్నానం చేస్తున్నప్పుడు మొసలిపిల్ల దొరికితే ఇంటికి తీసుకెళ్లానని, దాన్ని చూసి అమ్మ హింసించడం మంచిదికాదని చెప్పి తిరిగి నీళ్లలోనే వదిలిపెట్టమనడంతో చెరువులోనే వదిలానని మోదీ చెప్పారు. "చిన్నప్పుడు మా ఊళ్లో వర్షంపడితే మా నాన్న బంధువులందరికీ ఉత్తరాలు రాసేవారు. 20-30 కార్డులు తెచ్చి వర్షం పడిన ఆనందాన్ని పంచుకొనే వారు. నాన్న అప్పుడలా ఎందుకు చెప్పేవారో ఇప్పుడు అర్థమైంది. ప్రకృతివనరులకున్న ప్రాధాన్యం ఇప్పుడు తెలిసి వచ్చింది. మా నాన్నమ్మకు చదువురాదు. అయినా మా చిన్నాన్న కట్టెలవ్యాపారం చేస్తానంటే వారించింది. అందుకే మా జీవితంలో పర్యావరణం సహజస్వభావంగా మారింది" అన్నారు. "మనం ఇప్పుడు ఏదైనా ప్రకృతినుంచి తీసుకుంటే... 50 ఏళ్ల తర్వాత పుట్టే పిల్లలు ప్రశ్నిస్తారు. వారికి మనమేం సమాధానం చెబుతాం? ఇది గుర్తుపెట్టుకొని ప్రతి ఒక్కరూ మసలుకోవాలి" అని పిలుపునిచ్చారు. గంటపాటు సాగిన ప్రయాణంలో తనకు అద్భుతమైన ప్రకృతిని చూపినందుకు బేర్‌గ్రిల్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. బేర్‌గ్రిల్స్ కూడా మోదీతో కలిసి ప్రయాణం చేయడాన్ని తనకు లభించిన గొప్ప అవకాశంగా పేర్కొన్నారు.

సాహసయాత్ర మధ్యలో కర్రకు కత్తికట్టి ఆయుధాన్ని సిద్ధం చేసుకుంటున్న ప్రధాని మోదీ, బేర్‌గ్రిల్స్

బియ్యం రవాణాలోనే మాయం!

అసోం, మణిపుర్‌లలో ఎఫ్‌సీఐ అధికారుల మాయాజాలంపై సీబీఐ దర్యాప్తు

దిల్లీ: ద్విచక్ర వాహనాలతో వేల కిలోల బియ్యాన్ని రవాణా చేయొచ్చా? ఇలాంటి మాయతో బియ్యాన్ని, సర్కారు సొమ్మును బొక్కేసిన ఘనుల తీరిది. కొంతమంది ఎఫ్‌సీఐ అధికారులు, ఓ ప్రైవేటు కంపెనీ రూ.85 లక్షల విలువ చేసే 2.60 లక్షల కిలోల(260 టన్నుల) బియ్యాన్ని కైంకర్యం చేసి, లారీల ద్వారా తరలించినట్లు చూపగా, వారు సమర్పించిన వాహనాల నంబర్లు మాత్రం స్కూటర్లు, మోటారు సైకిళ్లవి కావడం గమనార్హం. ఈ వ్యవహారంపై ఎఫ్‌సీఐ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ కేసు దర్యాప్తు జరుపుతోంది. అసోంలోని సల్పాపరా రైలు టెర్మినల్ నుంచి 9,191 క్వింటాళ్ల బియ్యం మణిపుర్‌లోని కొయిరెంగీకి 2016, మార్చి 7-22 మధ్య జెనిత్ ఎంటర్‌ప్రైజెస్ అనే ఓ ప్రైవేటు రవాణాసంస్థకు చెందిన 57 ట్రక్కుల ద్వారా రవాణా చేశారు. అవి రెండు నెలల తర్వాత గమ్యస్థానం చేరాయి. వాస్తవానికి 275.5 కి.మీ. ఉండే ఆ దూరానికి 9 గంటల సమయం పడుతుంది. ఇందులో 16 వాహనాల్లో రవాణా చేసిన రూ.84.98 లక్షలు విలువ చేసే 2,601.63 క్వింటాళ్ల బియ్యాన్ని మాయం చేశారు. వాహనాలు చెడిపోవడంతో ఇతర వాహనాల ద్వారా తరలించడం వల్ల ఆలస్యం జరిగినట్లు రవాణా సంస్థ తన ప్రమాణపత్రంలో పేర్కొంది. అయితే, సరకును మార్చి రవాణా చేసిన వాహనాలుగా పేర్కొన్న వాటిలో స్కూటర్లు, మోటారుసైకిళ్లు, నీటి ట్యాంకులు, బస్సులు, వ్యాన్లు, కార్లకు సంబంధించిన నంబర్లతో పాటు మనుగడలో లేని నంబర్లనూ పేర్కొన్నట్లు తేలింది. మాయంచేసిన 2,601.63 క్వింటాళ్ల బియ్యం అసలు రవాణానే జరగలేదని, నిర్దిష్ట మార్గంలోని చెక్‌పోస్టుల్లో సైతం నమోదు కాలేదని వెల్లడైంది.

20న జాబిల్లి కక్ష్యలోకి చంద్రయాన్-2

అహ్మదాబాద్: చంద్రుడి మీద దిగేందుకు భారత్ తొలిసారిగా ప్రయోగించిన చంద్రయాన్-2 వ్యోమనౌక ఈ నెల 20న జాబిల్లి కక్ష్యలోకి ప్రవేశిస్తుంది. వచ్చే నెల 7న చందమామ ఉపరితలంపై కాలుమోపుతుందని ఇస్రో ఛైర్మన్ కె.శివన్ సోమవారం ఇక్కడ చెప్పారు. విక్రమ్ సారాభాయ్ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆయన అహ్మదాబాద్ వచ్చారు. 3850 కిలోల బరువున్న చంద్రయాన్-2లో ఆర్బిటర్, ల్యాండర్, రోవర్ ఉంటాయి. ఈ వ్యోమనౌకను గత నెల 22న శ్రీహరికోట నుంచి ప్రయోగించిన సంగతి తెలిసిందే.



ప్రతి పుటలోనూ ప్రతిబింబించే పటిమ

ఆ పుస్తకం.. వెంకయ్య కార్యదక్షతకు అద్దం

విద్య ఉద్దేశం ఉపాధి ఒక్కటే కాదు. జ్ఞానోదయం, సాధికారత, విజ్ఞాన వికాసం కూడా. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే యువతకు నాదో సలహా. అక్కడ నేర్చుకోండి, ఆర్జించండి, స్వదేశానికి తిరిగిరండి. (లెర్న్, ఎర్న్, రిటర్న్) మాతృదేశాభివృద్ధికి దోహదపడండి.

అనాది నుంచి ప్రపంచంలోనే అత్యంత ప్రబల సాంస్కృతిక శక్తిగా భారత్ కొనసాగుతోంది. సాంస్కృతిక, ఆధ్యాత్మిక, మేధోపరమైన అంశాల్లో ముందుండటం వల్ల 'విశ్వ గురువు'గా ఖ్యాతి గాంచింది.

ఉగ్రవాదానికి మతం, జాతి, రంగు లేవు. ఇది మానవాళికే శత్రువు. దీనిని కూకటివేళ్లతో పెకిలించివేసేందుకు ఐక్యంగా కృషిచేద్దాం.

వసుధైక కుటుంబం.. భారతీయ ప్రాథమిక తత్వం. అందరికీ పంచు, సంరక్షించు అనేదే దీనికి మూలం. అన్ని దేశాలూ కలిసి మనుగడ సాగించాలి. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి దిశగా సామరస్యంతో కృషి చేయాలి.

వెంకయ్యనాయుడు, కార్యదక్షత, సభానిర్వహణా చాతుర్యాలకు నిలువెత్తు నిదర్శనం ముప్పవరపు వెంకయ్యనాయుడు. ఉపరాష్ట్రపతిగా ఆయన ప్రస్థానం వీటన్నింటికీ దర్పణం. ఈ రెండేళ్లలో అనుభవాలను గుదిగుచ్చి ఆయన కార్యాలయం ఈ పుస్తకాన్ని సంకలనం చేసింది. 2017 ఆగస్టు 11న వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి రైతులు, విద్యార్థులు, మేధావులు, పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తల మనోభావాలను తెలుసుకొని, జాతి నిర్మాణం కోసం వారిని కార్యోన్ముఖులను చేసిన ఉదంతాలు ఈ పుస్తకంలోని ప్రతి పుటలోనూ ప్రతిబింబిస్తాయి. రెండేళ్లలో ఆయన 330 కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో జరిగిన 61 స్నాతకోత్సవాల్లో పాల్గొని, విద్యార్థులనుద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు. 35 సార్లు విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. స్వతహాగా రైతు కుటుంబానికి చెందిన వెంకయ్యనాయుడు అనేక సందర్భాల్లో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలకు ఎన్నెన్నో సూచనలు చేస్తూ వచ్చారు. గత రెండేళ్లలో 11 దేశాల అధ్యక్షులు, 7 దేశాల ఉపాధ్యక్షులు, 8 మంది ప్రధానమంత్రులతో సమావేశమయ్యారు. భారత్ ద్వైపాక్షిక సంబంధాల కొనసాగింపులో భాగంగా 4 ఖండాల్లోని 19 దేశాలను చుట్టివచ్చారు. కోస్టారికాలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో నడుస్తున్న యూనివర్సిటీ ఆఫ్ పీస్ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న తొలి భారతీయుడిగా ప్రత్యేకత సాధించారు. 1893లో పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రెలిజియన్స్ సభలో స్వామి వివేకానంద చారిత్రక ప్రసంగం చేసిన షికాగోలోని పుల్లెట్రాన్ హాల్లో భారతీయ సమాజాన్ని ఉద్దేశించి వెంకయ్యనాయుడు ఉపన్యసించారు. 238 రోజులపాటు రాజ్యసభా కార్యకలాపాలను నిర్వహించారు. ఇలా ప్రతి సంఘటనకూ సజీవసాక్ష్యంగా నిలుస్తూ.. ఈ పుస్తకం వెంకయ్యనాయుడిలోని ప్రతి కోణాన్నీ ఆవిష్కరించింది. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఔట్‌రీచ్ అండ్ కమ్యూనికేషన్ (బీఓసీ) ఈ పుస్తకాన్ని ప్రచురించింది.

–ఈనాడు, దిల్లీ

కృష్ణాజిల్లా ఎన్.ఎన్.పాలెంలో ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులతో గత ఏడాది ఆగస్టులో ముచ్చటిస్తున్న సందర్భంగా..

వ్యవసాయం మన ప్రాథమిక సంస్కృతి. మనమంతా కలిసి దాన్ని పరిరక్షిద్దాం, ప్రోత్సహిద్దాం. మరింత ఫలవంతంగా, సుస్థిరంగా మలచుదాం.

స్తబ్ధత కలిగిన జీవనశైలిని విడనాడండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి. నిత్యం వ్యాయామం చేయండి. దీర్ఘాయుష్షుతో ఆనందంగా జీవించండి.

విభేదాలు.. వివాదాలు కాకూడదు

- కశ్మీర్ మా అంతర్గత వ్యవహారం
- చైనాకు జయ్‌శంకర్ స్పష్టీకరణ

బీజింగ్: ద్వైపాక్షిక విభేదాలేవీ వివాదాలుగా మారకూడదని చైనాకు భారత్ స్పష్టంచేసింది. జమ్మూ-కశ్మీర్‌పై భారతదేశ నిర్ణయాలు తమ అంతర్గత వ్యవహారమని, వాటి ప్రభావం భారత సరిహద్దులపై గానీ, వాస్తవాధీన రేఖపై గానీ ఉండబోవని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయ్‌శంకర్ తేల్చిచెప్పారు. దీనిపై ఆ తర్వాత భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. భారతదేశం అదనపు భూభాగాన్ని ఏమీ కోరుకోవడం లేదని అందులో తెలిపింది. భారత్-చైనా సరిహద్దుల విషయంలో ఇరుదేశాలు గతంలోనే 2005 నాటి రాజకీయ సమీకరణాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పరస్పర ఆమోదయోగ్య ఒడంబడిక కుదుర్చుకున్నాయని చెప్పింది. మూడురోజుల పర్యటన కోసం చైనా వెళ్లిన కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జయ్‌శంకర్.. సోమవారం చైనా ఉపాధ్యక్షుడు వాంగ్ జిషాన్‌తో భేటీ అయ్యారు. అనంతరం విదేశాంగ మంత్రి వాంగ్ యితో చర్చలు జరిపారు. వాంగ్ నేరుగా భారత్-పాక్ ఉద్రిక్తతలనే ప్రస్తావించారు. తమ మధ్య చర్చలు బాగా జరిగాయని, మరిన్ని అంశాలపైనా చర్చలు జరుపుతామని చెప్పారు.

చైనా ఉపాధ్యక్షుడు వాంగ్ జిషాన్‌తో కరచాలనం చేస్తున్న జయ్‌శంకర్

నాలుగు ఒప్పందాలు.. 100 కార్యక్రమాలు

భారత్, చైనా ప్రజల మధ్య సాంస్కృతిక సంబంధాలు బలోపేతం కావడానికి, ప్రాచీన నాగరికతలను కాపాడుకోడానికి ఇరుదేశాలు నాలుగు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్ జయ్‌శంకర్, వాంగ్ యి మధ్య జరిగిన సమావేశం అనంతరం ఈ ఒప్పందాల మీద సంతకాలు జరిగాయి. సాంస్కృతిక సంబంధాలు, ఆరోగ్యం, క్రీడలు, మ్యూజియంల నిర్వహణలో సహకారంపై ఈ ఒప్పందాలు కుదిరాయి. సినిమాలు, ప్రసారాలు, ప్రజల మధ్య సంబంధాలు పెంపొందించేందుకు 100 కార్యక్రమాలు నిర్వహించాలని భారత్, చైనా నిర్ణయించాయి. వీటి ప్రారంభానికి సూచికగా ఒక సినిమా వారోత్సవాన్ని ఇరుదేశాలు ప్రారంభిస్తాయి.

కశ్మీర్‌లో శాంతియుతంగా బక్రీద్

శ్రీనగర్, జమ్మూ: చెదురుమదురు నిరసనలు మినహా ఈద్-అల్-అదా ప్రార్థనలు సోమవారం జమ్మూ-కశ్మీర్‌లో శాంతియుతంగానే సాగాయి. రాష్ట్రవ్యాప్తంగా కర్ఫ్యూ తరహా పరిస్థితులు ఉండటంతో పండుగ ఉత్సాహం మాత్రం ఎక్కడా కనిపించలేదు. శ్రీనగర్, షోపియాన్ జిల్లాల్లోని మసీదులకు ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి ప్రార్థనలు చేసుకున్నారని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రార్థనలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జమ్మూ-కశ్మీర్ గవర్నర్ అధికార ప్రతినిధి, ముఖ్య కార్యదర్శి రోహిత్ కన్సల్ చెప్పారు. పలు జిల్లాల్లో తగినన్ని గొర్రెలను అందుబాటులో ఉంచామన్నారు. 370 అధికరణం రద్దుతో తమకేమీ ఇబ్బంది లేదుగానీ, ఆంక్షల వల్ల కుటుంబసభ్యులతో మాట్లాడలేకపోయామని పలువురు చెప్పారు.

- దిల్లీ-లాహోర్ బస్సు సేవలను దిల్లీ రవాణా సంస్థ (డీటీసీ) రద్దుచేసింది. పాకిస్థాన్ దీన్ని ముందే రద్దుచేసింది.
- ఇబ్బందులలో ఉన్న కశ్మీరీలను ఆదుకునేందుకు సీఆర్పీఎఫ్ హెల్ప్‌లైన్ 14411 మళ్లీ మొదలైంది. 'మదద్‌గార్' (సాయం చేసేవారు) అనే పేరుతో ఉండే ఈ హెల్ప్‌లైన్ గతంలో మూగబోయింది.
- ఈద్-అల్-అదా సందర్భంగా బీఎస్ఎఫ్ జవాన్లు, పాకిస్థానీ రేంజర్ల మధ్య జరిగే మిఠాయిల పంపకాలు ఈసారి జరగలేదు.

రాహుల్‌కు విమానం పంపుతాం: గవర్నర్

కశ్మీర్‌లో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయన్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై గవర్నర్ సత్యపాల్ మాలిక్ మండిపడ్డారు. రాహుల్‌ను తాను కశ్మీర్‌కు ఆహ్వానించానని, ఆయనకు విమానం కూడా పంపుతానని, వచ్చి ఇక్కడి పరిస్థితి గమనించి అప్పుడు మాట్లాడాలని ఆయన అన్నారు.

ఈ ఖాతాలను మూసేయండి

దిల్లీ: కశ్మీర్‌కు చెందిన కొన్ని ఖాతాలను మూసేయాలని ట్విటర్‌కు కేంద్రప్రభుత్వం లేఖరాసింది. ఇవి వదంతులను, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తూ లోయలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని, అందువల్ల వీటిని మూసేయాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి లేఖ రాశారు. ఆయన పేర్కొన్న ఖాతాలలో ఒకటి వేర్పాటువాద నాయకుడు సయ్యద్ అలీ గిలానీకి చెందినదని అంటున్నారు. వాయిస్ ఆఫ్ కశ్మీర్, మదీహా షకీల్‌ఖాన్ తదితర 8 ఖాతాలను ఈ జాబితాలో పేర్కొన్నారు.

లద్దాఖ్ సరిహద్దులకు పాక్ యుద్ధవిమానాలు!

జమ్మూ-కశ్మీర్కు స్వయం ప్రతిపత్తిని భారత్ ఉపసంహరించడంపై నానా హడావుడి చేస్తున్న పాకిస్థాన్ తాజాగా తన రక్షణ బలగాలు, సాధన సంపత్తిని సరిహద్దుల వైపు కదలించడం మొదలుపెట్టింది. ఆ దేశ వైమానిక దళానికి చెందిన మూడు సి-130 రవాణా విమానాలు స్కర్దు వైమానిక స్థావరానికి సాధనాలను తరలించాయి. ఈ స్థావరం మన లద్దాఖ్ ప్రాంతానికి చేరువలో ఉంది. ఈ కదలికలపై భారత నిఘా సంస్థలు నిశితంగా కన్నేసి ఉంచాయి. స్కర్దు వైమానిక స్థావరంలో తన జేఎఫ్-17 యుద్ధవిమానాలను పాక్ మోహరించే అవకాశం కనిపిస్తోంది. ఈ లోహ విహంగాల కార్యకలాపాలకు తోడ్పాటు అందించే సాధనాలను తాజాగా అక్కడి పంపినట్లు భావిస్తున్నారు.



దిల్లీలో సోమవారం భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.పి.నడ్డా, కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు సమక్షంలో భాజపాలో చేరిన ప్రముఖ రెజ్లర్ బబితా ఫొగాట్, ఆమె తండ్రి మహావీర్ సింగ్ ఫొగాట్

గ్రీన్‌కార్డులు మరింత కష్టం

చట్టబద్ధ వలసదారులు ప్రభుత్వసాయం పొందితే కార్డు రానట్లే!

వాషింగ్టన్: గ్రీన్‌కార్డుల జారీలో ట్రంప్ ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించనుంది. అమెరికా తన పౌరుల కోసం అందించే వైద్యసాయం, ఆహార కూపన్లు, ఇంటి వోచర్లు లేదా మరేదైనా ప్రభుత్వ సాయాన్ని చట్టబద్ధమైన వలసదారులు పొందుతుంటే వారికి వీటిని నిరాకరించాలని కొత్త నిబంధన తెచ్చింది. ఇప్పటికే గ్రీన్‌కార్డులు పొందాలనుకునే వారు తాము అమెరికాకు భారం కాబోమని నిరూపించుకోవాలి. ఏయే సేవలు పొందే వారికి ప్రభుత్వ ఆహార కూపన్లు తదితరాలను ఇవ్వరో కొత్త నిబంధనల్లో విస్తృతంగా వివరించారు. కొత్త నిబంధనలు అక్టోబరు మధ్య నుంచి అమలులోకి వస్తాయి. వీటి వల్ల వలసదారులు సాయం అడగడానికి కూడా భయపడే పరిస్థితి వస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00